ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 27.06.2026 | సంపుటి :12 సంచిక : 338 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

**చేతిలో ఆధార్.. జేబులో పాస్‌పోర్టు.. అయినా**







# పౌరుడినని నిరూపించాలా?

**మరి భారత పౌరసత్వానికి అసలు ఆధారం ఏది?**
**దేశవ్యాప్తంగా మళ్లీ చర్చకు వచ్చిన పౌరసత్వ ప్రశ్న**

- ఆధార్, పాస్‌పోర్టు రెండూ పౌరసత్వానికి రుజువు కాదని స్పష్టమైన నిబంధనలు
- జనన ధృవీకరణ నుంచి వారసత్వ పత్రాల వరకు సామాన్యుడికి అసాధ్యమైన నిరూపణ
- ఒకే విధానంపై పార్లమెంట్‌లో చర్చకు న్యాయ నిపుణుల డిమాండ్



**పాస్‌పోర్ట్, ఆధార్‌ను ధ్రువీకరణ పత్రాలుగా గుర్తించాలి**
కేంద్ర విదేశాంగశాఖ ప్రకటన సరైంది కాదు : శశి థరూర్
2లో..

చేతిలో పాస్‌పోర్టు ఉన్నా.. ఆధార్ కార్డు చూపించినా..ఓటరు గుర్తింపు కార్డు ఉన్నా..“ఇవి భారత పౌరసత్వానికి తుది ఆధారాలు కావు” అని అధికా రులు చెబితే? ఇదే ప్రశ్న ప్రస్తుతం దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వ పథకాల కోసం తప్పనిసరి చేసిన పత్రాలే పౌరసత్వాన్ని నిరూపించలేవని స్పష్టమవుతుండటంతో సామాన్యుల్లో గందరగోళం నెలకొంది.

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇటీవలి కాలంలో పౌరసత్వం, జనగణన, జనాభా రిజిస్టర్ (ఎన్ పీఆర్), జాతీయ పౌరుల నమోదు (ఎన్‌ఆర్సీ) వంటి అంశాలపై రాజకీయ, న్యాయ, సామాజిక స్థాయిలో చర్చలు మళ్లీ వేగం పుంజుకున్నాయి. దీంతో “అసలు భారత పౌరసత్వానికి చట్టబద్ధమైన ఆధారం ఏమిటి?” అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది.

**ఆధార్, పాస్‌పోర్టు ఎందుకు సరిపోవు?**
2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పులో ఆధార్ అనేది వ్యక్తి గుర్తింపు, నివాస ధృవీకరణ కోసం మాత్రమేనని, అది భారత పౌరసత్వాన్ని నిర్ధారించే పత్రం కాదని స్పష్టం చేసింది. అయినప్పటికీ బ్యాంకు ఖాతా, గ్యాస్ కనెక్షన్, పాన్ లింకింగ్, ప్రభుత్వ సంక్షేమ పథకాల వరకు దాదాపు అన్ని సేవలకు ఆధార్ తప్పనిసరిగా మారింది. దీంతో ప్రజల్లో సహజంగానే అయోమయం నెలకొంటోంది. పాస్‌పోర్టు కూడా ప్రయాణ పత్రంగా మాత్రమే పరిగణించబడుతుంది. అది జారీ చేయడానికి అనేక ధృవీకరణలు జరిగినప్పటికీ, చట్టపరం గా పాస్‌పోర్టు ఒక్కటే పౌరసత్వానికి తుది రుజువు కాదని నిపుణులు చెబుతున్నారు. అస్సాంలో జరిగిన ఎన్‌ఆర్సీ ప్రక్రియలో మిగతా 2లో..

# డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం

- ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములే
- ఈ భూతాన్ని తరిమి కొట్టడంలో కలసి రండి
- ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు



హైదరాబాద్,జూన్26(జనంసాక్షి):సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. మిగతా 2లో..

# సీఎంవోలో భారీ మార్పులు

- ఈ విభాగం నుంచి అజిత్ రెడ్డి ఔట్
- ఇన్వెస్ట్ తెలంగాణ సీవీవోగా నియామకం
- రాష్ట్రంలో పలువురు ఐఎఎస్‌ల బదిలీ
- సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్. శ్రీధర్
- జీఎండీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్
- అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా బదిలీలలో భాగంగా ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. మిగతా 2లో..



## కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

**ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**
**1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి**
**జూన్ 30తో ముగియనున్న రామకృష్ణారావు పదవీ కాలం**

హైదరాబాద్, జూన్26(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు మిగతా 2లో..

# శిథిలాల కింద వేలమంది?

**రాజధాని కారకాస్‌లో భారీ విధ్వంసం**

- క్రమంగా పెరుగుతోన్న మృతుల సంఖ్య
- ఇప్పటివరకు 589 మృతదేహాల వెలికితీత
- మూడు వేలకు పైగా క్షతగాత్రులు
- ఇంకా దొరకని 40వేల మంది ఆచూకీ
- కొనసాగుతున్న సహాయక, రెస్క్యూ చర్యలు
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన ప్రభుత్వం



కారకాస్, జూన్26(జనంసాక్షి): దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాను భారీ భూకంపాలు వణికించాయి. సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు శక్తిమంతమైన భూప్రకంపనలతో దేశవ్యాప్తంగా తీవ్ర విధ్వంసం చోటుచేసుకుంది. ఈ ప్రకృతి విపత్తులో మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటివరకు 589 మంది మృతి చెందినట్లు వెనెజువెలా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 3వేల మంది గాయపడినట్లు తెలిపింది. అనేక మంది భవన శిథిలాల కింద చిక్కు కుపోవడంతో సహాయక బృందాలు వారిని వెలికి తీసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నాయి. అధికారుల సమాచారం ప్రకారం, ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40 వేల మంది ఆచూకీ తెలియడం లేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. రాజధాని కారకాస్‌తో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో భూప్రకంపనలు సంభవించినప్పటికీ, తీర ప్రాంత నగరమైన లా గువేరాలో అత్యధిక నష్టం మిగతా 2లో..

# ‘సర్’ ప్రక్రియకు పాస్‌పోర్ట్ ఓకే

**ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకోవచ్చు**
**ఎన్నికల సంఘం కీలక ప్రకటన**



న్యూఢిల్లీ,జూన్26(జనంసాక్షి): ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో పాస్‌పోర్ట్ పాత్రపై కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఒక ముఖ్యమైన వివరణ ఇచ్చింది. ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవాలన్న లేదా ప్రస్తుతం వివరాలను సవరించుకోవాలన్నా అవసరమైన 12 రకాల ధృవీకరణ పత్రాలలో పాస్‌పోర్ట్ కూడా ఒకటిగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ వివరణ సాధారణ ఓటర్లకు, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఎంతో ఊరటనిచ్చే అంశం. విదేశీ వ్యవహారాల మిగతా 2లో..

# తెలంగాణకు భారీ వర్షసూచన

**ఆరెంజ్ అలర్ట్ జారీచేసిన వాతావరణశాఖ**
2లో..

**అయోధ్య దొంగతనం కేసులో**

# కీలక మలుపు



- ట్రస్ట్ ప్రధాన కార్యదర్శులు రాజీనామా
- ఆలయ విరాళాలు దుర్వినియోగం కేసులో 8మంది అరెస్ట్

న్యూఢిల్లీ,జూన్26(జనంసాక్షి): సిట్ దర్యాప్తు అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో అయోధ్య రామ మందిర కానుకల చోరీ కేసు మరింత ముదిరింది. రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇప్పుడు రాజీనామా చేశారు. ఆయనతోపాటు అనిల్ మిశ్రా కూడా తప్పుకున్నారు. విరాళాలు, కానుకల దొంగతనం ఆరోపణల నేపథ్యంలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ఇద్దరిపై రాజీనామా చేయాలని ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. అందుకే వారు తప్పుకున్నారు. రామ మందిర విరాళాల దొంగతనం కేసులో సిట్ నివేదిక నేపథ్యంలో, పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. నిందితులు ఎనిమిది మంది మధ్యాహ్నం 2:00 గంటల తర్వాత కోర్టులో హాజరుపరుస్తారు. మొహర్రం కారణంగా ఈరోజు కోర్టులకు సెలవు. అందువల్ల, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తారు. డ్యూటీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అనగా, సాధారణ కోర్టు పనివేళల వెలుపల, సెలవు దినాల్లో లేదా వారాంతాల్లో, అరెస్టు, మిగతా 2లో..

# నిధుల గోల్‌మాల్‌పై జవాబివ్వండి

**అయోధ్యలో రూ.200కోట్ల అవినీతిపై ప్రజలకు సమాధానం చెప్పాలి**
**ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్**

**మతం మారినంత మాత్రాన**

# రిజర్వేషన్లు వర్తించవు

- ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమైనవి
- సంచలన తీర్పు వెల్లడించిన మద్రాస్ హైకోర్టు



మద్రాస్, జూన్26(జనంసాక్షి): మతం మార్పిడులు, రిజర్వేషన్ల ప్రయోజనాలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఇతర వెనుకబడిన వర్గాల నుండి ఇస్లాం మతంలోకి మారిన వారికి “వెనుకబడిన తరగతి ముస్లిం” కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును హైకోర్టు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ పూర్తిగా కొట్టివేసింది. 2024 మార్చి 9న తమిళనాడు ప్రభుత్వం ఒక ప్రత్యేక ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం... వెనుకబడిన తరగతి ), అత్యంత వెనుకబడిన మిగతా 2లో..

# ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ విప్లవం

- ఈ రంగంలో పురోగతితో ఆర్థిక సాధికారత
- తద్వారా ప్రజల జీవన ప్రమాణాల్లో పెరుగుదల
- నెదర్లాండ్స్ క్వీన్ మాక్సిమాతో భేటీలో మోదీ
- డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ



న్యూఢిల్లీ,జూన్26(జనంసాక్షి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి (ఫైనాన్షియల్ హెల్త్), నెదర్లాండ్స్ రాణి అయిన క్వీన్ మాక్సిమా గురువారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ కీలక భేటీలో, భారతదేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆర్థిక సేవలు సామాన్యులకు ఏ విధంగా మరింత సులభంగా, సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చాయనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి. ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సామాన్య పౌరుల జీవన ప్రమాణాలను ఏ విధంగా మారుస్తున్నాయో ఇద్దరు నేతలూ సుదీర్ఘంగా సమీక్షించారు. ధాని మోదీ తన (ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ సమావేశం గురించి వివరిస్తూ, ఆర్థిక సమ్మిళితంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన గొంతుకగా ఉన్న క్వీన్ మాక్సిమాను కలవడం సంతోషంగా ఉందని తెలిపారు. భారతదేశంలో ఆధార్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ , ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన వంటి డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నడిచే డిజిటల్ విప్లవం.. ప్రజల జీవన ప్రమాణాల్ని ఏ విధంగా పెంచుతోందో వారు చర్చించారు. ఈ డిజిటల్ విధానాలు లక్షల మంది ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, ఆర్థిక సాధికారత కల్పిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. భారతదేశం సాధించిన మిగతా 2లో..

# ‘సిందూర్’లో అమరులైంది వీరే..

**అధికారికంగా ప్రకటించిన కేంద్రం**

న్యూఢిల్లీ,జూన్26(జనంసాక్షి):పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా గతేడాది పాకిస్థాన్‌పై జరిపిన ‘ఆపరేషన్ సిందూర్‌లో మన దేశం కొంతమంది వీరజవాన్లను కోల్పోయింది. దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన ఆ అమరవీరుల పేర్లను కేంద్రం ఇప్పుడు అధికారికంగా ప్రకటించింది. వారి పేర్లను నేషనల్ వార్ మెమోరియల్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. ఈ ఆపరేషన్‌లో ప్రాణాలు కోల్పోయిన జవాన్ల పేర్లను కేంద్రం వెల్లడించడం ఇదే తొలిసారి.‘ఆపరేషన్ సిందూర్’లో ఐదుగురు ఆర్మీ అధికారులతో పాటు ఓ అగ్నివీర్ దేశం కోసం పోరాడుతూ వీరమరణం పొందారు. మిగతా 9లో..




# మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

**రూ.107 కోట్లతో చేపట్టిన హైడ్రా**

హైదరాబాద్,జూన్26(జనంసాక్షి): నగరంలో వరదల కట్టడి, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీచెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ. 107 కోట్ల భారీ వ్యయంతో మరో నాలుగు ప్రముఖ చెరువుల అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అధికారికంగా ప్రారంభించారు. ఇబ్రహీంపట్నంలోని పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద ఆయన స్వయంగా భూమి పూజ చేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశిం చారు. హైడ్రా చేపట్టిన ఈ పునరుద్ధరణ మిగతా 9లో..

## అయోధ్య దొంగతనం కేసులో కీలక మలుపు

రిమాండ్ లేదా బెయిల్‌కు సంబంధించిన అత్యవసర న్యాయపరమైన విషయాలను విచారించడానికి నియమించిన న్యాయమూర్తి.రామ మందిర కానుకల దొంగతనం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయిన అనంతరం, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఒక కీలక ప్రకటన విడుదల చేశారు. ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించిందని ఆయన తెలిపారు. సిట్ వేగంగా దర్యాప్తు జరిపి తన నివేదికను సమర్పించగా, వెంటనే కేసులు నమోదు చేశారు. ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే వారిని వదిలిపెట్టబోమని ఆయన అన్నారు. అయోధ్య హిందూ విశ్వాసానికి ప్రతీక. విశ్వాసాన్ని దెబ్బతీయడం ఆమోదయోగ్యం కాదు అని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరంలో కానుకల దొంగతనం జరిగింది. ఇది బహిర్గతమైన వెంటనే ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఆ సిట్ నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇందులో పలువురు గుర్తుతెలియని వ్యక్తులతోపాటు, ఎనిమిది మందిని నిందితులుగా చేర్చారు. ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా, శ్రీ రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, శ్రీరామ్ శంకర్ యాదవ్ అలియాస్ తిను పేర్లు చేర్చారు. గుర్తించని ఇతర వ్యక్తులను కూడా నిందితులుగా పేర్కొన్నారు. నిందితులపై భారత శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్లు, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఎ) కింద అభియోగాలు మోపారు.ఎఫ్ఐఆర్ నమోదైన వారందరూ ఆలయంలోని విరాళాలు, నగదు నిర్వహణతో ఏదో ఒక విధంగా ఆలయం ట్రస్ట్‌తో సంబంధం కలిగి ఉన్నారని చెబుతున్నారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి అయిన చంపత్ రాయ్‌కు తిన్ను యాదవ్ సహచరుడని చెబుతున్నారు. విరాళాల పెట్టె తాళాలు అతని వద్దే ఉన్నాయని విచారణలో వెల్లడైంది. అనుకల్ప్ మిశ్రా విరాళాలను లెక్కించేవాడు . లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రాకు బంధువని చెబుతున్నారు. మనీష్ యాదవ్, తిన్ను యాదవ్ మేనల్లుడు. సుభాష్ శ్రీవాస్తవ నగదు లెక్కించేవాడు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అవినాష్ శుక్లా కూడా పాలుపంచుకున్నాడు. కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా కూడా నగదు లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు. ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా పేర్కొన్న వ్యక్తులు చాలావరకు కానుకల లెక్కింపు, నగదు నిర్వహణ ప్రక్రియలో పాలుపంచుకున్న ఉద్యోగులేనని అర్థమవుతోంది. ఇది, వీరు వ్యవస్థలోని కింది స్థాయి వ్యక్తులు మాత్రమేనా, లేక ఈ వ్యవస్థ మొత్తం ఉన్నతాధికారుల ఆదేశాలు, రక్షణలో పనిచేస్తోందా అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది. కాగా యోధ్యలోని రామమందిరానికి వచ్చిన విరాళాలను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సభ్యుడు కృష్ణ మోహన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం ఎఫ్ఐఆర్‌లో పేర్లున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి వివరాలను రాబట్టేందుకు విచారణ చేపడుతున్నారు.

## నిధుల గోల్‌మాల్‌పై జవాబివ్వండి

హైదరాబాద్(జనంసాక్షి): అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ పేరుతో రూ.200 కోట్లు అవినీతి చేశారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు చేశారు. రాముడి పేరు చెప్పి వసూలు చేసిన డబ్బుతో ఏం చేస్తున్నారో బీజేపీ ప్రజలకు చెప్పాలన్నారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల అవకతవకలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్‌కు సంబంధించి ఎలాంటి అవినీతి జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారని.. కానీ యూపీ సిట్ పోలీసులు చంపత్ రాయ్ మనుషులను అరెస్టు చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలు చేశారని అన్నారు. చంపత్ రాయ్‌ను ట్రస్ట్ కార్యదర్శి పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. యూపీ సీఎం పదవికి యోగీ ఆదిత్య నాథ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది యూపీకి సంబంధించిన వ్యవహారం కాదని.. దేశ ప్రజలకు సంబంధించిన అంశమన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ఎంపీలు 20 మందిని, మహారాష్ట్రలో శివసేన ఉద్ధవ్ థాక్రే ఎంపీలు 6 మందిని.. ఒక్కొక్కరికీ రూ.75 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేసిందంటూ వ్యాఖ్యానించారు. రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో ప్రధాని మోదీ, అమిత్ షా, యోగీ ఆదిత్య నాథ్ ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడారని చామల మండిపడ్డారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాను పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకుంటే సరిపోదన్నారు. దేశంలో ప్రజలు ఏ స్థితిలో ఉన్నా అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చారన్నారు. 'ప్రజలు దేవుడి కోసం డబ్బులు ఇచ్చారు. మీరు దోచుకోవడం కోసం కాదు' అంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## తెలంగాణకు భారీ వర్షసూచన

హైదరాబాద్,జూన్26(జనంసాక్షి): తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 27వ తేదీ నుంచి జులై 2వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని తెలిపింది. గంటకు 40?50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి, రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వర్షపాతపై ఎల్‌నినో పడగఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది.

# చేతిలో ఆధార్.. జేబులో పాస్‌పోర్టు..అయినా పౌరుడినని నిరూపించాలా?

పాస్‌పోర్టు కలిగిన కొందరు వ్యక్తులు కూడా జాబితాలో లేకపోవడం ఈ చర్చకు మరింత బలం చేకూర్చింది.

**ప్రజల ఆందోళన ఏమిటి?**

భారత పౌరసత్వ చట్టం?1955, తదనంతర సవరణల ప్రకారం పౌరసత్వ నిర్ధారణకు జనన తేదీ, తల్లిదండ్రుల పౌరసత్వం, కుటుంబ వారసత్వ పత్రాలు, పాత భూమి రికార్డులు, పాఠశాల ధృవీకరణ పత్రాలు, ఓటరు జాబితాలు వంటి అనేక ఆధారాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. 1987 జూలై 1 తర్వాత జన్మించిన వారి విషయంలో తల్లిదండ్రుల్లో కనీసం ఒకరు భారత పౌరులై ఉండాలి. 2004 డిసెంబర్ 3 తర్వాత జన్మించిన వారి విషయంలో మరింత కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఎన్ఆర్సీ వంటి ప్రత్యేక ప్రక్రియలు అమలులోకి వస్తే చారిత్రక రికార్డులు, వారసత్వ పత్రాలు కూడా కీలకంగా మారే అవకాశం ఉంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో, నిరక్షరాస్య కుటుంబాల్లో, ప్రకృతి విపత్తుల వల్ల పత్రాలు కోల్పోయిన వారి వద్ద ఇలాంటి రికార్డులు లేకపోవడం పెద్ద సమస్యగా మారుతోంది. దశాబ్దాలుగా ఒకే గ్రామంలో నివసిస్తున్న వారు కూడా పత్రాల లేమితో ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**గొంతువిప్పిన పౌర సమాజం**

కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ సహా పలు రాజకీయ పార్టీలు ప్రజలపై అనవసరంగా పౌరసత్వ నిరూపణ భారం మోపకూడదని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పౌరసత్వ చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తున్నామని, ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించవద్దని గతంలో పలుమార్లు స్పష్టం చేసింది. న్యాయ నిపుణులు, పౌరసంఘాలు మాత్రం దేశవ్యాప్తంగా ఒకే విధమైన, పారదర్శకమైన, అందరికీ అర్థమయ్యే పౌరసత్వ నిర్ధారణ వ్యవస్థను రూపొందించాలని సూచిస్తున్నాయి. నిరక్షరాస్యులు, పేదలు, మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని వారు అభిప్రాయపడుతున్నారు. రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశంపై సమగ్ర చర్చ జరిగే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. దేశంలోని ప్రతి పౌరుడికి సందేహాలకు తావులేని స్పష్టమైన విధానం తీసుకురావాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## పాస్‌పోర్ట్, ఆధార్‌ను ధ్రువీకరణ పత్రాలుగా గుర్తించాలి



న్యూఢిల్లీ(జనంసాక్షి): పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర విదేశాంగశాఖ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. కేంద్రం చెబుతున్న విధానం చట్టపరంగా ఒక విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తోందని ఆయన విమర్శించారు. పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువు కాదని, ఆధార్ కూడా పౌరసత్వాన్ని నిర్ధరించదని చెబితే, సాధారణ భారతీయుడు తన పౌరసత్వాన్ని ఎలా నిరూపించుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఆ అంశంపై ఉన్న అయోమయాన్ని తొలగించేందుకు చట్టాల్లో సవరణలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్వహించిన 'పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా విదేశీ ప్రయాణానికి ఉపయోగించే పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ధ్రువీకరణ పత్రం కాదని స్పష్టం చేసింది. ఆ ప్రకటన అనంతరం సామాజిక మాధ్యమాలు, రాజకీయ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. దీనిపై శుక్రవారం 'ఎక్స్' వేదికగా స్పందించిన శశి థరూర్, కేంద్రం వైఖరిని ప్రశ్నిస్తూ పోస్టు చేశారు. ఇదిలా ఉండగా, ఆధార్ కార్డుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఆయన ప్రస్తావించారు. ఆధార్ అనేది వ్యక్తి గుర్తింపు, నివాసానికి సంబంధించిన పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ఆధారం కాదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసిందని గుర్తు చేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం కోట్లాది మంది భారతీయులు ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఆ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆయన కొన్ని సూచనలు కూడా చేశారు. చట్టాల్లో మార్పులు చేసి, ప్రభుత్వం రద్దు చేయనంత వరకు చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్ లేదా సాధారణ ఆధార్ కార్డును భారత పౌరసత్వానికి తుది ఆధారంగా గుర్తించాలని సూచించారు. అలాగే, భారతీయులు, నివాసితులకు ప్రత్యేక రంగు లేదా ప్రత్యేక గుర్తింపుతో ఉండే ఆధార్? కార్డులను యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా జారీ చేయాలని ప్రతిపాదించారు. ఈ విధంగా భారతీయ పౌరులు, పౌరులు కాని వారిని స్పష్టంగా వేరు చేయవచ్చని శశి థరూర్ అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత సాధారణ ఆధార్ కార్డు లేదా చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ప్రభుత్వం గుర్తించవచ్చని చెప్పారు. దీంతో ఎన్నికల జాబితాల సవరణలు వంటి ప్రక్రియల్లో అనవసర వివాదాలు తగ్గుతాయని, పరిపాలనా ప్రక్రియలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. "ఈ రెండు పత్రాల్లో ఏదో ఒకటి ఉంటే భారత పౌరుడిగా గుర్తించే విధానాన్ని అమలు చేస్తే, పౌరసత్వంపై అనవసర చర్చలకు ముగింపు పడుతుంది. ప్రజలకు కూడా తమ గుర్తింపు విషయంలో పూర్తి చట్టపరమైన స్పష్టత లభిస్తుంది" అని శశి థరూర్ తన పోస్టులో పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం నిర్వహించిన సమావేశంలో భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి తుది ఆధారం కాదని వెల్లడించింది. అనంతరం గురువారం కూడా ఆ అంశంపై మరోసారి స్పష్టత ఇచ్చింది. ఇటీవల లేదా గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ఎప్పుడూ ప్రకటించలేదని తెలిపింది. దీనికి ఆధారంగా పాస్‌పోర్ట్ చట్టం-1967లోని సెక్షన్-20ను కేంద్రం ప్రస్తావించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే భారత పౌరుడు కాని వ్యక్తికీ కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాన్ని జారీ చేయవచ్చని ఆ సెక్షన్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా, 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా కేంద్రం ప్రస్తావించింది. కేవలం పాస్‌పోర్ట్ కలిగి ఉండటం వల్ల మాత్రమే ఒక వ్యక్తి భారత పౌరుడిగా నిర్ధారణ కాదని హైకోర్టు అప్పుడే స్పష్టం చేసిందని తెలిపింది.

## డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం

డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## మతం మారినంత మాత్రాన రిజర్వేషన్లు వర్తించవు

తరగతి , డినోటిఫైడ్ కమ్యూనిటీస్ ), షెడ్యూల్డ్ కులాల (రాజ)కు చెందిన వ్యక్తులు ఇస్లాం మతంలోకి మారినప్పటికీ, వారు 'బీసీ ముస్లిం' కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను పొందడం కొనసాగించవచ్చని పేర్కొంది. అంతేకాకుండా, ప్రభుత్వం నోటిఫై చేసిన ఏడు ప్రత్యేక బీసీ ముస్లిం వర్గాలలో ఒకదానికి చెందిన సభ్యులుగా వారిని గుర్తిస్తూ కమ్యూనిటీ సర్టిఫికేట్లు జారీ చేయడానికి కూడా ఈ ఉత్తర్వు అనుమతించింది. తమిళనాడు ప్రభుత్వ భావన చట్టపరంగా మరియు భావనాత్మకంగా పూర్తిగా తప్పని మద్రాస్ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. "ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తి వెనుకబడిన తరగతి ముస్లిం హోదాను పొందలేరని మేము నిర్ధారిస్తున్నాము. మతం మారిన వ్యక్తి కేవలం ఒక ముస్లిం మాత్రమే అవుతాడు, అంతే తప్ప ప్రత్యేక వర్గానికి చెందడు" అని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఏడు ప్రత్యేక వెనుకబడిన ముస్లిం వర్గాలలో అన్సార్, దక్కనీ ముస్లింలు, దుబేకుల, లబ్బాయి, మాపిళ్ళ, షేక్, సయ్యద్ ఎవరైనా కొత్తగా మతం మారిన వారిని సభ్యునిగా పరిగణించడం సాధ్యం కాదని, అందువల్ల వారు ఆ వర్గం కింద రిజర్వేషన్లు పొందడానికి అర్హులు కారని కోర్టు తేల్చి చెప్పింది. జూలై 2008లో జారీ చేసిన ఒక ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా తమిళనాడులోని పైన పేర్కొన్న ఏడు ముస్లిం వర్గాలను ప్రత్యేక కేటగిరీలో చేర్చారు. అయితే, ఇతర సామాజిక వర్గాల నుండి ఇస్లాంలోకి మారిన వారికి కూడా ఈ సర్టిఫికేట్లు ఇవ్వాలనే 2024 నాటి ప్రభుత్వ నిర్ణయం చెల్లదని హైకోర్టు స్పష్టం చేయడంతో తమిళనాడు ప్రభుత్వానికి దౌత్యపరంగా పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

## సీఎంవోలు భారీ మార్పులు

జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులు అయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా.. ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా.. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే.. హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళను, తెలంగాణ రెడ్కో ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్ / ఎక్స్-ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకు రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు సుదీర్ఘ పదవీ కాలం పొడిగించిన గడువుతో సహా జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత బ్యూరోక్రాటిక్ పదవిని స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ , మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాకుండా, గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు.సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ , కేంద్ర సమాచార-ప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల దిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి.ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ తరుణంలో రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్ , వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి.. ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట్ అని భావించారు. అంతేకాకుండా, కేంద్ర నిధుల సాధనలోను, కేంద్ర-రాష్ట్రాల మధ్య పెండింగ్ జలవివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకు దిల్లీలో ఉన్న సీనియారిటీ మరియు పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం గట్టిగా విశ్వసించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురుకానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది.

# శిథిలాల కింద వేలమంది?

వాటిల్లింది. భూకంపం ధాటికి అక్కడి పరిస్థితి దయనీయంగా మారింది. ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల వివరాల ప్రకారం, లా గువేరాలో 100కు పైగా భవనాలు పూర్తిగా కూలిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించడం, వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం అత్యంత క్లిష్టంగా మారిందని వారు తెలిపారు. భారీ కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు ప్రత్యేక యంత్రాలను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సుమారు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా నేలమట్టమైనట్లు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ తెలిపారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని శాఖలను అప్రమత్తం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విపత్తు సమయంలో తమ దేశానికి అండగా నిలిచిన ప్రపంచ దేశాలకు డెల్సీ రోడ్రిగ్స్ కృతజ్ఞతలు తెలిపారు. మానవతా దృక్పథంతో సహాయక చర్యల్లో భాగస్వాములవుతున్న అన్ని దేశాలకు వెనెజువెలా ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ప్రపంచ దేశాలు చూపుతున్న సంఘీభావం తమకు ఎంతో ధైర్యాన్ని ఇస్తోందని ఆమె అన్నారు.భూకంపం అనంతరం సమాచార మార్పిడిని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు, సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. అత్యవసర సమాచారాన్ని ప్రజలకు త్వరగా చేరవేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని సూచించారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలాలో 'ఎక్స్' సామాజిక మాధ్యమ వేదికను మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. 2024లో అప్పటి ప్రభుత్వం ఈ మైక్రోబ్లాగింగ్ వేదికపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, వెనెజువెలాకు అంతర్జాతీయంగా భారీగా సహాయం అందుతోంది. అమెరికా 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని పంపనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసినట్లు తెలిపింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ తదితర దేశాలు కూడా వైద్య బృందాలు, సహాయక సిబ్బంది, అత్యవసర సామగ్రిని పంపేందుకు ముందుకొచ్చాయి. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని సజీవంగా రక్షించేందుకు సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న ప్రభుత్వం, బాధితులకు అవసరమైన అన్ని విధాల సహాయాన్ని అందించేందుకు చర్యలు చేపడుతోంది.

**వందేళ్లలో ఎప్పుడూ చూడని విధ్వంసం!**

లాటిన్ అమెరికా దేశమైన వెనిజులాలో గురువారం తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం) రెండు పవర్‌ఫుల్ భూకంపాలు పెను విధ్వంసాన్ని సృష్టించాయి. భారీగా నష్టాన్ని మిగిల్చాయి. రాజధాని కారకాస్‌తో సహా పలు ప్రాంతాల్లో భవనాలు పేకమేడల్లా కుప్ప కూలిపోవడంతో ప్రజలు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఈ ప్రకృతి విధ్వంసానికి భారీ నష్టం వాటిల్లినట్లు నివేదికలు వెలువడ్డాయి. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం, గత 100 సంవత్సరాలలో వెనిజులాను తాకిన అత్యంత శక్తివంతమైన భూకంపాల్లో ఇది ఒకటిగా చెబుతోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం లక్ష మంది వరకు మరణించి ఉండవచ్చు. భూకంపం తరువాత, యూఎస్ పసిఫిక్ సునామీ హెచ్చరిక కేంద్రం ప్యూర్టో రికో, యూఎస్, బ్రిటిష్ వర్జిన్ దీవులు, అరుబా, కురాకో, బొనైర్ తీరాలకు సునామీ హెచ్చరికను జారీ చేసింది.

## ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం

ఈ సాంకేతిక, ఆర్థిక సమ్మిళిత అనుభవాలను ప్రపంచంలోని ఇతర భాగస్వామ్య దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు భారతదేశ మోడల్ ఒక ఖర్చు-తక్కువ, సులభతరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని భారత ప్రభుత్వం పదేపదే తెలియజేస్తోంది. ఐక్యరాజ్యసమితి ఫైనాన్షియల్ హెల్త్ అడ్వకేట్‌గా తన మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా క్వీన్ మాక్సిమా.. ముంబై, న్యూఢిల్లీలను సందర్శించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, భారతదేశం ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అద్భుతమైన ప్రగతిని సాధించిందని ప్రశంసించారు. ఒకప్పుడు కేవలం బ్యాంకింగ్ సేవలు అందించడం పైనే దృష్టి ఉండగా, ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి ప్రజల వాస్తవ ఆర్థిక ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచాలన్నది ప్రధాన అంశంగా మారిందని ఆమె అన్నారు. ముంబై పర్యటనలో క్వీన్ మాక్సిమా కొందరు సాధారణ ప్రజలు, నర్సులు, యువతతో ముఖాముఖి చర్చలు జరిపారు. వారు తమ ఆర్థిక నిర్వహణ, బడ్జెటింగ్, పొదుపు కోసం డిజిటల్ యాప్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను ఉచితంగా అందించే 'జన్ ధన్' పథకం లబ్ధిదారులతో కూడా ఆమె ముచ్చటించి వారి సాధక బాధకాలను విన్నారు. డిజిటల్ చెల్లింపులు, సబ్సిడీల నేరు బదిలీ వంటి కార్యక్రమాలతో భారతదేశం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో అందరికీ సురక్షితమైన, అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడంలో క్వీన్ మాక్సిమా, ప్రధాని మోదీ మధ్య జరిగిన ఈ చర్చలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

## 'సర్'కు పాస్‌పోర్ట్ ఓకే

మంత్రిత్వ శాఖ 1967 పాస్‌పోర్ట్ చట్టాన్ని ఉటంకిస్తూ, పాస్‌పోర్ట్ అనేది కేవలం ప్రయాణ పత్రమే కానీ, అది పౌరసత్వానికి నిరూపణ కాదని పేర్కొంది. ఈ ప్రకటన సోషల్ మీడియా, రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ పౌరసత్వం విషయంలో సమస్యలు వస్తాయా? ఓటర్ల జాబితాలో పాస్‌పోర్ట్ ఆధారంగా పేరు నమోదు చేయడం సాధ్యం కాదా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమయ్యాయి. దీంతో ఎన్నికల సంఘం క్లారిటీ ఇచ్చింది. ఎన్నికల సంఘం అధికారుల ప్రకారం, ఓటర్ల జాబితాలో ఒక వ్యక్తి పేరు చేర్చడానికి ఆ వ్యక్తి భారతీయ పౌరుడై ఉండటం, నిర్ణీత వయసు కలిగి ఉండటం ప్రాథమిక సూత్రం. దీనిని నిరూపించడానికి ఓటరు నమోదు అధికారి కొన్ని పత్రాలను పరిశీలిస్తారు. ఈ పత్రాల జాబితాలో పాస్‌పోర్ట్ ఎప్పటి నుంచో ఉంది. అది అలాగే కొనసాగుతుంది. " పాస్‌పోర్ట్ అనేది ఒక వ్యక్తి గుర్తింపును, నివాసాన్ని ధృవీకరించే కీలక పత్రం. ఇందులో ఎలాంటి మార్పు లేదు" అని ఒక ఉన్నతాధికారి స్పష్టం చేశారు. గతంలో బిహార్‌లో జరిగిన ాҳ=, అసోంలో జరిగిన ప్రత్యేక సవరణలు, ఆ తర్వాత జరిగిన వివిధ దశల ఓటర్ల జాబితా సవరణలలో కూడా పాస్‌పోర్ట్‌ను ఒక ప్రామాణిక పత్రంగానే పరిగణించారు. గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం ఈ విషయంలో ఎలాంటి కొత్త విధానాన్ని తీసుకురాలేదని, పాత పద్ధతులే అమల్లో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అంటే దశాబ్ద కాలంగా పాస్‌పోర్ట్ అనేది ఓటరుగా నమోదు కావడానికి ఒక నమ్మదగిన ఆధారంగా ఉంటూ వస్తోంది. చట్టపరంగా చూస్తే పాస్‌పోర్ట్ అనేది ఒక వ్యక్తి భారత వెలుపలికి వెళ్లడానికి లేదా తిరిగి రావడానికి ఇచ్చే ప్రయాణ పత్రం. అయితే ఓటర్ల జాబితా తయారీ సమయంలో , సదరు వ్యక్తి వివరాలను సరిచూడటానికి అధికారులు కోరే 12 పత్రాలలో ఇది ఒకటి. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ దరఖాస్తుదారు సమర్పించిన ఈ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఓటు హక్కుపై నిర్ణయం తీసుకుంటారు. ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసేటప్పుడు పాస్‌పోర్ట్ మాత్రమే కాకుండా, ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి మరో 11 పత్రాలను కూడా ప్రభుత్వం అనుమతిస్తుంది. కేంద్ర ప్రభుత్వం కానీ, ఎన్నికల సంఘం కానీ పాస్‌పోర్ట్ ప్రాముఖ్యతను తగ్గించే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఓటరు నమోదు ప్రక్రియలో దరఖాస్తుదారు పత్రాలను అంగీకరించే పూర్తి అధికారం సంబంధిత అధికారులకు ఉంటుంది. పాస్‌పోర్ట్ సమర్పించినప్పుడు దాన్ని నిరాకరించడానికి వీలులేదని తాజా వివరణ ద్వారా స్పష్టమవుతుంది.

**ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకోవచ్చు**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైంది. జులై 24వ తేదీ వరకు దీనిని నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియల భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను అందిస్తున్నారు.

# పారిశ్రామికవేత్తల కోసం వారానికి ఒక రోజు కేటాయిస్తా

- పెట్టుబడులే కాదు.. ప్రజల బతుకులూ ముఖ్యం
- పవర్ కట్స్ లేవు.. నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రజా ప్రభుత్వానికి పారిశ్రామిక వృద్ధి అంటే కేవలం పెట్టుబడుల గణాంకాలు మాత్రమే కాదని.. అది ప్రజల జీవనోపాధి అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం నాడు హైటెక్స్ లో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్ పో 2026 ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం, పరిశ్రమల మధ్య ఎఫ్‌టీసీసీఐ ఒక బలమైన వారధిగా పనిచేస్తోందని అన్నారు. పారిశ్రామిక ప్రదర్శన కేవలం యంత్రాలు, ఉత్పత్తుల ప్రదర్శన మాత్రమే కాదని, ఆలోచనలు పంచుకునే ఒక అద్భుత వేదిక అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇక్కడ చిన్న వ్యాపారులకు కొత్త కస్టమర్లు, తయారీదారులకు సరికొత్త సాంకేతికత, స్టార్టప్‌లకు తొలి కొనుగోలుదారులు లభించే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పెట్టుబడిదారుల నమ్మకాన్ని చూరగొని పటిష్టంగా వృద్ధి చెందిందని ఆయన తెలిపారు. హైదరాబాద్ ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని అన్నారు. మన వృద్ధి కేవలం సేవల రంగానికే పరిమితం కాకూడదని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. జీడీపీలో పారిశ్రామిక రంగం, ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈల వాటా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి కల్పనలో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మాన్యుఫ్యాక్చరింగ్ రంగం కీలకమని ఆయన గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వానికి పారిశ్రామిక వృద్ధి అంటే కేవలం పెట్టుబడుల గణాంకాలు మాత్రమే కాదని, ప్రజల జీవనోపాధి అని ఆయన చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కేవలం పెద్ద కంపెనీలకే కాకుండా చిన్న పరిశ్రమలకు, మహిళా, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు అందాలనేదే తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఇందుకోసం ప్రతి శుక్రవారం ఎంఎస్‌ఎంఈ సంఘాలు, పారిశ్రామిక రంగ ప్రతినిధులతో చర్చల కోసం సమయం కేటాయిస్తానని ఆయన అధికారికంగా ప్రకటించారు. ఈ ఎక్స్‌పోలో ఎలక్ట్రిక్ మొబిలిటీ, పునరుత్పాదక ఇంధనం, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. దేశంలో కంప్యూటర్ విప్లవానికి నాంది పలికిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల అన్ని కేటగిరీలపై 100% రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇచ్చిందని, కేవలం ఈవీలను వాడటమే కాకుండా వాటి సప్లై చైన్ టెక్నాలజీని ఇక్కడే అభివృద్ధి చేయడమే మన లక్ష్యమని చెప్పారు. 2035 నాటికి తెలంగాణలో 34 గిగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుతం ప్రపంచమంతా మాట్లాడుకుంటున్న 'పంప్ స్టోరేజ్ ప్రాజెక్టుల' విధానాన్ని తెలంగాణ 1970ల నాడే నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ప్రయోగాత్మకంగా ప్రారంభించిందని, సాంకేతికతలో తెలంగాణ ఎప్పుడూ ముందే ఉంటుందని గర్వంగా చెప్పారు. గడిచిన రెండున్నరేళ్లలో పీక్ డిమాండ్ 15,000 మెగావాట్ల నుంచి 18,500 మెగావాట్లకు పెరిగినప్పటికీ, రాష్ట్రంలో ఎక్కడా పవర్ కట్స్ లేకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం ప్రభుత్వ పెట్టుబడులతో పాటు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్‌ను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు. పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులతో తెలంగాణ ముఖచిత్రం మారబోతోందని డిప్యూటీ సీఎం తెలి చెప్పారు. పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, విద్యార్థులు ఈ ఎక్స్‌పోను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# తెలంగాణ రిజర్వేషన్లను కాపాడాల్సిందే..

- లేకుంటే మరో ముల్కీ ఉద్యమం తప్పదు
- మాజీ ఉద్యోగ సంఘాల నేత దేవీప్రసాద్ హెచ్చరిక



**హైదరాబాద్, జూన్26 (జనంసాక్షి) :** తెలంగాణ రిజర్వేషన్లను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని బిఆర్ఎస్ నేత జి .దేవీప్రసాద్ అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే మరోసారి ముల్కీ ఉద్యమం వచ్చే అవకాశముందని హెచ్చరించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేత భుజంగ రావు , టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ , బీసీ కమిషన్ మాజీ సభ్యురాలు ఉపేంద్ర చారితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ కొత్తకొత్త నిబంధనలు తీసుకు రావడం వల్ల తెలంగాణ యువతకు తీరని అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. 3 యేండ్లు తెలంగాణ రాష్ట్రంలో బీటెక్ చదివితే స్థానికులు ఎలా అవుతారని ప్రశ్నించారు. తెలంగాణలో బీటె క్పూర్తి చేసిన ఇతర రాష్ట్రాల వారు మొత్తం స్థానికులుగానే భావించాల్సి వస్తుందని వెల్లడించారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన పల్లా నిషాంత్ కేసు తెలంగాణ వారికి అన్యాయం జరుగుతుందన్నారు. తీర్పు ఇచ్చిన జడ్జిని తప్పు పట్టడం లేదని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సరైన వాదనలు వినిపించడంలో విఫలం చెందడం వల్లే సమస్య వస్తుందని వివరించారు. సాంకేతక సమస్యలతో ఆదిలాబాద్ కొమరం భీం జిల్లా లాంటి ప్రాంతాల నిరుద్యోగులు ఉద్యోగాలు పొందలేక పోయారని వెల్లడించారు. ఈ అంశాలను గమనించి 95 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా కేసీఆర్ కృషి చేశారని , 1 వ తరగతి నుంచి 7 వ తరగతి వరకు తెలంగాణలో చదువుకున్న వారిని స్థానికులుగా గుర్తించాలని నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో చదివితే స్థానికులుగా గుర్తించడం లేదని పేర్కొన్నారు. స్థానిక అంశం తెలంగాణలో మళ్లీ అలజడులు జరిగేలా ఉందని అన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సరైన రీతిలో కౌంటర్ దాఖలు చేయలేదని, జీఏడీ అధికారులు, చీఫ్ సెక్రటరీ సమావేశం నిర్వహించి దీని పై న్యాయ పోరాటం చేయాలని సూచించారు. లేకపోతే ముల్కీ రూల్ ఉద్యమం మళ్లీ వచ్చే అవకాశం ఉందని జోయం చెప్పారు. తెలంగాణ ఉద్యోగులకు బ్యాంక్ అకౌంట్ ఉన్నవారికి బీమా పథక సదుపాయం ఇప్పటికే ఉందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని ఎంతో ఆశతో ఎదురుచూశారని, సీఎం వారిని నిరాశపరిచారని తెలిపారు. ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, సీపీఎస్ గురించి మాట్లాడనే లేదని తెలిపారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా ఉంటుందా , కనుమరుగు అవుతుందో అనుమానం కలుగుతుందని బీఆర్ఎస్ నాయకుడు భుజంగ రావు తెలిపారు. నాడు కేసీఆర్ విద్యా అవకాశాలు మెరుగు పరురగా రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

# రాంగ్‌రూట్‌లో వచ్చిన స్కూటీని ఢీకొన్న బైక్

- స్కూటీపై ఉన్న ఇద్దరు అక్కడిక్కడే మృతి

**హైదరాబాద్, జూన్26 (జనంసాక్షి) :** నగరంలోని గచ్చిబౌలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. రాంగ్ రూట్‌లో వచ్చిన స్కూటీని.. ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి స్వల్పగాయాల య్యాయి. గచ్చిబౌలిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వినోద్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో తన బైక్‌పై గచ్చిబౌలి నుంచి హాఫీజ్‌పేట్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో హాఫీజ్‌పేట్ నుంచి గచ్చిబౌలి వైపు రాంగ్ రూట్‌లో ఫ్లై ఓవర్ మీదుగా శ్రీకాంత్, విట్టల్ స్కూటీపై వెళ్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు మృతిచెందగా.. బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం అందిన వెంటనే గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ హత్యకు కుట్ర



- భద్రత తగ్గించడంపై శ్రీనివాస్ గౌడ్ ఆందోళన

**హైదరాబాద్, జూన్26 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు హత్యకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపన్నుతన్నదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవీణ్‌కుమార్ భద్రతను కుదించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రవీణ్‌కు భద్రత తొలగించాలని ఇంటెలిజెన్స్ నివేదిక ఇచ్చిందా.. ఇస్తే ఆ నివేదికను బయట పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కాగా, ఇటీవల కాలంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో ముందుం టున్నాడు. ముఖ్యంగా బండీ భగీరథ్ పోక్సో కేసులో చురగ్గా పని చేశాడు. ఆయన మాజీ ఐపీఎస్ అధికారి కావడంతో చట్టం లోని లోటుపాట్లపై అవగాహన ఉండటంతో కాంగ్రెస్ ప్రభుత్వ చట్ట వ్యతిరేక విధానాలపై గళం విప్పుతున్నా డు. ఈ క్రమంలో ప్రభుత్వం కావాలనే ఆయన భద్రతను కుదించింది అనే ఆరోపణలు వెళువెత్తున్నాయి.

# ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలపై కన్నేయాలి

- ఫీజు రియంబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించాల్సిందే
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి



**హైదరాబాద్, జూన్26 (జనంసాక్షి) :** విద్యార్థుల నుండి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజులు వసూలు చేసే కాలేజీలు కనీస విద్యా ప్రమాణాలను , వసతులను ఖచ్చితంగా పాటించాలన్నారు. గతంలో విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికల ఆధారంగా, కనీస ప్రమాణాలు పాటించని ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాలేజీల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలంటూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు విజయశాంతి స్పందించారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ ఆదేశాలను గౌరవించి, వాటిని తూచా తప్పకుండా అమలు చేయాల్సిన కనీస బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఆమె స్పష్టం చేశారు. ఫీజుల బకాయిల కారణంగా విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారి విద్యా సంవత్సరానికి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం విడుదల చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సద్వినియోగం అయ్యేలా, అర్హులైన విద్యార్థులకు తగిన న్యాయం జరిగేలా చూసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజయశాంతి కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులందరికీ మెరుగైన వసతులతో కూడిన, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ఆమె ప్రభుత్వానికి హితవు పలికారు.

# మృతురాలి బంధువులే హంతకులు..

- డబ్బు, బంగారం, పాత కక్షలే హత్యలకు కారణం
- కేవలం మూడు రోజుల్లోనే కేసును ఛేదించిన నల్గొండ పోలీసులు
- నలుగురు నిందితుల అరెస్ట్




**నల్లగొండ ప్రతినిధి, జూన్ 26 (జనం సాక్షి):** నల్గొండ పట్టణాన్ని ఉలిక్కిపడేలా చేసిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సభ్యుల దారుణ హత్య కేసును జిల్లా పోలీసులు కేవలం మూడు రోజుల్లోనే ఛేదించారు. వ్యక్తిగత కక్షలు, అప్పుల భారం, డబ్బు, బంగారు ఆభరణాలపై ఆశ కలిసి ఈ దారుణానికి దారితీసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ వెల్లడించారు. ఈ కేసులో మృతురాలు హసీనా బంధువులతో పాటు మరో ఇద్దరిని కలుపుకుని మొత్తం నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. జూన్ 22న నల్గొండ పట్టణంలోని తెలంగాణ కాలనీ, సాగర్ రోడ్డులోని ఓ ఇంట్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతదేహాలు కుళ్లిన స్థితిలో బయటపడటంతో జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేగింది. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు డీఎస్పీ కె. శివరాం రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఏడుగురు ఎస్సైలు, సీసీఎస్ సిబ్బందితో కలిసి మొత్తం ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ కాల్ డేటా, సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ నివేదికలు, స్థానికుల వాంగ్మూలాలను సమన్వయం చేస్తూ మూడు రోజుల్లోనే నిందితులను గుర్తించారు. నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రధాన నిందితుడు సయ్యద్ అస్లాం టాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. అతని భార్య తబస్సుం మృతురాలు హసీనాకు బంధువు. గతంలో హసీనా వద్ద అప్పు తీసుకున్న అస్లాం మరోసారి డబ్బు అడగగా హసీనా తిరస్కరించడంతో పాటు పాత బాకీ కూడా వెంటనే చెల్లించాలని ఒత్తిడి చేసింది. ఇదే వారి మనసులో తీవ్ర ద్వేషాన్ని పెంచింది. హసీనా ఇంట్లో నగదు, బంగారం ఎక్కువగా ఉందని, వాటిని దోచుకుంటే తమ సమస్యలు తీరతాయని భావించారు. మరోవైపు గతంలో కుటుంబ సభ్యుల మధ్య జరిగిన వివాదాల కారణంగా పాత కక్ష కూడా ఉండటంతో హత్యకు పథకం వేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అస్లాం తన స్నేహితుడు సోహైల్‌తో కలిసి హసీనా ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి ప్రయత్నించాడు. ఏమీ దొరకకపోవడంతో కోపంతో ఇంటి గోడలకు కోడిగుడ్లు కొట్టి వెళ్లిపోయాడు. ఆ తర్వాత హత్య చేసి బంగారం దోచుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. హత్యకు ముందు అస్లాం యూట్యూబ్‌లో హత్య చేసి ఎలా తప్పించుకోవాలి?, శవాలు ఎన్ని రోజుల్లో కుళ్లిపోతాయి?, పోలీసులకు చిక్కకుండా ఎలా ఉండాలి? వంటి వీడియోలు చూసి నేరాన్ని ఎలా అమలు చేయాలనే దానిపై ప్రణాళిక రూపొందించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. జూన్ 19 రాత్రి నల్గొండకు వచ్చిన అస్లాం ఇంటి ఆవరణలో దాక్కొని తెల్లవారుజామున వరకు వేచి ఉన్నాడు. ఉదయం హసీనా బయటకు రాగానే కత్తితో మెడపై దాడి చేశాడు. ఆమె కేకలు విని బయటకు వచ్చిన సుల్తాన్‌ను కూడా నరికి చంపాడు. ఆ తర్వాత నిద్రలేచి బయటకు వచ్చిన ముజమ్మిల్ ప్రతిఘటించినా తీవ్రంగా గాయపరిచి హత్య చేశాడు. ఈ ఘటనలో అస్లాంకు కూడా గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లో మంచం కింద దాక్కున్న 12 ఏళ్ల అఫ్రూరా తనను చూసిందని భావించిన అస్లాం, భవిష్యత్తులో సాక్ష్యం చెబుతుందనే ఉద్దేశంతో ఆమెను బయటకు లాగి కత్తితో హత్య చేశాడు. నలుగురు చనిపోయారని నిర్ధారించుకున్న తర్వాత ఇంట్లోని బంగారం, నగదు, పత్రాలు తీసుకుని మృతదేహాలపై చాపలు కప్పి ఇంటి గేటుకు తాళం వేసి హైదరాబాద్‌కు పారిపోయాడు. హైదరాబాద్ చేరుకున్న అస్లాం తన స్నేహితుడు సోహైల్ సహాయంతో దొంగిలించిన బంగారాన్ని దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ జ్యువెలరీ షాపులో తాకట్టు పెట్టి రూ. 5.30 లక్షలు తీసుకున్నాడు. ఆ డబ్బుతో పరారీలో ఉండగా పోలీసులు సాంకేతిక ఆధారాలతో గుర్తించి అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూపాయలు 3 లక్షల నగదు, ఐదు తులాల కరిగించిన బంగారు ముద్ద, మహీంద్రా మరాజో కారు, హత్యకు ఉపయోగించిన కత్తి, మూడు సెల్‌ఫోన్లు, రక్తపు మరకలు ఉన్న బట్టలు, భూమి, బ్యాంకు పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును కేవలం మూడు రోజుల్లో ఛేదించిన డీఎస్పీ కె. శివరాం రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సీసీఎస్ సిబ్బంది సహా మొత్తం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు. నల్గొండలో సంచలనం సృష్టించిన ఈ హత్య కేసును అత్యంత వేగంగా ఛేదించడం జిల్లా పోలీసుల దర్యాప్తు సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది.

# ఎమ్మెల్యే మొండి వైఖరి విడనాడాలి

- మూడు గ్రామాల ప్రజల ఆర్తనాదాలు
- నీరుకుళ్ళ క్రాస్ వద్ద వంటా-వార్పు
- 'మా బడి మాకే కావాలి' అంటూ నినాదాలు....
- జాతీయ రహదారిపైకి వెళ్లకుండా ప్రజలను అడ్డుకున్న పోలీసులు...



**ఆత్మకూర్, జూన్ 26 (జనం సాక్షి):** హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామానికి కేటాయించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నీరుకుళ్ళ , పెంచికలపేట, కేశవాపూర్ గ్రామాల ప్రజలు, మహిళలు, యువకులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. నిరసనలో భాగంగా నీరుకుళ్ళ క్రాస్ వద్ద వంటా-వార్పు నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను పెద్దాపూర్ గ్రామానికి తరలించే ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసిన గ్రామస్థులు, "మా బడి మాకే కావాలి", "పిల్లల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు", "గ్రామానికి మంజూరైన పాఠశాలను తరలించవద్దు" అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పాఠశాల తరలింపును అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఆందోళనను మరింత ఉధృతం చేస్తూ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించేందుకు నిరసన కారులు ముందుకు సాగగా, భారీగా మోహరించిన పోలీసు లు వారిని అడ్డుకు న్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి జాతీయ రహదారిపైకి ఎవరినీ వెళ్లనివ్వలేదు. గ్రామానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను నీరుకుళ్ళ లోనే కొనసాగించాలని, ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ నెరవేరే వరకు ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాలు ప్రజలు జడ్పీఎస్ఎస్ నీరుకుళ్ళ పూర్వ విద్యార్థులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# లండన్‌లో కామారెడ్డి యువకుడి అనుమానాస్పద మృతి

**కామారెడ్డి, జూన్26 (జనంసాక్షి) :** లండన్‌లో తెలంగాణకు చెందిన ఓ యువ కుడు ప్రాణాలు కోల్పోయాడు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని శ్రీనాథ్ రెడ్డి (25) రెండు రోజుల క్రితం అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం శ్రీనాథ్ గతేడాదే లండన్‌కు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మధుసూదన్ రెడ్డి, మంజుల దంపతుల కుమారుడు శ్రీనాథ్ రెడ్డి లండన్‌లోని లీసెస్టర్ యూనివర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన శ్రీనాథ్.. రాత్రి అక్కడే నిద్రించాడు. తెల్లవారేసరికి విగతజీవిగా పడి ఉన్నట్లు స్నేహితులు అక్కడే ఉన్న శ్రీనాథ్ బంధువులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మరణ వార్తతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకు న్నాయి. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన తమ కుమారుడు కానరాని లోకాలకు వెళ్లిపో వడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీ రవుతు న్నారు. శ్రీనాథ్ మృతదేహాన్ని సాధ్య మైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.




# ఓ-సిటీలో కుడా రెసిడెన్షియల్ ప్లాట్ల వేలం

- 39 ప్లాట్లు విక్రయం..
- గజానికి గరిష్ఠంగా రూ.75 వేల ధర నమోదు

**వరంగల్ ఎంజీఎం, జూన్ 26 (జనంసాక్షి):** వరంగల్‌లోని ఓ-సిటీ టౌన్‌షిప్‌లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రెసిడెన్షియల్ ప్లాట్ల బహిరంగ వేలం జరిగింది. ఈ వేలంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయి, పాల్గొని వేలం ప్రక్రియను పర్యవేక్షించారు. మొత్తం 45 రెసిడెన్షియల్ ప్లాట్లను వేలానికి ఉంచగా, వాటిలో 39 ప్లాట్లు విక్రయమయ్యాయి. వేలంలో గజానికి గరిష్ఠంగా రూ. 75,000 ధర నమోదు అయింది. ప్లాట్లకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస (అప్‌సెట్) ధర గజానికి రూ. 48,000గా ఉండగా, అన్ని ప్లాట్లు ఆ ధర కంటే అధిక ధరకే విక్రయమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, కుడా అభివృద్ధి చేస్తున్న లేఅవుట్లకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. నాణ్యమైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన ప్లాట్లకు మంచి డిమాండ్ ఉండటం నగర అభివృద్ధికి సానుకూల సంకేతమని పేర్కొన్నారు. వేలం ప్రక్రియను కుడా అధికారులు సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీం రావు లు పారదర్శకంగా నిర్వహించగా, పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు పాల్గొన్నారు.

# నేడు వరంగల్‌లో జాబ్ మేళా

## 5 వేల ఉద్యోగాల భర్తీకి అవకాశం

**వరంగల్, జూన్ 26 (జనంసాక్షి) :** నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 27న వరంగల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో 'వరంగల్ కౌశల్ మహోత్సవ్' పేరుతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్‌లోని కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాల ప్రాంగణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభం కానుందని, ప్రముఖ ప్రైవేట్ సంస్థలు పాల్గొని సుమారు 5 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని సూచించారు.

# తిరుపతి పిసిబి అధికారి మునిప్రసాద్ ఇంట్లో ఎసిబి సోదాలు

**కర్నూలు, జూన్26 (జనంసాక్షి) :** నగరంలోని చాణక్యపురి కాలనీలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) జోనల్ అధికారి యుగంధర్ మునిప్రసాద్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. తిరుపతిలోని పీసీబీ కార్యాలయంలో పనిచేస్తున్న ఆయనకు ఆదాయానికి మించి ఆస్తులున్నాయనే ఆరోపణలతో ఏసీబీ తనిఖీలు చేసింది. కర్నూలుతో పాటు తిరుపతి, హైదరాబాద్‌లో ఏకకాలంలో సోదాలు జరుగుతున్నాయి. ఈ దాడులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఏసీబీ డీఎస్పీ సోమన్న వెల్లడించారు. ఇప్పటి వరకు రూ. 5.87 లక్షల నగదు, పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎస్‌బీఐ లాకర్, రెండు ఇళ్లు, భార్య పేరున 4 ఓపెన్ ప్లాట్లు, 17 తులాల బంగారం, 3 కిలోల వెండి ఉన్నట్లు గుర్తించామన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
27 జూన్ 2026

# తెలంగాణలో దాహం

తెలంగాణ నేల మళ్ళీ దాహంతో అల్లాడుతోంది. ఒకప్పుడు పరవళ్ళు తొక్కిన గోదావరి నేడు ఇసుక తిప్పలుగా మారింది. కృష్ణా నది ఒడ్డున నిలబడితే నీళ్ళు కనిపించవు.. కేవలం బీడు పడిన నేల, ఎండిన పగుళ్ళు మాత్రమే కనిపిస్తున్నాయి.

ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావం తెలంగాణను తీవ్రంగా వణికిస్తోంది. వర్షాలు సకాలంలో రాలేదు. వచ్చినా సరిపోయే మోతాదులో రాలేదు. దీంతో శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, సింగూరు ఒకప్పుడు తెలంగాణ జీవనాడులుగా పిలవబడిన ఈ జలాశయాలు నేడు అడుగంటిపోయాయి. పంట వేశారు, పంట చేతికొచ్చే రోజు కోసం ఎదురు చూశారు.. కానీ ముందు నీళ్ళే రాలేదు. వరి మొక్కలు ఎండిపోయాయి. పత్తి చేలు తల వాల్చాయి. ఆదిలాబాద్ నుంచి నల్లగొండ వరకు రైతుల కళ్ళలో నీళ్ళు తప్ప మరేమీ లేవు. నీటి కోసం బోర్లు వేశారు. బోర్లు పడలేదు. పడినా నీళ్ళు రాలేదు. భూగర్భ జలాలు కూడా అడుగంటిపోయాయి. ఒక్కో కుటుంబం వేల రూపాయలు పెట్టుబడి పెట్టి చివరకు చేతులు దులుపుకుంటోంది.

హైదరాబాద్‌కు నీళ్ళిచ్చే మంజీరా, సింగూరు జలాశయాల్లో నీటి మట్టం ప్రమాదకర స్థాయికి పడిపోయింది. ట్యాంకర్ మాఫియా వర్ధిల్లుతోంది. పల్లెల్లో తాగునీటి కోసం మహిళలు కిలోమీటర్ల కొద్దీ నడుస్తున్నారు. పిల్లలు బడికి బదులు నీళ్ళ కోసం బిందెలు మోస్తున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో వేడెక్కిన నీళ్ళు భారతదేశం మీద రుతుపవనాలను చెదరగొడుతున్నాయి. వాతావరణ శాస్త్రవేత్తలు ముందే హెచ్చరించారు. కానీ సన్నద్ధత మాత్రం చాలా తక్కువగా ఉంది. ఎల్‌నినో ఒక్క తెలంగాణనే కాదు, మొత్తం దక్కన్ పీఠభూమిని దాహంతో అల్లాడిస్తోంది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం వాతావరణ మార్పుల కారణంగా వర్షపాతం పంపిణీ కూడా మారుతోంది. ఒకేసారి అతివృష్టి, తర్వాత దీర్ఘకాలం ఎండలు వంటి పరిస్థితులు పెరుగుతున్నాయి. అందువల్ల చెరువుల అనుసంధానం, వర్షపు నీటి సంరక్షణ, గ్రామస్థాయిలో చిన్న నీటి వనరుల పునరుద్ధరణ, సూక్ష్మ సేద్యం (డ్రిప్, స్ప్రింక్లర్), తక్కువ నీటితో సాగయ్యే పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం కాలానుగుణ అవసరంగా మారింది. నీటిని కేవలం ప్రకృతి వరంగా కాకుండా పరిమిత వనరుగా భావించి ప్రతి చుక్కను ఆదా చేసే దిశగా ప్రభుత్వం, రైతులు, ప్రజలు కలిసి పనిచేస్తేనే భవిష్యత్ తరాలకు నీటి భద్రతను అందించగలుగుతాం. లేదంటే ఎండిపోతున్న నదులు, అడుగంటుతున్న జలాశయాలు, దాహంతో ఎదురుచూసే గ్రామాలు తెలంగాణకు శాశ్వత చిత్రంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, పంట విధానాల్లో మార్పు ఇవన్నీ చర్చించాల్సిన సమయం మించిపోయింది. ఇప్పుడు చేయాల్సిన సమయం వచ్చింది. ప్రభుత్వ పథకాలు కాగితాల మీద ఆగిపోకుండా పొలాల దాకా చేరాలి. తెలంగాణ అడిగేది చాలా తక్కువ జీవించడానికి అవసరమైన నీళ్ళు మాత్రమే. నీలు ళ్ళన్న తెలంగాణ కావాలి నీళ్ళ కోసం కన్నీళ్ళు పెట్టే తెలంగాణ వద్దు.

సంపాదకీయం

# వామపక్షాలకు మేల్కొలుపు - ఐక్యతే భవిష్యత్తు

**భారత రాజకీయ చరిత్రలో వామపక్ష ఉద్యమానికి ఒక విశిష్ట స్థానం ఉంది. కార్మికుల హక్కులు, రైతాంగ సమస్యలు, భూ సంస్కరణలు, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కులు, లౌకికవాదం, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం వంటి అనేక రంగాలలో కమ్యూనిస్టు ఉద్యమం చెరగని ముద్ర వేసింది. అయితే నేడు వాస్తవ పరిస్థితిని పరిశీలిస్తే, ఒకప్పుడు దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన వామపక్ష శక్తులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఎన్నికల రాజకీయాల్లో ప్రభావం తగ్గిపోవడం, ప్రజల్లో పూర్వపు ఆదరణ క్షీణించడం, అనేక చీలికలు-ఉపచీలికలుగా విభజించబడటం, సాయుధ పోరాట మార్గాన్ని అనుసరించిన వర్గాలు కూడా వెనుకడుగు వేయడం వంటి పరిణామాలు వామపక్ష ఉద్యమ భవిష్యత్తుపై ప్రశ్నార్థక పరిస్థితిని సృష్టించాయి.**



ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీల పునరేకీకరణ గురించి దేశవ్యాప్తంగా కార్యకర్తలు, మేధావులు, రచయితలు, కళాకారులు, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు మళ్లీ మళ్లీ చర్చించడం యాదృచ్ఛికం కాదు. అది కాలం విధిస్తున్న అవసరం. వామపక్ష ఉద్యమం బలహీనపడితే దాని ప్రభావం కేవలం కొన్ని రాజకీయ పార్టీలకే పరిమితం కాదు; కార్మికులు, రైతులు, పేదలు, బడుగు బలహీన వర్గాలు, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడే శక్తులన్నీ బలహీనపడతాయి.

భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను పరిశీలిస్తే, సిద్ధాంతపరమైన భేదాలు, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన విభేదాలు, వ్యూహాత్మక తేడాలు, నాయకత్వ పోటీలు, వ్యక్తిగత అహంభావాలు అనేక చీలికలకు దారితీశాయి. ఒకప్పుడు ఒకే పార్టీగా ఉన్న ఉద్యమం క్రమంగా అనేక పార్టీలుగా, ఉపపార్టీలుగా, వర్గాలుగా విడిపోయింది. ఫలితంగా ప్రజా ఉద్యమాల కంటే అంతర్గత విభేదాలే ఎక్కువ ప్రాధాన్యం పొందిన సందర్భాలు ఏర్పడ్డాయి. ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న ఎదురు పడుతుంది. కార్ల్ మార్క్స్, ఫ్రెడ్రిక్ ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావో వంటి నాయకుల రచనలను, కమ్యూనిస్టు మ్యానిఫెస్టోను, దాస్ కాపిటల్‌ను, వర్గపోరాట సిద్ధాంతాన్ని, సోషలిస్టు లక్ష్యాలను విశ్వసిస్తున్న శక్తులు ఒకే ఉద్యమంగా ఎందుకు కొనసాగలేకపోతున్నాయి? వారి మధ్య ఉన్న భేదాలు నిజంగా శత్రు వైరుధ్యాలా? లేక మిత్ర వైరుధ్యాలా?

సామాజిక శాస్త్ర దృష్టిలో చూస్తే, దోపిడీకి గురవుతున్న వర్గాల మధ్య ఉండే విభేదాలు సాధారణంగా మిత్ర వైరుధ్యాలే. వాటిని చర్చల ద్వారా, ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా పరిష్కరించుకోవచ్చు. కానీ దోపిడీ వర్గాలు మరియు దోపిడీకి గురవుతున్న వర్గాల మధ్య ఉండే వైరుధ్యాలు మాత్రం మౌలికమైనవి. వామపక్ష ఉద్యమం ప్రధానంగా పోరాడవలసింది ఆ మౌలిక వైరుధ్యాలపైనే. అయితే నేడు అనేక కమ్యూనిస్టు శక్తులు తమ మధ్యనున్న భేదాలనే ప్రధాన సమస్యగా భావిస్తూ, ప్రజల అసలు సమస్యల నుంచి దూరమవుతున్నాయనే విమర్శ పెరుగుతోంది.

గత మూడు దశాబ్దాల రాజకీయ పరిణామాలు కూడా ఈ సంక్షోభాన్ని మరింత స్పష్టంగా చూపించాయి. ఒకప్పుడు పశ్చిమ బెంగాల్‌లో మూడు దశాబ్దాలకు పైగా అధికారంలో ఉన్న వామపక్ష కూటమి ఇప్పుడు రాజకీయంగా అంచుల్లోకి వెళ్లిపోయింది. త్రిపురలో కూడా అదే పరిస్థితి ఎదురైంది. కేరళలో మాత్రమే వామపక్షాలకు గణనీయమైన రాజకీయ స్థానం కొనసాగుతున్నప్పటికీ, జాతీయ స్థాయిలో వారి ప్రభావం గతంతో పోలిస్తే చాలా తగ్గింది. పార్లమెంటులో కమ్యూనిస్టు పార్టీల ప్రాతినిధ్యం కూడా ఒకప్పుడు ఉన్న స్థాయికి చాలా దిగువకు చేరుకుంది.

మరోవైపు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేట్ ఆధిపత్యం, అసంఘటిత కార్మిక వ్యవస్థ విస్తరణ, వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, అసమానతలు పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో వామపక్ష రాజకీయాల అవసరం తగ్గాల్సింది పోయి మరింత పెరగాలి. కానీ ఆ అవకాశాన్ని వినియోగించుకోవడంలో వామపక్ష శక్తులు విఫలమవుతున్నాయనే అభిప్రాయం బలపడుతోంది. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి ఐక్యత లోపం. ప్రజలకు కమ్యూనిస్టు పార్టీల మధ్య ఉన్న సూక్ష్మ సిద్ధాంత భేదాల కంటే వారి జీవిత సమస్యల పరిష్కారమే ముఖ్యమవుతుంది. రైతుకు పంట ధర కావాలి. కార్మికుడికి ఉద్యోగ భద్రత కావాలి. యువతకు ఉపాధి కావాలి. పేదలకు విద్య, వైద్యం అందుబాటులో ఉండాలి. మహిళలకు భద్రత, సమాన అవకాశాలు కావాలి. ఈ సమస్యలపై పోరాడే శక్తులు పరస్పరం ఒకరినొకరు విమర్శించుకుంటూ ఉంటే ప్రజల్లో నిరాశ కలగడం సహజం.

అందుకే నేడు అనేక మంది వామపక్ష అభిమానులు ఒకే ప్రశ్న అడుగుతున్నారు. వందేళ్లుగా ప్రజలకు ఐక్యతను బోధించిన శక్తులు తమలో తాము ఎందుకు ఐక్యంగా ఉండలేకపోతున్నాయి? ప్రపంచ కార్మికుల ఐక్యతను కోరిన ఉద్యమం, తన స్వంత కార్యకర్తల ఐక్యతను ఎందుకు సాధించలేకపోతోంది? ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత వామపక్ష నాయకత్వంపై ఉంది. అయితే ఐక్యత అంటే కేవలం సంస్థాగత విలీనం మాత్రమే కాదు. ముందుగా ఉమ్మడి కార్యాచరణ అవసరం. రైతు సమస్యలు, కార్మిక హక్కులు, నిరుద్యోగం, ప్రభుత్వ రంగ పరిరక్షణ, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, మానవ హక్కులు వంటి అంశాలపై అన్ని వామపక్ష శక్తులు కలిసి పోరాడాలి. ఆచరణలో ఏర్పడే విశ్వాసం భవిష్యత్తు ఐక్యతకు పునాది వేస్తుంది. అలాగే వామపక్ష ఉద్యమం తన గత తప్పిదాలను కూడా నిజాయితీగా సమీక్షించుకోవాలి. ప్రజలతో సంబంధాలు బలహీనపడిన సందర్భాలు, అంతర్గత ప్రజాస్వామ్యం దెబ్బతిన్న సందర్భాలు, కొత్త తరాల ఆకాంక్షలను అర్థం చేసుకోలేకపోయిన సందర్భాలు, మారుతున్న ఆర్థిక-సాంకేతిక పరిస్థితులను సరిగా విశ్లేషించలేకపోయిన అంశాలను నిర్భయంగా అంగీకరించాలి. ఆత్మవిమర్శ లేకుండా పునరుజ్జీవనం సాధ్యం కాదు.

నేటి యువతకు వందేళ్ల క్రితం ఉన్న భాషలో మాత్రమే మాట్లాడితే సరిపోదు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, కృత్రిమ మేధస్సు, గిగ్ ఉద్యోగాలు, వాతావరణ సంక్షోభం, డేటా నియంత్రణ, కార్పొరేట్ ఏకాధిపత్యం వంటి కొత్త సమస్యలపై కూడా వామపక్ష దృక్పథం అభివృద్ధి చెందాలి. మార్క్సిజం ఒక స్థిరమైన మతగ్రంథం కాదు; సమాజాన్ని విశ్లేషించే శాస్త్రీయ పద్ధతి. అందువల్ల మారుతున్న వాస్తవాలను అర్థం చేసుకుంటూ తనను తాను నవీకరించుకోవడం వామపక్ష ఉద్యమానికి అత్యవసరం. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీలు, వామపక్ష సంస్థలు, ప్రజాసంఘాలు, మేధావులు, రచయితలు, కళాకారులు అందరూ ఒక విషయాన్ని గుర్తించాలి. చీలికలతో కొనసాగితే భవిష్యత్తు మరింత సంక్లిష్టంగా మారుతుంది.

ఐక్యత వైపు అడుగులు వేస్తే మాత్రమే కొత్త ఆశలు పుడతాయి. వ్యక్తిగత అహంభావాలు, చారిత్రక విభేదాలు, నాయకత్వ పోటీలు ప్రజల ప్రయోజనాల కంటే గొప్పవి కావు. భావితరాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వామపక్ష శక్తులు తమలోని మిత్ర వైరుధ్యాలను అధిగమించి, ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలి. ప్రజల మధ్య తిరిగి విశ్వాసాన్ని నిర్మించుకోవాలి. కార్మికులు, రైతులు, పేదలు, అణగారిన వర్గాల ఆశయాలను కేంద్రంగా చేసుకుని ఒక కొత్త ప్రజాస్వామ్య, ప్రగతిశీల, సమైక్య వామపక్ష ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలి. అదే కమ్యూనిస్టు ఉద్యమ పునరుజ్జీవనానికి మార్గం. అదే వామపక్షాల భవిష్యత్తును నిర్ణయించే చారిత్రక పరీక్ష. నేడు ఆ పరీక్షను ఎదుర్కొనే సమయం ఆసన్నమైంది.



డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్
9849328496

# సమాచార హక్కు సవరణలను ప్రతిఘటించాలి

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతున్న భారతదేశంలో సమాచార హక్కు చట్టం - 2005 అమలులోకి రావడం వెనకాల మేధావుల సైద్ధాంతికత దార్శనికతలు, స్వచ్ఛంద సంస్థల జనజాగృతులు మరియు ప్రజల వీరోచిత పోరాటోద్యమాల నిర్విరామ కృషి ఎంతగానో ఉంది. పరిపాలనలో పారదర్శకతకు పెద్దపీట వేయడం, ప్రభుత్వ శాఖల్లో అవినీతిని అరికట్టడం, ప్రభుత్వ సంస్థలు ప్రజలకు జవాబుదారీగా పనిచేయడం...అంతిమంగా ప్రజలకు సుపరిపాలన అందించే లక్ష్యాలను సాధించే దిశగా రూపొందింపబడి అమలు కాబడుతున్న సమాచార హక్కు చట్టం పాలకుల అసమర్థత కారణంగా నేడు అనేక సవరణలకు లోనై ఆ చట్ట ఉనికి ప్రశ్నార్థకం కాబడుతుండడం కడు విచారకరం.






యు.పి.ఏ ప్రభుత్వం 2005 లో అమలులోకి తీసుకువచ్చిన ఈ సమాచార హక్కు చట్టానికి 2018 లో ఎన్.డి.ఎ ప్రభుత్వం అనేక సవరణలు చేసి అసలు ఆ చట్టానికి కోరలు పీకివేసింది. తాజాగా మహారాష్ట్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టం 2005 నాటి నిబంధనలకు సవరణలు చేసింది. 2026, జూన్ 12 నాడు గెజిట్ నోటిఫికేషన్ లో వెలువరించబడి జూలై 5 నుండి అమలులోకి రానున్న ఈ కొత్త సవరణలు సమాచార హక్కు చట్టానికి తూట్లు పొడిచే విధంగా ఉన్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టానికి చేసిన ఈ చట్ట విరుద్ధమైన సవరణలు చేయడం మూలంగా ప్రజలు సమాచారాన్ని పొందకుండా నిరోధించడమే కాకుండా పారదర్శకతకు ప్రతిబంధకంగా మారనున్నాయి. ఈ సవరణలు సామాన్యుల నుండి సామాజిక కార్యకర్తల దాకా సర్వత్రా పెద్ద ఎత్తున విమర్శలను ఎదుర్కొంటూనే ఉన్నాయి. 'ప్రజలకు సమాచార హక్కు చట్టాన్ని దూరం చేసే దురుద్దేశ్యాలతోనే మహారాష్ట్ర ప్రభుత్వం ఈ సవరణలు చేసింది' అని చాలా స్పష్టంగా అర్థమవుతూనే ఉంది. మొత్తంగా సమాచార హక్కు చట్టాన్ని బలహీనపరిచే దిశగా మహారాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకోవడం అసహేతుకం.

ఈ సంకట పరిస్థితులలో సమాచార హక్కు అమలు కోసం మహారాష్ట్రలో 1998 నుంచి అనేక ఆందోళనలలో పాల్గొన్న ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన ఈ సవరణలపై తీవ్రంగా ప్రతిఘటించారు. ఒకవేళ మహారాష్ట్ర ప్రభుత్వం ఈ సవరణలను ఉపసంహరించుకోకపోతే రాలేగావ్ సిద్ధి గ్రామంలో జూలై 5 నుంచి తాను ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు రాసిన లేఖ ద్వారా ఆయన ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం పౌరులు సమాచారం కోరడానికి గల కారణాలను సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 6(2) ప్రకారం దరఖాస్తుదారులు తమ వ్యక్తిగత వివరాలను మరియు సమాచారం కోరడానికి గల కారణాలను వెల్లడించాల్సిన అవసరం ఎంతమాత్రం లేకున్ననూ సమాచారం కోరే ఉద్దేశ్యాన్ని దరఖాస్తుదారులు తప్పనిసరిగా పేర్కొనాలని కోరుతూ మహారాష్ట్ర ప్రభుత్వం జూన్ 12 నాడు వెలువరించిన సవరణలలో పేర్కొంది. కాని ప్రజానీకం నుండి తీవ్ర విమర్శలు వెలువెత్తడంతో మహారాష్ట్ర ప్రభుత్వం జూన్ 19 నాడు 'దరఖాస్తుదారులు ఉద్దేశ్యాన్ని వెల్లడించాలి' అనే ఈ ఒక్క సవరణను మాత్రమే తొలగించడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు.

ఇతర సవరణలలో దరఖాస్తు, అప్పీల్ రుసుములకు సంబంధించిన అనేక మార్పులు ఉన్నాయి. 20 సంవత్సరాల తర్వాత దరఖాస్తు రుసుమును రూపాయలు 10 నుండి రూపాయలు 30కి పెంచడం, పత్రాల ఫోటోకాపీల రుసుమును పేజీకి రూపాయలు 2 నుండి రూపాయలు 5కి పెంచడం ఏ రకంగానూ సహేతుకం కానేకాదు. 'ఒక అంశానికి సంబంధించి ఒకే దరఖాస్తు' అనే నిబంధన మూలంగా దరఖాస్తుదారులు ఒకే దరఖాస్తులో బహుళ సమాచార అంశాలను చేర్చకుండా నిరోధిస్తుంది. ఫలితంగా దరఖాస్తుదారులకు ఆర్థిక సమస్యలు తలెత్తుతాయి. ఏ రకంగా చూసినా ఈ నిబంధన ఏమాత్రం సహేతుకం కానేకాదు. అంతేకాకుండా ఒక దరఖాస్తుకు 150 పదాల పరిమితిని విధించడం అర్థరహితం. సమాచార కమిషన్ విచారణల సమయంలో న్యాయ ప్రాతినిధ్యంపై నిషేధం, విచారణకు దరఖాస్తుదారు హాజరు కాకపోతే ఆ కేసులను లేదా అప్పీళ్లను కొట్టివేయడం, ఒక దరఖాస్తుదారు మరణిస్తే వారి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తు లేదా అప్పీల్ లను మూసివేయడం, సమాచార కమిషన్ ముందు విచారణల సమయంలో న్యాయ సహాయాన్ని నిరాకరించడం మరియు పునరావృత దరఖాస్తులపై నిషేధం మొదలైన సవరణలు మొత్తంగా పౌరుల సమాచార హక్కును హరించే విధంగా ఉన్నాయి.

అరకొరగా అమలు అవుతున్న సమాచార హక్కు చట్టం నేడు ఈ అసహేతుక సవరణల మూలంగా అసలు ఈ సమాచార హక్కు లక్ష్యాలు నెరవేరకపోగా ప్రజానీకం మరియు సమాచార హక్కు కార్యకర్తలు మరిన్ని సమస్యల వలయంలో సమిధలు కానున్నారు. ఈ సవరణల మూలంగా సమాచార అధికారులు జవాబుదారీతనం నుండి తప్పించుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అంతిమంగా 'పౌరుల సమాచార హక్కును నిర్వీర్యం చేసేందుకు ఈ సవరణలు రూపొందించారు' అనే అనుమానాలు స్పష్టంగానే వ్యక్తం అవుతున్నాయి. అందువలన ఈ సమాచార హక్కు చట్టం సవరణలను ఉపసంహరించుకునేంత వరకు ప్రజానీకం ముక్తకంఠంతో ప్రతిఘటించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.



జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

## జీవామృతం

వాన మొరలు
పూజలు భజనలు
జనం భరోసా

కప్పల పెళ్లి
వానా వానా రావయ్య
పల్లె నమ్మకం

ఎండిన బావి
నీటి గుంట చెరువు

బిందెల గోల

పశుపక్షులు
దాహపు చావుకేక
నీటి ఎద్దడి

నీటిమార్గాలు
జీవామృత దారులు
కరువు నహీ
ప్రగతి సహీ

రేడియమ్
9291527757

## తానో కవిత్వం

తానో కవిత్వం
నిజంగా తాను
నా ఇష్టమైన కవిత్వం,
వస్తువు తానే
అక్షరం తానే..,

నిశీధిలో నిశ్చలమైన
ఎదను కదిపిన
వీచిక తానే...

వెన్నెల తానే..
మొదుబారిన ఎదలో
మొలిసిన
శ్రావణమాసపు
ఆశా తానే..

వెన్నెల రాత్రి
కన్నార్పక
నా వైపు తదేకంగ చూసే
జాబిలి తానే..

తనువంతా

తానే
ఎదలో పారే నెత్తుటి
కావి తానే..

నా కవితకు సింధూరం
నా కవితల ప్రియ మధురం
తానే
కనుచూపులతో
ఎదనిండ తడిపిన
మందాకిని తాను..

మచ్చూరి వెంకట్
6302305504

# విద్యా ప్రాథమిక హక్కు కొనాల్సిందేనా..?

**విద్య అనేది ఒక వ్యాపారం కాదు, అదొక సామాజిక బాధ్యత మరియు హక్కు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఏ ప్రకారం ప్రతి బిడ్డకు ఉచిత,నిర్బంధ విద్యను అందించాలని స్పష్టం చేస్తోంది. కానీ నేటి సమాజంలో విద్యా వ్యవస్థ క్రమంగా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్తూ,సామాన్యుడికి భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) 2009 ఆశయాలు, క్షేత్రస్థాయి పరిశీలనలు,శాస్త్రీయ విద్య ఆవశ్యకత, ప్రభుత్వ పాఠశాలల మనుగడపై ఒక ప్రత్యేక చర్చ అవసరం.**





**రాజ్యాంగ నిబంధనలు.. విద్యా హక్కు చట్టం**

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం, 6 నుండి 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ 1 వ తరగతి నుండి 8. వ తరగతి వరకు ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. దీనికోసం 86వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యను ప్రాథమిక హక్కుగా మార్చారు. దీని ఆధారంగానే 2009లో 'విద్యా హక్కు చట్టం' అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రయించడం చట్టవిరుద్ధం మరియు నేరం. విద్యను లాభాపేక్ష లేని సేవగా మాత్రమే నిర్వహించాలి. అలాగే,బడి బయట పిల్లలు లేకుండా చేయడం, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం మనందరి సామాజిక బాధ్యతగా ఈ చట్టం చెబుతోంది.

రాజ్యాంగం చెప్పిన విధంగా ఉచిత, నిర్బంధ విద్యా విధానం నేడు క్షేత్రస్థాయిలో 'తూతూ మంత్రం'గా మారిందనేది పచ్చినిజం. కనీసం ప్లేస్కూల్స్, కిండర్ గార్టెన్ స్థాయిల్లో కూడా ఎలాంటి నిబంధనలు అమలు కావడం లేదు. చట్టాలు కాగితాలకే పరిమితమవుతుండటంతో, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్య అంద అందకుండపోతుంధి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై చాల మంది నాయకుల ప్రసంగాలు మాత్రమే వినబడుతున్నా, సరైన పర్యవేక్షణ లేక ఎంతో మంది బాలలు నేటికీ చదువుకు దూరమవుతూ పని వ్యసనానికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు,వారి జీవితాలు ప్రమాదంలో పడ్డాయి అని గుర్తించలేకున్నారు కారణం సరైన విద్య లేక పోవడం.

**పుట్టగొడుగుల్లా కార్పొరేట్ విద్యా సంస్థలు**

విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి , విద్యా రంగంలో సంపాదనె ధ్యేయంగా కొన్ని కార్పొరేట్ సంస్థలు రాజ్యమేలుతున్నాయి. ఉదాహరణకు శ్రీ చైతన్య, నారాయణ,లాంటి ఎన్నో పెద్ద పెద్ద విద్యా సంస్థలు మరియు మరెన్నో ప్రైవేట్ స్కూళ్లు గల్లీ గల్లీకి పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి అలాగే ఇష్టాను సారంగాని ఎల్ కేజీ పిల్లాడికి కూడా లక్షల రూపాయలు ఫీజులు తీసుకుంటున్నారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం విద్య ద్వారా లాభాలు సంపాదిస్తే జైలు శిక్ష పడే అవకాశం ఉన్నప్పటికీ, ఈ సంస్థలు లినాన్-ప్రాఫిటబుల్‌లిగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, లోపల మాత్రం కోట్లాది రూపాయల విద్యా వ్యాపారాన్ని సాగిస్తున్నాయి. ఫీజుల దోపిడీ, పుస్తకాలు-యూనిఫామ్‌ల విక్రయాల ద్వారా సామాన్యుల రక్తాన్ని పిండుకుంటున్నాయి.

తెలంగాణలో సుమారు 10,832 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నవి ఈ ప్రైవేట్ సంస్థలలో సమిష్టిగా దాదాపు 48 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. రాష్ట్రంలోని మొత్తం విద్యా మౌలిక సదుపాయాలు చాలా విస్తృతమైనవి అయినప్పటికీ, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల మధ్య వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది.ప్రభుత్వ పాఠశాలలు గతంలో 33 వేల ప్రభుత్వ పాఠశాలలు,ఇప్పుడు 27 వేల పాఠశాలలు వాటిని కుదించి 4 వేల అత్యాధునిక హంగులతో నిర్మించాలనే ఆలోచనలో ప్రభుత్వం దృష్టిలో ఉందని ప్రభుత్వ వర్గాలు తెలుపుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు ఒక తుది చట్టం రూపొందకపోవడంతో, బోర్డు మరియు ప్రాంతాన్ని బట్టి, వార్షిక ట్యూషన్ ఫీజుల పెంపు కారణంగా ఖర్చులు సంవత్సరానికి 50,000 నుండి 4,00,000 పైగా పెరిగిపోయాయి. తల్లిదండ్రులు పెరుగుతున్న ఖర్చులను ఎదురుకుంటూ చాల ఇబ్బంది పడుతున్నారనేది వాస్తవం.

**ప్రస్తుత ఫీజు నిర్మాణ శ్రేణులు**

ప్రస్తుతం ఫీజులు చాలా భిన్నంగా ఉన్నాయి. రాష్ట్ర బోర్డు పాఠశాలలు సంవత్సరానికి 30,000 నుండి 60,000 వరకు. సీబీఎస్ఈ / ఐసీఎస్ఈ పాఠశాలలు సంవత్సరానికి 60,000 నుండి 1,50,000 ప్రీమియం / అంతర్జాతీయ పాఠశాలలు సంవత్సరానికి 3,00,000 నుండి 12,00,000ం ఈ విధంగా దోచుకుంటూ పబ్బం గడుపుతాయి. ఒకవైపు ప్రైవేట్ పాఠశాలలు పెరుగుతుంటే, మరోవైపు ప్రభుత్వాలు సర్కారు బడులను బలోపేతం చేయాల్సింది పోయి, వాటిని మూసివేయడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు 6 వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా దాదాపు 23 వేల పాఠశాలలను మూసివేయాలనే ప్రభుత్వ నిర్ణయం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. 23 వేల పాఠశాలలను మూసివేసే ప్రజావ్యతిరేక నిర్ణయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టి వాటిని బలోపేతం చేయాలి. నాన్-ప్రాఫిట్ ముసుగులో విద్యా వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అలాగే తెలంగాణ రాష్ట్రంలో అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు సంస్థలను పాఠశాలలను మూసివేయాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం. సామాన్య విద్యార్థులందరికీ మూఢనమ్మకాలు లేని, నాణ్యమైన శాస్త్రీయ విద్యను ఉచితంగా అందించినప్పుడే విద్యా వ్యవస్థ మెరుగుపడుతుందని అలా జరిగితే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందని అట్టి విధముగా విద్యా శాఖ మంత్రి మరియు విద్యాశాఖ అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచిస్తున్నాం.



బాన్సువాడ వేదాంత్ మౌర్య
సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్
రాష్ట్ర అధ్యక్షుడు
9963513544

## ఓటరు జాబిత రూపకల్పనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

● డిప్యూటీ తాసిల్దార్ మహేష్



**బంట్వారం, జూన్ 26 (జనం సాక్షి) :** ఓటరు జాబితా ఫారాలను రూపకల్పనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని డిప్యూటీ తాసిల్దార్ మహేష్ అన్నారు, శుక్రవారం బంట్వారం మండల కేంద్రంలోని బూత్ నెంబర్ 253 లో స్వయంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,,, బిఎల్ ఓ లు ప్రతి ఇంటింటికి తిరుగుతూ ఓటర్లు నమోదు కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా నిర్వహించాలని, అదేవిధంగా నకిలీ ఓట్లను తొలగించాలని, ప్రతి ఒక్కరూ బిఎల్వోల నుండి ఎన్యూమరేషన్ ఫాతారను తీసుకొని తమ వివరాలను నమోదు చేసి ఓటు హక్కును పొందాలని అన్నారు,18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ నూతన ఓటు హక్కును ఈ కార్యక్రమంలో పొందవచ్చు అని తెలియజేశారు, స్థానిక ఓటర్లు బిఎల్ ఓ లకు సహకరిస్తూ సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు, ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, బిఎల్డీఓ నుర్నంపల్లి నర్సమ్మ, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ప్రక్రియను పటిష్టంగా అమలు చేయాలి

● వికారాబాద్ జిల్లా డీసీసీ చైర్మన్ ధారసింగ్ నాయక్



**కొడంగల్, జూన్ 26 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ప్రక్రియను మరింత పటిష్టంగా అమలు చేయాలని వికారాబాద్ జిల్లా డీసీసీ చైర్మన్ ధారసింగ్ నాయక్ అన్నారు. శుక్రవారం కొడంగల్ పట్టణ కేంద్రంలో బీఎల్ఏ అభ్యర్థులకు ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని అర్హులైన ప్రతి ఓటరిని నమోదు చేయించి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్,మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దాము ,కాంగ్రెస్ పార్టీ నాయకులు దస్తప్ప,హన్మ్య నాయక్, చంద్ర నాయక్, హీరా సింగ్ , ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

● ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జూన్ 26 (జనంసాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా తాండూరు పట్టణం బూత్ నంబర్ 119 పరిధిలోని శాంతినగర్‌లో, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి నివాసంలో సంబంధిత బిఎల్ ఓ అధికారి ఎం స్వాతి ఎన్యూమరేషన్ ఫారాన్ని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదు కావాలని, ఎలాంటి లోపాలు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ వివరాలను సరిచూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి, బిఎల్ ఓ, బిఎల్ ఎ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నాగరాజు, పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ రవి గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

**కొడంగల్, జూన్ 26 (జనం సాక్షి) :** విద్యార్థులు మత్తు పదార్థాలకు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కొడంగల్ పట్టణ కేంద్రంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా నర్సింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరిగి డిఎస్పి శ్రీనివాస్ సార్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల ఉచ్చులో చిక్కుకుని తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఒక కుటుంబంలో ఒక్కరు డ్రగ్స్‌కు బానిసైతే ఆ వ్యక్తితో పాటు మొత్తం కుటుంబం కూడా ఆర్థిక, సామాజిక, ఆరోగ్య పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తికి సమాజంలో గౌరవం ఉండదని, అందువల్ల ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొడంగల్ సిఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, కళాశాల బృందం ,విద్యార్థులు పాల్గొన్నారు.



# గ్రామీణ పట్టణాభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, జూన్ 26 (జనంసాక్షి) :** గ్రామీణ పట్టణాభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ పని చేస్తుందని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్రతి వార్డులో అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యంతో పూర్తి చేస్తున్నామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కరికే మీనాక్షిసత్యనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ..ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళు తున్నామని చెప్పారు. గ్రామీణ పట్టణాల సమగ్ర అభివృద్ధికి



నాణ్యమైన రహదారులు ఎంతో కీలకమని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి వార్డులో అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టి, ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి ప్రాంతంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ యాదగిరి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, మాధవి యాది రెడ్డి, మనీషా అనంత్ రెడ్డి, డావల్గారి గోపాల్ రెడ్డి, పైండ్ల మధుసూధన్ రెడ్డి, తాళ్ళపల్లి నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్ర మల్లేష్, మధుసూధన్ గుప్తా, టేకులపల్లి శ్రీనివాస్, గంగి యాదయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు స్థలాలు చూపించాలి

● సిపిఎం పార్టీ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్

**మొయినాబాద్, జూన్ 26 (జనంసాక్షి) :** మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డుకు సంబంధించిన పేదలకు 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల జాగల పట్టాలు ఇవ్వడం జరిగింది అప్పటినుంచి ఇప్పటివరకు ప్రభుత్వం వారికి ఇళ్ల జాగలు చూపించలేదు ఇళ్ల జాగలు చూపించాలని హిమాయత్ నగర్ పేద ప్రజలు చేస్తున్న రిలే దీక్షలకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు ఈ సందర్భంగా సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య నాయకత్వన హిమాయత్ నగర్ కు సంబంధించిన పేదలు 290 మందికి ఇంటి జాగలు కేటాయిస్తూ మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రారెడ్డి గారి, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి సమక్షంలో కెసిఆర్ కాలనీ ఏర్పాటుకు శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయినా పేదలకు ఇళ్ల జాగాలు చూపించలేదు. పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల జాగలను గుడిమల్కాపూర్ మార్కెట్ యార్డుకు కేటాయించడాన్ని సీపీఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సర్వే నంబర్ 177, 176 లలో గుడిమల్కాపూర్ యార్డు ఏర్పాటు అవుతుందని ప్రకటించారు దానికి విరుద్ధంగా సర్వేనెంబర్ 151లో మార్కెట్ యార్డ్ ఏర్పాటు



చేయాలని చూడడం జిల్లా కలెక్టర్ మొయినాబాద్ ఎమ్మార్వో కు తగదన్నారు. మొయినాబాద్ మండల పరిధిలో ప్రభుత్వ అసైన్డ్ భూములు రాజకీయ నాయకులు, బడా బాబులు అనేకమంది కబ్జాలు చేశారని వాటిని సర్వే చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని మండల ఎమ్మార్వో గారిని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా రెవెన్యూ యంత్రాంగం పేదలకు ఇళ్ల జాగలు చూపించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మొయినాబాద్ మండల కన్వీనర్ సిహెచ్ ప్రవీణ్ కుమార్,నాగిరెడ్డి గూడ గ్రామ కార్యదర్శి ముంజ గళ్ళ ప్రభుదాస్ హిమాయత్ నగర్ యువజన సంఘాల అధ్యక్షులు కట్టమీద శ్రీను, కుమ్మరి విట్టలయ్య కరీం గోపాల్ నాయక్ గ్రామ పెద్దలు ఇళ్ల పట్టాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత




**నిజాంపేట్, జూన్ 26 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి కౌసల్య కాలనీలో ద్వారక మహిళలకు శుక్రవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళల సంక్షేమం సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హత గల కుటుంబానికి చేరేలా కృషి కొనసాగుతోందన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ద్వారా మహిళల్లో ఆనందం ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారక గ్రామ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి, యశోద ఆర్.పీ. కరుణ, ఆర్.పీ. జ్యోతి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తిరుపతి రెడ్డి కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు

● జడ్చర్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విప్లవ రెడ్డి



**జడ్చర్ల, జూన్ 26 (జనంసాక్షి) :** గంజాయి రవాణా మరియు విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జడ్చర్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విప్లవ రెడ్డి హెచ్చరించారు. జిల్లా మధ్యనిషేధ, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి. విజయ భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా మధ్యనిషేధ, అబ్కారీ అధికారి సుధాకర్ సూచనలతో జడ్చర్ల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విప్లవ రెడ్డి పర్యవేక్షణలో గురువారం రాత్రి జడ్చర్ల, బూరెడ్డిపల్లి రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ విప్లవ రెడ్డి తెలుపుతూ తనిఖీల్లో భాగంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద 0.710 కేజీల 40 వేల విలువైన గంజాయి, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణలో సదరు వ్యక్తి బీహార్ రాష్ట్రానికి చెందిన ఆకాశ్ పటేల్ గా గుర్తించడం జరిగిందని ఇతను జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని బాలనగర్ ప్రాంతంలో నివాసం ఉంటూ నిర్మాణ రంగంలో దినసరి కూలీగా పని చేస్తు, బిహార్ రాష్ట్రం నుండి గంజాయిని కిలోకు రూ. 20వేల చొప్పున కొనుగోలు చేసి, వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా రూ. 300లకు విక్రయిస్తూ జడ్చర్ల, బాలనగర్ పరిసరాల్లోని వివిధ కంపెనీల కార్మికులకు సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని,ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో జడ్చర్ల ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ టి. కార్తీక్ రెడ్డి, వి గణేష్ (ట్రైని) హెడ్ కానిస్టేబుల్ మల్లకంటయ్య, కానిస్టేబుల్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

## సబితా ఇంద్రారెడ్డి ఫ్యూచర్ సీటీపై స్పష్టత ఇవ్వాలి



**మహేశ్వరం, జూన్ 26 (జనంసాక్షి) :** మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఫ్యూచర్ సీటీపై స్పష్టత ఇవ్వాలని ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం మహేశ్వరం మండల కేంద్రంలోని మనోహర్ కాంప్లెక్స్ లో ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి మాట్లాడుతూ...మహేశ్వరం మండలంలో ఉన్న 30 గ్రామ పంచాయతీలను భారత్ ఫ్యూచర్ సిటీలో కలపాలన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, సర్పంచుల అసమర్థత వల్లనే మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు ఫ్యూచర్ సిటీలో కలువలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులు,నాయకులు తమ వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా, భవిష్యత్ తరాల కోసం ఆలోచించాలన్నారు. మహేశ్వరం మండలంలోని 30 గ్రామ పంచాయతీలను ఫ్యూచర్ సిటీలో కలిపే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్,నాయకులు దత్తు నాయక్,పోతర్ల సుదర్శన్ యాదవ్, నర్సింహ,ఎడుమ మోహన్ రెడ్డి,ఎన్డీతండా సర్పంచ్ గోపాల్, ఉప్పుగడ్డ తండా సర్పంచ్ రాజు నాయక్,గంగారం సర్పంచ్ దేవేందర్ నాయక్,ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● మున్సిపల్ కమిషనర్



**నర్సాపూర్, జూన్ 26 (జనం సాక్షి) :** వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని బీసీ గురుకుల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంటశాలను పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలకు తల్లిదండ్రులకు గొప్ప పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి సంధ్య, శానిటరీ ఇంచార్జ్ మురళీమోహన్, వార్డు ఉదయ్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నిజాంపేట్ డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలి

**నిజాంపేట్, జూన్ 26 (జనం సాక్షి) :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బండారి లేఔట్ డివిజన్లో నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్ కాలనీ మధ్య గల డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ మాట్లాడుతూలి, నిజాంపేట్ - బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీల మధ్య .నివాస ప్రాంతాల మధ్యలో చెత్తను డంపింగ్ చేయడం వల్ల తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల కు గురైచు అనేక విధాలైన వ్యాధుల ప్రభలుతున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి డంపింగ్ యార్డును ఇతర అనుకూల ప్రదేశానికి తరలించాలని. ప్రస్తుతం ఉన్న ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రపరచి, పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. డంపింగ్ యార్డ్ ని ఆనుకొని మహిళా డిగ్రీ కళాశాల నిర్మించారు డిగ్రీ కళాశాల ప్రారంభమైంది అడ్మిషన్ అయిదమని అమ్మాయిలు వస్తే డంపింగ్ యార్డ్‌ని చూసి భయపడి అడ్మిషన్ కాకుండా తిరిగి వెళ్ళిపోతున్న పరిస్థితి చూస్తున్నం డంపింగ్ యార్డ్ చెత్త మొత్తం మహిళా డిగ్రీ కళాశాలలో ఉన్నట్టే కనబడుతుంది.. బాచుపల్లి డబుల్ బెడ్ రూమ్స్ నుండి మొదలుపెడితే మహిళా డిగ్రీ కళాశాల ముందు నుంచి నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్స్ దాకా రోడ్లపైనే చెత్త ఉంటుంది రోడ్ల పైన తిరిగే ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు కాబట్టి వెంటనే అధికారులు స్పందించి డంపింగ్ యార్డ్ ని తరలించాలని సిపిఎం పార్టీగా కోరుతున్నాం..ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రమైన పర్యావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణ చర్యలు




తీసుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోంది డంపింగ్ యార్డ్ ని తరలించకపోతే రాబోయే రోజుల్లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు పి.స్వామి, తిరుపతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో మొహరం సందడి..!

- శుక్రవారం కొలువుదీరనున్న గంధం పీరు
- మతసామరస్యానికి ప్రతీక మొహర్రం
- ఆస్పైదుల ఆటపాటలతో సందడి
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా మొహరం వేడుకలు

**సంగారెడ్డి బ్యూరో, జూన్ 26 (జనం సాక్షి) :** ఇస్లాంలో ప్రజాస్వామ్యం, లౌకికభావాల పట్ల అనాదిగా దృఢ విశ్వాసముంది. ప్రజల్లోని మూఢనమ్మక లను పారద్రోలాలనే ప్రధాన లక్ష్యంగా భావించే ఇస్లామ్, రాక్షసత్వాన్ని రూపు మాపి మానవత్వానికి జీవం పోయాలని సూచిస్తోంది. ఈ క్రమంలో ప్రాణా లకైనా తెగించాలనే ఉన్నతమైన ఆశయానికి తార్కాణంగా నిలిచిందే మొహరం. ఈ పండుగ జాతీయ సమైక్యతకు ప్రతీకగా మనుషుల మనసుల్లో చోటు సంపాదించుకుంది. సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండల, గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి తో పాటు, సదాశివపేట, కోహిర్, జహీరాబాద్, న్యాల్కల్, మునిపల్లి, నారాయణఖేడ్, హత్నూర, రాయికోడ్, జోగిపేట్, కొండాపూర్, కంది తదితర మండలాలలో సాంప్రదాయ బద్ధంగా కుల మతాలకు అతీతంగా. భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

### త్యాగనిరతి

ఇస్లాంలో న్యాయం, ధర్మం, సత్యం, త్యాగానికి ప్రాధాన్యత అధికం. ముస్లింలు దుఃఖదినాలు పాటించే మొహర్రం నెల



ప్రవక్తల త్యాగనిరతికి ప్రతీకగా నిలుస్తుంది. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం మొదటి నెల అయిన మొహర్రంను ముస్లింలు వేడుకగా కాకుండా, సంతాప దినాలుగా, ప్రాణత్యా గాలు చేసిన ప్రవక్తలను స్మరించుకుంటూ ప్రాపంచిక సుఖ సంతోషాలకు దూరంగా గడపటం మహనీయుల పట్ల వారికి ఉన్న భక్తిభావాలకు నిదర్శనం.

### బాసికం ఊరేగింపు...

మొహర్రం కార్యక్రమాలలో తొమ్మిదవ రోజుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఆరోజు ఉదయం నుంచి మొక్కుబడులు ఉన్నవారు గంధం పీరు మకాన్కు వచ్చి లంగర్లు సమర్పిస్తారు. తమ కోర్కెలు తీర్చాలని పీరును ప్రార్థిస్తారు. సంతానం పొందిన వారు మొక్కుబడులు చెల్లించుకుంటారు.

కళాకారులు, డప్పు వాయిద్య కారులు పాల్గొని తమ ప్రజ్ఞ పాటవాలతో ఆకట్టు కుంటారు. ఇక కళ్లు మిరిమిట్లు గొలిపేలా వివిధ రకాల బాణాసంచా పేలుళ్ల ఎంత గానో అలరిస్తుంది. పెద్ద పులుల వేషధా రణలు నిర్వహించే ప్రదర్శన ప్రత్యేక ఆక ర్షణగా నిలుస్తుంది. ఎంతో పవిత్రంగా భావించే బాసిక ఊరేగింపును తిల కించేందుకు జనం ప్రవాహంలా తరలివస్తారు. తెల్లవారుజామున గంధం పీరును ఊరేగిస్తారు.

### అలరించిన విచిత్ర వేషాధారణ..

మొహర్రం వేడుకల సందర్భంగా గ్రామాల్లో విచిత్ర వేషా లతో మూడు రోజుల పాటు అలరిస్తారు. మండలంలోని మొలగవల్లిలో మొహర్రం పురస్కరించుకుని రామచంద్ర అనే వ్యక్తి ఏటా జగ్గుపులి వేషం వేశారు. గ్రామంలోని పెద్ద మసీదు, చిన్న మసీదు, డిక్కీ మసీదుల వద్ద కొలు వైన పీర్ల చావిడి వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పులిని బంధించడానికి మరో ముఠా వల పట్టుకొని వెదు కుతున్న వేషధారణలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి.

### నిజాంపూర్‌లో మొహర్రం వేడుకలు..

సదాశివపేట మండలంలోని నిజాంపూర్ గ్రామంలో భక్తిశ్రద్ధలతో మొహరం (పీర్ల పండగ) వేడుకలు ఘనంగా నిర్వహించారు. గత వంద సంవత్సరాలుగా గ్రామంలో పీర్ల పండగ కుల మతాలకు అతీతంగా నిర్వహిస్తారు తొమ్మిది రోజులపాటు నిత్యం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆట పాటలతో పండగ నిర్వహిస్తారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన పీర్ల ఊరేగింపు మధ్య రాత్రి వరకు కొనసాగుతుంది. ఊరేగింపులో నజ్జు, ఇమ్రాన్, లతీఫ్, కుర్షిద్, నఫీస్, అక్బర్, జాకీ, ఏకార్ తో పాటు నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పర్యవేక్షించిన కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 26 (జనం సాక్షి) :** ఓటరు జాబితాల ఖచ్చితత్వం కోసమే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని, ఓట్లు తొలగిస్తారనే అపోహలను ఎవరూ నమ్మ వద్దని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. ఈ నెల 25 నుంచి ప్రారంభమైన (సర్) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు.అందులో భాగంగా నారాయణపేట మండలంలోని జాజాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి చెందిన బసుదే కిష్టప్ప ఇంటికి వెళ్ళి స్వయంగా కలెక్టరే ఫారాలను పంపిణీ చేశారు.అంతేకాకుండా ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా నింపాలో ఇంటి యజమానికి అర్థం అయ్యేలా వివరించారు. నింపిన ఫారాలను రెండు, మూడు రోజుల్లో తిరిగి బీ ఎల్ వో లకు అందజేయాలని తెలిపారు. రెండు రోజుల్లో గ్రామంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలని బీ ఎల్ వో లను ఆమె ఆదేశించారు. ఫారాలు ఇచ్చేటప్పుడే ఓటర్ల అనుమానాలను బీఎల్ వోలు నివృత్తి చేయాలన్నారు.ఎలాంటి అపోహలకు తావు లేకుండా ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలలో అన్ని వివరాలు రాసి తిరిగి ఇచ్చేయాలని కలెక్టర్ కోరారు.అనంతరం బసుదే కిష్టప్ప ఇంట్లో మగ్గంపై నేత కార్మికులు నేస్తున్న నారాయణపేట కాటన్ చీరలను ఆమె ఆసక్తిగా చూశారు. చీరలు నేసే మొత్తం ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. కిష్టప్ప ఇంట్లో ఉన్న కాటన్ చీరలను పరిశీలించి మూడు చీరలను కలెక్టర్ కొనుగోలు చేశారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగీత, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## ఆహ్లాదం, ఆరోగ్యం కోసమే పార్కులు

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**అమీన్పూర్, జూన్ 26 (జనం సాక్షి) :** పార్కులు ప్రజల ఆరోగ్యానికి, భవిష్యత్తు తరాల ఆనందానికి చిరునామాగా నిలుస్తాయని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీ, హెచ్ఎంటి శిల్ప లేఔట్ కాలనీ, పిఎన్ఆర్ కాలనీలలో రూ.1.51 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పార్కుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో గల ప్రతి పార్కు అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. పార్కుల అభివృద్ధి ద్వారా ప్రజలకు ఆహ్లాద వాతావరణంతో పాటు పచ్చదనం పెరగడంతో కాలనీలలో స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు.. ప్రతి పార్కులో పిల్లలకు ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ సురేష్, డి ఈ వెంకటరమణ, పార్కుల విభాగం మేనేజర్ సతీష్, మాజీ కౌన్సిలర్లు కృష్ణ, మహదేవ రెడ్డి, బిజిలి రాజు, నాయకులు ఉపేందర్ రెడ్డి, సునీత రాములు, గోపాల్ , మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం

- చెడు వ్యసనాలను దూరంగా తరిమేద్దాం
- బంగారు భవిష్యత్తు కోసం యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి
- కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్

**నారాయణపేట జిల్లా బ్యూరో జూన్ 26 (జనం సాకి) :** డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నుండి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెడు వ్యస నాలకు దూరంగా ఉండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టా లని, యువత యాంటీ డ్రగ్ సోల్జర్స్‌గా పని చేయాలని జిల్లా కలెక్టర్ సి ఎచ్ ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్‌లు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్ర వ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల,కళాశాల విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక, ఎస్పీ డా వినీత్‌లు ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎస్పీ కార్యాలయం నుండి సత్యనారాయణ చౌరస్తా వరకు కొనసాగింది.అనంతరం సత్యనారాయణ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ కు వ్యతిరేకంగా అందరూ కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు బాధ్యత వహించాలన్నారు.యువత తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తోటి వారూ



ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య దశలో బంగారు భవిష్యత్తు కోసం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, ఫ్రెండ్స్ ,ఎంజాయ్ అంటూ ఇప్పుడు తిరిగితే మన సమయం బాగా లేనప్పుడు మనకు తోడుగా ఎవ్వరూ రారని కలెక్టర్ విద్యార్థులకు తెలిపారు. మిమ్మల్ని తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారని, వాళ్ళు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్టేట్ ఈగల్ ఫోర్స్ టీం డ్రగ్స్ పై దాడులు నిర్వహిస్తున్నాయని,ప్రజలు యువత వాటికి దూరంగా ఉండాలని తెలిపారు.డ్రగ్స్ అనేవి ఒక విధంగా టెర్రరిస్ట్‌లాంటివని, ఇవి దేశ భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారిగా మారాయని తెలిపారు.యువత ఎక్కువగా ఉన్న భారతదేశాన్ని బలహీనపరచేందుకు డ్రగ్స్‌ను ఒక ఆయుధంగా ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అణుబాంబులు అవసరం లేదని, ఆ దేశ యువతను చెడు మార్గంలోకి నెట్టేస్తే చాలు అని తెలిపారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే యువత భవిష్యత్తు పూర్తిగా అంధకారంలోకి వెళ్లిపోతుందని, అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్ అనేది జాతీయ భద్రత కు భంగం కలిగించేలా చేస్తుందని, అందువల్ల విద్యార్థులు, యువత ఈ చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండి దేశ అభివృద్ధికి పునాదులు వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమాజంలో అవగాహన పెంచుతూ యాంటీ నార్కోటిక్ డ్రగ్ వారియర్స్‌గా పని చేయాలని పిలుపునిచ్చారు.ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగం చేస్తున్నట్లు గమనించినట్లయితే 1908 టోల్ ఫ్రీ నంబర్ లేదా డయల్ 100 కు వెంటనే సమాచారం అందించాలని కోరారు.సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.డ్రగ్స్‌ను ఒక్కసారి తాకితే జీవితాంతం దాని ప్రభావం ఉండే ప్రమాదం ఉందని,అందువల్ల యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ సమాజాన్ని కాపాడే యోధులుగా మారాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్,ఆర్ ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, గాయత్రి, కృష్ణ చైతన్య, ఎక్సైజ్ ఎస్ఐ లు,మరియు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## త్యాగానికి, సహనానికి ప్రతీక మొహరం

**రేవల్లి, జూన్ 26 (జనంసాక్షి) :** మొహరం పండుగ ముస్లింలకు అత్యంత పవిత్రమైన పండుగలలో ఒకటి. మండలంలోని ప్రతి గ్రామంలో కులమాతాలకు అతీతంగా జరుపుకుంటారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొహరం మొదటి నెల, ఈ నెల 10వ రోజును 'ఆషురా'గా పిలుస్తారు. క్రీ.శ 680లో ఇరాక్‌లోని కర్బలా మైదానంలో ప్రవక్త మహమ్మద్ మనవడు ఇమామ్ హుస్సేన్, అతని 72 మంది అనుచరులు అన్యాయానికి ఎదురు నిలిచి, ధర్మం కోసం ప్రాణ త్యాగం చేశారు. ఈ త్యాగాన్ని స్మరించుకుంటూ మొహరం నిర్వహిస్తారు. మొహరం కేవలం సంతాప దినం కాదు, అన్యాయంపై పోరాడాలనే స్ఫూర్తిని, ధర్మం కోసం



నిలబడాలనే సందేశాన్ని ఇస్తుంది. త్యాగం, సహనం, న్యాయం అనే విలువలను ఈ పండుగ గుర్తు చేస్తుంది.

## కులమతాలకు అతీతంగా మొహరం వేడుకలు జరుపుకోవడం సంతోషకరం

**పుల్కల్, జూన్ 26 (జనం సాక్షి) :** మొహరం వేడుకలను కులమతాలకు అతీతంగా, పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు కలిసి నిర్వహించడం సంతోషకరమని ఎస్సై విశ్వజన్ తెలిపారు.శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన మొహరం వేడుకల్లో ఎస్సై ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై విశ్వజన్ మాట్లాడుతూ ఇటువంటి వేడుకలు సామాజిక సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు.ప్రజలు



శాంతియుతంగా,పరస్పర సహకారంతో వేడుకలను జరుపుకోవాలని,పోలీసు శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అన్ని వర్గాల ప్రజలు ఐక్యతను చాటుతూ మొహరం వేడుకలను విజయవంతం చేయాలని ఎస్సై కోరారు. అనంతరం మొహరం పండగ పురస్కరించుకొని ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన షరబత్ కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తులకు షరభత్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోయిని శ్రీనివాస్, కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, లస్కరి ఆంజనేయులు,బచ్చు మల్ల ఉదయ్ కుమార్, వార్డు సభ్యులు మహమ్మద్ అబిక్, మన్నె విట్టల్, తాజుద్దీన్, ఫయాజ్, సాజిద్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ బలోపేతానికి కార్యాచరణ



**రామచంద్రాపురం, జూన్ 26 (జనం సాక్షి) :** మహిళల రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మహిళా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని రామచంద్రాపురం బాలాజీ గార్డెన్స్‌లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహిళా కాంగ్రెస్ ముఖ్య సమావేశంలో సంస్థాగత బలోపేతం, పార్టీ కార్యక్రమాల విస్తరణపై చర్చించారు. గ్రామ, బూత్ స్థాయి వరకు మహిళా కాంగ్రెస్ కమిటీలను మరింత పటిష్ఠం చేసి మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలని నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అలాగే మహిళలకు శాసనసభలు, పార్లమెంట్‌లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే చట్టరూపం దాల్చిన బిల్లును వెంటనే అమలు చేసి మహిళలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. సమావేశంలో జాతీయ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కమలాక్షి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంజలి తదితరులు పాల్గొన్నారు.

# రెట్టింపు ధరలకు వంట గ్యాస్

- ఏజెన్సీ నిర్వాహకుల చేతివాటం
- వినియోగదారుల నుంచి అదనపు వసూలు
- వాస్తవ ధర రూ.1014
- గ్రామంలో 1100 రూపాయలు వసూలు...
- కొరతను సొమ్ము చేసుకుంటున్న ఏజెన్సీలు

**కోహిర్, జూన్ 26 (జనం సాక్షి) :** గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల పంపిణీ సాధారణ స్థితికి చేరుకోవడం లేదు. గ్రామాలు.. పట్టణాలలో గ్యాస్ సరఫరాలో కొరత నెలకొంది. ఆన్లైన్లో బుకింగ్ చేసి నెల రోజులు గడుస్తున్నా డెలివరీలు ఉండడం లేదు. గతంలో బుకింగ్ చేసిన నిమిషాల వ్యవధిలోనే ఎస్ఎంఎస్ రూపంలో డెలివరీ తేదీ.. ధరలతో సహా సమాచారం ఫోన్లకు వచ్చేది. తాజాగా మాత్రం ఆన్లైన్లో గృహ వినియోగ గ్యాస్ బుకింగ్ జరుగుతున్నా డెలివరీ ఎప్పుడు అనేది తెలియడం లేదు. దీంతో గ్యాస్ కోసం బుకింగ్ చేసుకున్న వినియోగ దారులు అయోమయ పరిస్థితిని,ఎదుర్కొంటున్నారు,పశ్చిమాసియాలోని యుద్ధం కారణంగా స్తంభించిన గ్యాస్ పంపిణీ.. బుకింగ్లో సాంకేతిక సమస్యలు రావడంతో ఏజెన్సీ నిర్వాహకులు దోపిడీ ప్రారంభిం చారు. వాణిజ్య సిలిండర్ల పంపిణీ పూర్తిగా నిలిచిపోవ డంతో వ్యాపారాలకు పూర్తిగా గృహ వినియోగ సిలిండర్లను వినియోగించడంతో కొరత మరింత రెట్టింపు అవుతోంది.

గ్రామంలో 1100 రూపాయలు వసూలు...

కోహిర్ మండలా నియోజకవర్గంలో గ్యాస్ కొరత తీవ్రంగా ఉన్నా ఇప్పటి వరకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఏ రోజు కూడా ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడిన పరిస్థితి.. సమీక్షలు నిర్వహించిన సందర్భాలు లేవు. ఈ కారణంగా గృహ వినియోగదారులకు వంట గ్యాస్ దొరకని పరిస్థితి

### ఆదనపు వసూళ్లు

వంట గ్యాస్ సిలిండర్లు పెద్ద ఎత్తున దారి మళ్లు తున్నా కూడా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు చేయడం లేదు. ఇతర జిల్లాల్లో మాత్రం పెద్ద ఎత్తున తనిఖీలు చేసి హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపారాల్లో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నారు. గ్యాస్ సిలిండర్లను సీజ్ చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తున్నారు. జిల్లాలో మాత్రం పౌరసరఫరాల శాఖ అధికారులు ఏ నాడూ తనిఖీలు నిర్వహించిన సందర్భాలు లేవు. మరోవైపు క్షేత్రస్థాయిలో వంట గ్యాస్ కొరత తీవ్రంగా ఉన్నా ఏజెన్సీలలో తనిఖీలు కూడా చేయడం లేదు. గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచకపోయినా పెంచినట్లు ఏజెన్సీ నిర్వాహకులు చెప్పి వినియోగదారుల నుంచి అదనంగా వసూళు చేస్తున్నా నివారించాల్సిన పౌరసరఫ రాల శాఖ అధికార యంత్రాంగం కార్యాల యం గడప దాటడం లేదు. తాము రైతుల నుంచి ధాన్యం సేకరణ, రేషన్ బియ్యం పంపిణీ మాత్రమే పర్యవేక్షిస్తామనే విధంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు



వ్యవహరించడం గమనార్హం. దీంతో జిల్లా వ్యాప్తంగా వంట గ్యాస్ కృత్రిమ కొరత నెలకొనడంతో పాటు విచ్చలవిడిగా బ్లాక్లో గృహ వినియోగ గ్యాస్ ను విక్రయించి ఏజెన్సీలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇది చాలదు అన్నట్లు వినియోగదారుల నుంచి ప్రతి సిలిండర్ వద్ద వాస్తవ ధరకంటే అదనంగా వసూలు చేస్తున్నారు.నెలకొంది. మరోవైపు బుకింగ్ తరువాత సిలిండర్ డెలివరీ వచ్చినా దోపిడీ తప్పడం లేదు. నిర్వాహకులు ఒక్కో సిలిండర్ డెలివరీ నుంచి,1100 రూపాయలు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.1014 ఉంది. ధరలు పెరిగాయని వినియోగదా రులకు చెప్పి మరీ అధికంగా వసూలు చేస్తున్నారు. ఈ దోపిడీ కోహిర్ మండల కేంద్రంలో ఎక్కువగా ఉంది. వాస్తవానికి వంట గ్యాస్ సిలిండర్ ధర పెరగ లేదు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కృత్రిమ కొరతను సృష్టించి.. ధరలను పెంచి దోపిడీకి పాల్పడుతున్నారు.

# రైతులకు అందుబాటులో ఎరువులు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**చిట్యాల, జూన్ 26 (జనం సాక్షి) :** వానాకాలం సీజన్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండడానికి కొత్తగా ఆకా సెంటర్లను ప్రవేశపెట్టినట్లు ఎమ్మెల్యే సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గుమ్మడి సత్యనారాయణ కి చెందిన నూతనంగా ఏర్పాటు చేసిన ఆకా ఫార్మర్స్ సర్వీస్ సెంటర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, వ్యవసాయ అవసరాలకు సంబంధించిన సేవలు అందుబాటులో ఉండటం వ్యవసాయాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. రైతులు సరైన సమయంలో నాణ్యమైన ఎరువులను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం ఆకా ఫార్మర్స్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేసి, రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి, ముకిరాల మధు వంశీకృష్ణ, కట్కూరి నరేందర్, పులి తిరుపతిరెడ్డి, చిలకల రాయకొమురు, దొడ్డు కృష్ణయ్య, అల్లం రాజు, ఏ ఆర్ పల్లి సర్పంచ్ కొడారి అశోక్, నక్క భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైప్ లైన్‌కు మరమ్మతులు చేపట్టాలి

- కాల్ నాయక్ తండాను సందర్శించిన డిపిఓ కల్పన
- 'జనం సాక్షి' కథనానికి స్పందన



**చెన్నారావుపేట, జూన్ 26( జనం సాక్షి):** లీకేజీకి గురైన మిషన్ భగీరథ పైప్ లైన్ కు మరమ్మతులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిని కల్పన అన్నారు. గురువారం 'జనం సాక్షి' దినపత్రికలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ.... కలుషితమవుతున్న తాగునీరు... అని వచ్చిన కథనానికి ఆమె వెంటనే స్పందించారు. కాల్ నాయక్ తండ గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా లీకేజీకి గురై తాగునీరు కలుషితమవుతున్న మిషన్ భగీరథ పైప్ లైన్ ను ఆమె పరిశీలించారు. వెంటనే లీకేజీ కి గురైన మిషన్ భగీరథ పైప్ లైన్ కు మరమ్మత్తులు చేపట్టి తాగునీరు కలుషితం కాకుండా చూసి నల్లాల ద్వారా స్వచ్ఛమైన త్రాగునీటిని సరఫరా చేయాలని మండల పంచాయతీ అధికారి తండ జగదీష్, పంచాయతీ కార్యదర్శి నరసింహరాములుకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను, గ్రామపంచాయతీ నర్సరీ, డంపింగ్ యార్డ్ ను సందర్శించి పరిశీలించారు.

# పల్స్ పోలియోకు ఏర్పాట్లు పూర్తి

- నిండు ప్రాణానికి రెండు చుక్కలు
- భూపాలపల్లి జిల్లాలో 34,728 మంది పిల్లలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిండు ప్రాణానికి రెండు చుక్కలు చాలు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. భూపాలపల్లి జిల్లాలో 34,728 మంది పిల్లలకు వ్యాక్సిన్ వేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఆదివారం నుండి పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు 296 బూతులు, 14 మొబైల్ టీంలతో వ్యాక్సిన్ పర్యవేక్షణ చేయడం, వ్యాక్సిన్ పంపిణీకి ఏర్పాట్లు చేయడం వంటివి సిద్ధం చేశారు. 28న దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయి. చిన్నారుల నిండు ప్రాణానికి రెండు పోలియో చుక్కలు అవసరం కాబట్టి, అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. 0 నుండి 5 ఏళ్ల వయసు గల చిన్నారులు ఇలాంటి అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. అందుకే అందరూ రెండు పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత ఉంది. ప్రతి ఒక్కరూ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి కోరారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు పోలియో వ్యాక్సిన్ ఇస్తామని, జిల్లాలోని 241 గ్రామ పంచాయతీలలో గల అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆదివారం రోజు పోలియో చుక్కలు వేస్తామన్నారు. సోమవారం, మంగళవారం ఇంటింటికి తిరిగి మిగతా పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకొని మీ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయన కోరారు.

# పొట్టిగుట్ట తండాలో తాగునీటి బోరు వివాదం

- పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయితీ



**పాలకుర్తి/దేవరుప్పుల జూన్ 26 (జనంసాక్షి) :** పొట్టిగుట్ట తండాలో గ్రామ ప్రజల తాగునీటి అవసరాల కోసం గతంలో ఓ రైతు భూమిలో ఏర్పాటు చేసిన బోరు నుంచి గ్రామపంచాయతీ ద్వారా తాగునీటి సరఫరా కొనసాగుతోంది. అయితే ప్రస్తుతం ఆ రైతు, "నా భూమిలో ఉన్న బోరు నాకే కావాలి. ఇకపై గ్రామపంచాయతీకి నీరు ఇవ్వను" అని చెప్పడంతో గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రైతు, తండా ప్రజల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని, పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. తండా మహిళలు ఖాళీ బిందెలతో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని, రైతుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సృజన్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సృజన్ కుమార్ ఇరుపక్షాల వాదనలు విని, బోరుకు సంబంధించిన పూర్తి వివరాలను ఎంపీడీఓ కార్యాలయం ద్వారా పరిశీలించి, చట్టపరంగా తగిన పరిష్కారం చూపిస్తామని తెలిపారు. అప్పటి వరకు ఎలాంటి ఉద్రిక్తతలకు పాల్పడకుండా శాంతియుతంగా వ్యవహరించాలని ఇరువర్గాలకు సూచించారు. ఈ సందర్భంగా పొట్టిగుట్ట తండా ప్రజలకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి అండగా నిలిచి, గ్రామ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు తీగల దయాకర్, బస్వా మల్లేశం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తండా ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎస్ కావడమే నా జీవిత లక్ష్యం : కినక పద్మవతి

- వరంగల్ 2కే రన్ లో అదిలాబాద్ విద్యార్థి విజేత
- కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేత



**సిరికొండ, జూన్ 26 (జనం సాక్షి) :** అంతర్జాతీయ మత్తు పదార్థాలు, ధూమపాన నివారణ దినోత్సవం సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ సంప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్ లో అదిలాబాద్ జిల్లా చెందిన కాకతీయ విశ్వవిద్యాలయం బీపీఎడ్ విద్యార్థిని పద్మావతి ప్రథమ విజేతగా నిలిచింది. అదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం చింతగూడ గ్రామానికి చెందిన కినక పద్మవతి అనే విద్యార్థి మారుమూల ప్రాంతం గిరిజన గ్రామం నుండి వచ్చి కేయూలో చదువుకుంటూ సివిల్స్ కు సిద్ధమవుతున్నానని తెలిపింది. క్రీడలపై ఆసక్తి ఉందని, భవిష్యత్తులో ఐపీఎస్ అధికారి కావడమే నా జీవిత లక్ష్యమని ఆమె తెలిపింది. ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణంలో

# యువత ముందుకు రావాలి

- వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్
- సెంట్రల్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్





**వరంగల్ బ్యూరో/హన్మకొండ ప్రతినిధి, జూన్ 26 (జనం సాక్షి) :** డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం యువత ముందుకు రావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రపంచ మాదరద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకోని సెంట్రల్ జోన్ పోలీసుల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కె పరుగును వరంగల్ పోలీస్ కమిషనర్ ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, కుడా చైర్మన్‌తో కలసి ప్రారంభించారు. ట్రై సిటి పరిధిలోని యువత విద్యార్థులు పాల్గోన్న ఈ పరుగు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుండి సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వరకు కోనసాగింది. ఈ పరుగులో ప్రతిభ కబరిచిన యువతకు ముఖ్య అతిధిల చేతుల మీదుగా పతకాలు, సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్బంగా కార్యక్రమానికి ముఖ్య అతిధి వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల సంబంధించి ప్రస్తుత సమాజంలో పెద్ద సమస్యగా మారిందని, యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి పోవద్దని, ఒక్కసారి వాటిని వినియోగించడం ద్వారా యువత జీవితాలు అంధకారం మారుతాయని, ముఖ్యంగా మత్తు పదార్థాలను విక్రయాలు, వినియోగించడంలాంటి చర్యలకు పాల్పడి చిక్కుల్లో పడోద్దని, విద్యార్థులు కేవలం చదువులపైనే దృష్టి పెట్టాలని, అదే విధంగా యువత తమ ఉన్నంత లక్ష్య సాధనకై కృషి చేయాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, మాట్లాడుతూ యువత చేడు వ్యసనాలను దూరంగా వుంటూ ఆరోగ్యంతో వుండాలని, మత్తు పదార్థాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగివుండటంతో పాటు, ఇతరులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణకై ఈగల్ ఫోర్స్ విభాగాన్ని చేయడమైనదని, ఎవరైన మాదకద్రవ్యాలు విక్రయించిన, వినియోగించిన తక్షణమే 1908 నంబర్‌కు సమాచారం అందించాలని, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు తెలిపారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ఉజ్వల భవిష్యత్త్ వున్న యువత మత్తుకు దూరంగా వుండాలని, డ్రగ్స్‌కు బానిసలయ్యే వారి కుటుంబాలు, ముఖ్యంగా తల్లులు అనుభవించే వేదన వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేసారు. అనంతరం ఈ పరుగులో పాల్గోన్న యువత, విద్యార్థుల మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సైనికుడిలా పనిచేస్తామని అంటు ప్రతిజ్ఞ చేయించడంతో పాటు ఈ కార్యక్రమానికి హాజరయిన ముఖ్య అతిధిలు మాదకద్రవ్యాల నిర్మూలనకై "ఐయాం యాంటీ డ్రగ్స్ సోల్జర" సెల్ఫీ పాయింట్ ఫోటోలు దిగి యువతను స్పూర్తిగా నిలిచారు. ఈ కార్యక్రమములో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు, టిజీ ఎన్‌పిడిసిఎల్ యం.డి వరుణ్ రెడ్డి, వరంగల్, హన్మకొండ కలెక్టర్లు డా.సత్యశారద, చాహత్ బాజ్‌పాయి, కుడా చైర్మన్ ఇనగాల వెంట్రామిరెడ్డి, డిసిపిలు దార కవిత, అంకిత్‌కుమార్, అడిషినల్ కలెక్టర్ సంధ్యతో పాటు అడిషినల్ డిసిపిలు,ఎసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గోన్నారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణ అందరి ధ్యేయం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (జనంసాక్షి):** డ్రగ్స్ రహిత తెలంగాణ అందరి ధ్యేయమని, డ్రగ్స్ నిర్మూలన కోసం అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించిన అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేకదినం సందర్భంగా భూపాలపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా నిర్మించుకోవాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల యువకులు తమ ప్రాణాలను కోల్పోవడమే కాకుండా, కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత తెలంగాణ సాధన కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ డ్రగ్స్ రవాణా, విక్రయాలపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటూ నిరంతరం నిఘా కొనసాగిస్తోం దన్నారు. అయితే కేవలం పోలీసుల చర్యలతోనే కాకుండా ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహా సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరిస్తేనే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవు తుందన్నారు. అనుమానాస్పద డ్రగ్స్ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్‌కు బానిసైన వారి పునరావాసం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సంకీర్త్, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి

- నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



**నిర్మల్ బ్యూరో, జూన్ 26 (జనంసాక్షి) :** జిల్లాలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న పిటిషన్ల పురోగతిపై జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను ప్రత్యేకంగా సమీక్షించి, వాటి విచారణను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ప్రజావాణి పిటిషన్‌పై ఎప్పటికప్పుడు ఫాలోఅప్ నిర్వహించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజావాణి కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్న ఎస్పీ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజమంతా భాగస్వాములు కావాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్
- అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహణ
- వాల్ ఆఫ్ ప్రామిస్ పై సంతకం చేసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేసిన జిల్లా ఎస్పీ



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 26(జనంసాక్షి ):** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ పట్టణంలో 2కె రన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నితికా పంత్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని, ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులు క్రమశిక్షణ, మంచి విలువలు అలవర్చుకొని, మాదకద్రవ్యాలు, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, డ్రగ్స్ వినియోగం,అక్రమ రవాణాను అరికట్టేందుకు సమాజాన్ని చైతన్యపరచడం, యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన వాల్ ఆఫ్ ప్రామిస్ పై జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు, విద్యార్థులు డ్రగ్స్ నిరోధక సందేశాలు రాసి, సంతకాలు చేసి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ మద్దతు ప్రకటించారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజలు, విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు,సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ 2కె రన్ కార్యక్రమం ఆసిఫాబాద్ పోలీస్ హెడ్ క్వాటర్స్ నుండి గాంధీ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్ నుండి తిరిగి పోలీస్ హెడ్ క్వాటర్స్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, పోలీస్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఆసిఫాబాద్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల్లో విద్యార్థిని ఆచూకీ గుర్తించిన రెబ్బెన పోలీసులు

**రెబ్బెన,జూన్26 (జనంసాక్షి ):** రెబ్బెన మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని అదృశ్యమైన కేసును రెబ్బెన పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించారు. విద్యార్థిని క్షేమంగా లభించడంతో కుటుంబ సభ్యులు, గురుకుల సిబ్బంది, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిని అదృశ్యమైన విషయం తెలియగానే రెబ్బెన సీఐ సంజయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేసి మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు నిర్వహించారు. సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారం, వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టడంతో విద్యార్థిని ఆచూకీ త్వరితగతిన గుర్తించినట్లు రెబ్బెన ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. విద్యార్థిని క్షేమంగా లభించిన అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, అవసరమైన న్యాయపరమైన ప్రక్రియలను చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. విద్యార్థిని అదృశ్యానికి గల కారణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, ఆమె నుంచి పూర్తి వివరాలు సేకరించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కేసును 24 గంటల్లోనే ఛేదించడంలో పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయడం ఫలితమని పేర్కొన్నారు. విద్యార్థిని సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించిన రెబ్బెన పోలీసుల వేగవంతమైన స్పందనపై మండల ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేశారు.

# దొంగతనం కేసులో నిందితుల అరెస్టు



**గూడూరు, జూన్26 (జనంసాక్షి):** రెండు రోజుల క్రితం గూడూరు మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు దగ్గరలో జరిగిన దొంగతనం కేసులో నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 4గురు వ్యక్తులు పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి మండలం బండాపురం గ్రామానికి చెందిన కుత్తాడి దుర్గ, ఇదే జిల్లా భీమడోలు మండల కేంద్రానికి చెందిన యారచాని మహాలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండల కేంద్రానికి చెందిన ఉయ్యాల గోపయ్య, పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి మండలం బండాపురం గ్రామానికి చెందిన కాసాని అనంత సతీష్ కుమార్‌లను చాకచక్యంగా పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా వారికి రిమాండ్ విధించడం జరిగిందని ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జీడబ్ల్యూఎంసీ మున్సిపల్ కమిషనర్‌గా టి.వెంకన్న నియామకం



**వరంగల్ ఎంజీఎం, జూన్ 26 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం హెచ్‌ఎండీఏ లో కోర్ అర్బన్ రీజియన్, మెట్రో రైల్ విభాగం జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న టి. వెంకన్న ను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ నియమించింది. ఈ మేరకు ఇప్పటి వరకు జీడబ్ల్యూఎంసీ మున్సిపల్ కమిషనర్ పదవికి అదనపు బాధ్యతలు (ఎఫ్ ఏ సి) నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఐఏఎస్ ని ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన కమిషనర్ టి. వెంకన్న త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# నిర్మల్‌లో ముమ్మరంగా ఓటర్ల ధృవీకరణ ప్రక్రియ

- ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ

**నిర్మల్ టౌన్, జూన్ 26 (జనంసాక్షి) :** దేశంలో బోగస్ ఓట్లను తొలగించి ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్మల్ జిల్లా కేంద్రంలో కొనసాగుతోంది. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఓటర్ల వద్ద ఉన్న ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ కార్డులను పరిశీలించి ఓటరు నమోదు దరఖాస్తులను అందజేస్తున్నారు. ఓటర్లు స్వయంగా దరఖాస్తులను పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని అధికారులు సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైనా వెంటనే 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
27 జూన్ 2026

# గంజాయి రహిత సమాజమే లక్ష్యం

● దివాకర్ టీఎస్

**ఖమ్మం కార్పొరేషన్జ్, జూన్ 26 (జనం సాక్షి) :** మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, బాధ్యతగా కృషి చేయాలని, జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం ఖమ్మం నగరం మమత రోడ్డు లోని వివిసి టాటా సర్వీస్ సెంటర్ నుంచి లాకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు, యువత, పోలీస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తో కలిసి రన్ లో కలెక్టర్, పోలీస్ కమిషనర్ లు పాల్గొని స్ఫూర్తినిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో యువత పాత్ర చాల కీలకమని, యువతకు ఉపాధి కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు కేటాయిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తక్షణమే అప్రమత్తం కావాలని అన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకోవాలని, మాదకద్రవ్యాలు, మత్తు పానీయాలు సేవించడం వ్యాధి కంటే ప్రమాదకరమని వివరించారు. డ్రగ్స్ వాడకం వల్ల ఒకరి జీవితం మాత్రమే ప్రభావితం కాదని, కుటుంబం, సమాజాన్ని నాశనం చేస్తుందని అన్నారు. డ్రగ్స్ నియంత్రణ కేవలం అధికారులు మాత్రమే చేయలేరని, ప్రజలంతా సమిష్టిగా ఉంటూ అధికారులకు సహకరిస్తేనే మెరుగైన ఫలితాలు లభిస్తాయని కలెక్టర్ తెలిపారు. డ్రగ్స్ వాడకం ప్రారంభించకముందే మనమంతా మేల్కొనాలని, యువత డ్రగ్స్ వంటి వాటి వైపు వెళ్లకుండా దూరంగా ఉండాలని, తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ఆరోగ్యశాఖ, మాదకద్రవ్య నివారణ సంస్థలు, సమాజం అందరూ కలిసి సమష్టిగా చైతన్యం పెంచినప్పుడే మాదకద్రవ్యాల ప్రమాదం నుంచి దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించగలుగుతామన్నారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని అన్నారు. యువత దృష్టి అంతా జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడితే మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పాడు చేస్తుందన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి రహిత సమాజమే లక్ష్యంగా పోలీసుశాఖ కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తునమన్నారు. ఎక్కడైనా గంజాయి, ఇతర మత్తుపదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1908 కు సమాచారం అందించాలన్నారు. మీ వివరాలు గోప్యం గా ఉంచడం జరుగుతుందని అన్నారు. అనంతరం ప్రజలు, యువత, విద్యార్థులు, అధికారులతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం పై ప్రతిజ్ఞ చేశారు. తర్వాత "ఐయామ్ యాంటీ డ్రగ్ సోల్జర్స్" సెల్ఫ్ పాయింట్ వద్ద ఫోటోలు దిగడంతో పాటు సైన్ బోర్డు వద్ద సంతకాలు చేసి మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు, ఎస్సై లు, అధికారులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హ్యామ్ రోడ్ల పైలాన్ ప్రాజెక్టును పరిశీలించిన కమిషనర్ వికాస్ రాజ్



**కనగల్లు, జూన్ 26 (జనం సాక్షి) :** ఈనెల 28న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసే 13 వేల కోట్ల రూపాయల హ్యామ్ రోడ్ల పైలాన్ ప్రాజెక్టు ను శుక్రవారం రాష్ట్ర రోడ్లు భవనముల, మరియు రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లా అధికారులతో కలిసి కనగల్లు సబ్ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన శిలాఫలకం పనులను పరిశీలన చేశారు. అనంతరం ఎన్జీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసే సభలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సభా వేదిక, దగ్గర కాంక్రీట్ ఏర్పాటు చేయాలని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా టెంట్లు, హ్యాంగింగ్, వర్షాలు వచ్చిన తట్టుకునే విధంగా రైన్ టెంట్లు, బారికేడ్లు, సౌండ్ బాక్సులు, అందుబాటులో ఉంచాలని, సీఎం నల్లగొండకు చేరుకున్న దగ్గరనుంచి సభా ముగిసి బయలుదేరే వరకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఆర్ అండ్ బి, విద్యుత్, పోలీస్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్, ఎస్పీ శరత్చంద్ర పవర్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో వై అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి హ్యాము సి ఈ వివెంకటేశ్వర్లు, రాజేశ్వర్ రెడ్డి, ఎస్ ఈ శ్రీధర్ రెడ్డి, గణేష్ డిప్యూటీ ఆర్టిఏ కమిషనర్ వాణి, డి పి ఆర్ ఓ వెంకటేశ్వర్లు తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, పి ఆర్ ఏ ఈ రామకృష్ణ, విద్యుత్ ఏఈ కుమార్, ఎస్సై రాజీవ్ రెడ్డి వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## యూరియా పక్కదారి పట్టించిన ఫర్టిలైజర్ షాపుపై కేసు నమోదు

● చేర్యాల ఎస్ఐ గూడ అపూర్వ రెడ్డి
● రూ.17,10,144 విలువైన సబ్సిడీ యూరియా దారి మళ్లింపు



**చేర్యాల, జూన్ 26 (జనంసాక్షి) :** చేర్యాల పట్టణంలోని ఓ ఫెర్టిలైజర్ షాప్ లో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో యూరియా బస్తాలు పక్క దారి పట్టడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చేర్యాలు ఎస్ఐ గూడ పూర్వరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడిఏ టీ.రాధిక, మండల వ్యవసాయ అధికారి పులి భోగేశ్వర స్వామి లు ఇచ్చిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. జిల్లా వ్యవసాయ అధికారి సూచనలు మేరకు యూరియా బస్తాల అవకతవకలపై చేర్యాల మండల వ్యవసాయ అధికారి పులి భోగేశ్వర స్వామి ఈనెల 9న శ్రీ సాయి శివ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేయగా గోదాంలో ఎటువంటి యూరియా నిల్వలు లభించకపోగా యూరియాకు సంబంధించిన స్టాక్ నిలువల సమాచారం రిజిస్టర్లో పొందు చేయకుండా డీలర్ సందీప్ రెడ్డి 6429 యూరియా బ్యాగులకు సంబంధించిన టాక్సి ఇన్వాయిస్ లు ఈ పాస్ నుండి అంగీకారం ధ్రువీకరించలేదని తేలింది. ఈపాస్ లో యూరియా ఇన్వాయిస్ ధ్రువీకరించకపోతే రైతులకు ఫెర్టిలైజర్ యూరియా యాప్ లో బుకింగ్ చూపించవని, వారు కొనుగోలు చేయలేరు కానీ సాయి శివ ఫర్టిలైజర్ డీలర్ సందీప్ రెడ్డి రైతులకు 6429 బ్యాగులు అమ్మినట్లుగా తప్పుడు బిల్లులు తయారు చేసినట్లు నిర్ధారించారు. ఈపాస్ లో మాత్రమే లావాదేవీలు నమోదు చేసి భౌతిక బిల్లులు స్టాక్ రిజిస్టర్ ఇన్వాయిస్ లో కేవలం కాగితలపై మాత్రమే ఎటువంటి ఫిజికల్ గా యూరియా బ్యాగ్స్ మన చేర్యాల రాలేదని డీలర్ తెలిపారు. విచారణ తర్వాత తెలిపిన వివరాల ప్రకారం ప్రభుత్వం రైతులకు 45 కిలోల యూరియా సంచి పై రూ.2200 నుండి రూ.2500వరకు సబ్సిడీ అందిస్తుందని అన్నారు. రైతుల కోసం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర ఎమ్మార్పీ కేవలం రూ. 266 మాత్రమే ఉంటుందని, ఈ అక్రమాల వల్ల నిజమైన రైతులకు సబ్సిడీ యూరియా అందకుండా చేయడమే కాకుండా ఎరువుల పంపిణీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని దీనివల్ల రైతుల్లో ఆందోళన నెలకొనడంతో పాటు వ్యవసాయ శాఖ ప్రతిష్టకు భంగం కలుగుతుందన్నారు. అసలైన రైతులకు యూరియా అందకుండా రైతులకు అమ్మినట్లుగా నకిలీ కాగితాలు సృష్టించి సుమారు రూ. 17,10,144 విలువైన సబ్సిడీ ఏరియా దారి మళ్లించిన నిందితులపై చర్యలు తీసుకొని ఆరువేల పైచిలుకు యూరియా బ్యాగులు మాయం కుంభకోణంపై చర్యలు తీసుకొని ఆరు వేల పైన యూరియా బ్యాగులు మాయం చేసిన ఆంజనేయ ఫర్టిలైజర్స్, సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ తో పాటు శ్రీ గణేష్ ట్రేడర్స్, శ్రీ సాయి శివ ఫర్టిలైజర్ షాపులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై వ్యవసాయ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అపూర్వరెడ్డి తెలిపారు.

## అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకూడదు



**భువనగిరి, జూన్ 26 (జనం సాక్షి) :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. భువనగిరి క్యాంపు కార్యాలయంలో పట్టణ బూత్ లెవల్ ఏజెంట్లు, కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రతి బూత్ పరిధిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జూలై 30న విడుదల కానున్న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ప్రస్తుతం బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలు సేకరిస్తున్న నేపథ్యంలో, కొత్తగా అర్హత పొందిన ప్రతి ఓటరిని నమోదు చేయడంతో పాటు చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని దీూాలకు సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడం, వివరాల్లో పొరపాట్లు లేదా ఇతర లోపాలు కనిపిస్తే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సకాలంలో సరిచేయించాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్న ఎమ్మెల్యే, ఒక్క అర్హుడి ఓటు కూడా కోల్పోకుండా కాంగ్రెస్ నాయకులు, బూత్ కమిటీలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఓటర్ల జాబితాపై తలెత్తిన వివాదాల తరహా పరిస్థితులు తెలంగాణలో పునరావృతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే, ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు పార్టీ శ్రేణులు నిరంతరం పనిచేయాలని పిలుపునిచ్చారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారే



**అశ్వరావుపేట, జూన్ 26 (జనంసాక్షి) :** అశ్వరావుపేట క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలలో భాగంగా "కళ్యాణ లక్ష్మి" పథకం కింద 32 మంది లబ్ధిదారులకు (32,03,712 రూ)చెక్కులను పంపిణీ చేసినా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కళ్యాణ లక్ష్మి పథకం ఎంతో ఉపయోగకరమని తెలిపారు,అమ్మాయిల వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక ఒత్తిడిని తగ్గించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు,ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం వల్ల వేలాది కుటుంబాలు లాభపడుతున్నాయని అన్నారు. అలాగే సమాజంలో అమ్మాయిల పట్ల గౌరవం పెరగడానికి, బాల్య వివాహాలు తగ్గడానికీ కూడా ఈ పథకం దోహదపడుతోందని ఎమ్మెల్యే వివరించారు,అర్హులైన ప్రతి లబ్దిదారుడుకి ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు,ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మోరంపల్లిబంజర్ సంతలో నిబంధనలు గాలికి..

● సామర్థ్యాన్ని మించి పశువుల రవాణా
● అధిక ధరలు వసూళ్లు
● పట్టించుకోని అధికారులు



**బూర్గంపహాడ్, జూన్ 26 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం లో అతిపెద్ద సంతగా పేరున్న మోరంపల్లి బంజర్ సంతలో నిర్వాహకులు నిబంధనలు గాలికి వదిలేసారు. వారంలో బుధ, గురు, శుక్రవారాల్లో జరిగే పశువులు, కూరగాయల విక్రయాల్లో నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బాహాటంగా వినవస్తున్నాయి. సంత నిర్వాహకులు నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ మొత్తంలో వ్యాపారుల నుంచి వసూలు చేయడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చిరువ్యాపారులు తమకు కేటాయించిన స్థలాలకు నిర్ణయించిన ధర కాకుండా అధికంగా ధర వసూలు చేస్తున్నారని దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారం చేసినా తమకు రాని ఆదాయం ఈ అధిక వసూళ్లతో నష్టపోతున్నామని వాపోతున్నారు. ధర వసూలు చేసినా తిరిగి రశీదులు కూడా ఇవ్వడంలేదని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారంలో మూడు రోజులు నడిచే ఈ సంతలో అధిక ధరలు వసూలు చేయడంతో పాటు పశువుల విక్రయాల్లో నిబంధనలను నిర్వాహకులు పట్టించుకోకుండా 13 శాల్తీలే లోడు చేయాల్సి ఉండగా అంతకంటే ఎక్కువ మొత్తంలో పశువులను వాహనాల్లో తరలించి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సంత నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరుపై పంచాయతీ అధికారులు సైతం నోరుమెదపకపోవడంతో సంతకు వచ్చే ప్రజలు, చిరువ్యాపారులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్ణయించిన ధర కంటే అధికంగా వసూళ్లు చేస్తున్న సంత నిర్వాహకులపై తగినచర్యలు తీసుకోవాలని ప్రజలు, చిరువ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

## ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాల్లో పూర్తి వివరాలు నమోదు చేయాలి

● పలు గ్రామాల్లో సర్వేను పరిశీలించిన ఐటీడీఏ పీవో రాహుల్



**బూర్గంపహాడ్, జూన్ 26 (జనంసాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా బీఎల్ వోలు, సూపర్వైజర్లు ఓటర్ల ఇంటికి వెళ్లిన సమయంలో ప్రతి ఓటరుకు అందజేసిన ఎన్యుమరేషన్ ఫారాల్లో పూర్తి వివరాలు నమోదు చేసి తిరిగి వారికి అందజేయాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఓటర్లకు సూచించారు. శుక్రవారం బూర్గంపహాడ్ మండల కేంద్రంలో పిఎస్ 233 బి ఎల్ ఓ పద్మ నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించారు. మండల పరిధిలోని సారపాకతో, ఇరవెండి, మోతే పట్టీనగర్ గ్రామాల్లో పర్యటించి సర్ ప్రక్రియను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. ఓటర్ల ఇంటికి వెళ్లి సర్ ప్రక్రియకు సంబంధించి అవగాహన కల్పించారు. సర్ ప్రక్రియ అంటే కేవలం ఓటర్ల జాబితా సవరణ మాత్రమే అని, అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించడానికి, జాబితాలో తప్పులు సరిదిద్దడం దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బీఎల్వే, సూపర్వైజర్లు అందించిన ఎన్యుమరేషన్ ఫారాలు తీసుకుని కుటుంబంలో అర్హులైన ప్రతిఒక్కరి పూర్తి వివరాలు ఫారంలో నమోదు చేసి తిరిగి బీఎల్వోలకు అందించే సమయంలో రశీదు తీసుకోవాలన్నారు. సర్వే ద్వారా మరణించిన వారి పేర్లు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న డూప్లికేట్ ఓట్లను తొలగిస్తారన్నారు. ఇంటింటి సర్వేలో బూత్ స్థాయి అధికారులు నేరుగా ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బూర్గంపహాడ్ డిప్యూటీ తహశీల్దార్ సమ్మయ్య, బీఎల్ఓ పద్మ, దీపిక, శ్రీలక్ష్మి, మేరి, చందు తదితరులు ఉన్నారు.

## శాలిబండ కాలనీలో జోరుగా పందుల పెంపకం

● ప్రజలు ఆందోళన
● పట్టించుకోని అధికార యంత్రాంగం
● శాలిబండ కాలనీలో పందుల షెడ్లు ఏర్పాటు
● అధికారులు వెంటనే పందుల నివారణకు చర్యలు చేపట్టాలి



**దేవరకొండ, జూన్ 26 (జనం సాక్షి) :** దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు శాలిబండ కాలనీలో పందుల పెంపకం అధికంగా జరుగుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని వీధుల్లో పందులు స్వేచ్ఛగా సంచరిస్తూ చెత్తను చెల్లాచెదురు చేయడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీంతో దుర్వాసన వ్యాపించడంతో పాటు అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు రోడ్లపై నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారని, పందుల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పందుల పెంపకాన్ని నియంత్రించి, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు పేర్కొన్నారు. శాలిబండ కాలనీలో పందుల సంచారాన్ని అరికట్టి, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

# ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ రాజీపడదు

● ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనది ఓటు హక్కు
● ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 26 (జనం సాక్షి) :** ఓటు హక్కు పరిరక్షణకై కాంగ్రెస్ పార్టీ రాజీ పడదని ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనది ఓటు హక్కు అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై భువనగిరి పట్టణ బి ఎల్ ఏ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జూన్ 25 నుంచి జూలై 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జూలై 30న విడుదల కానున్న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా దృష్ట్యా ప్రతి బూత్ పరిధిలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలు సేకరిస్తున్న నేపథ్యంలో, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా బి ఎల్ ఎ లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కొత్తగా అర్హత పొందిన ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో పేరు లేకపోవడం, వివరాల్లో తప్పులు, ఇతర లోపాలు కనిపించిన వెంటనే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సకాలంలో సరిచేయించాలని అన్నారు. ప్రతి బూత్‌లో కాంగ్రెస్ నాయకులు, బూత్ కమిటీలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో ఓటర్ల జాబితాపై తలెత్తిన వివాదాల తరహా పరిస్థితులు తెలంగాణలో పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి బూత్‌లో కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అండగా నిలవాలని, ప్రజల ఓటు హక్కు పరిరక్షణ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. ప్రతి అర్హుడి ఓటును కాపాడేందుకు క్షేత్రస్థాయిలో నిరంతరం పోరాటం కొనసాగిస్తామని అన్నారు.






### ఫోక్స్‌వ్యాగన్‌లో లక్ష మంది ఉద్యోగులకు


# ఉద్వాసన?

**న్యూఢిల్లీ:**జర్మనీ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ భారీ మార్పులకు సిద్ధమవుతోంది. భారీ సంఖ్యలో ఉద్యోగులను ఇంటికి పంపించడంతో పాటు, నాలుగు ప్లాంట్లను సైతం మూసివేయాలని కంపెనీ సీఈవో ఒలివర్ బ్లూమ్ ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ మేరకు మేనేజర్ మ్యాగజైన్ ఓ కథనం ప్రచురించింది. ఈ ప్రణాళికలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు లక్ష ఉద్యోగాలను తొలగించాలని కంపెనీ చూస్తోంది. అంటే మొత్తం ఉద్యోగుల్లో ఇది దాదాపు 15 శాతానికి సమానం. ప్రస్తుతం ఫోక్స్ వ్యాగన్ గ్రూప్‌లో దాదాపు 6.67 లక్షల మంది పనిచేస్తున్నారు. ఒక్క జర్మనీలోనే 43 శాతం మంది పనిచేస్తున్నారు.ఒలివ్ బ్లూమ్ '2030 గ్రూప్ టార్గెట్ పిక్చర్' ప్రణాళికలో ఈ ఉద్యోగ కోతలు భాగమని సదరు మ్యాగజైన్ పేర్కొంది. ఇటీవల ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌లో ఈ ప్రతిపాదనలు ఉంచగా.. వచ్చే నెల జరిగే సూపర్‌వైజరీ బోర్డులోనూ ఈ ప్రతిపాదనలపై చర్చించనున్నారు. భారీగా ఉద్యోగ కోతలతో పాటు జర్మనీలోని హానోవర్, జ్వికావ్, ఎమ్డెన్, ఆడికి చెందిన నెక్కార్సుల్మ్ ప్లాంట్లలో ఉత్పత్తిని నిలిపివేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. రాబోయే ఐదేళ్లలో పెట్టుబడుల ప్రణాళికలను సైతం 15 శాతం కుదించాలన్నది సీఈవో ప్రణాళిక.ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అయ్యే భారీ ఖర్చులు, చైనా నుంచి ఎదురవుతున్న తీవ్రమైన పోటీ, అంతర్జాతీయ టారిఫ్‌ల ఒత్తిళ్లను తట్టుకోవడానికి ఈ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ ప్రతిపాదనలపై స్పందించిన ఫోక్స్‌వ్యాగన్ వర్క్స్ కౌన్సిల్, జర్మనీకి చెందిన ఐజీ మెటల్ యూనియన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశాయి. యాజమాన్యం ఇలాంటి చర్యలకు పాల్పడితే తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించాయి. కాగా, ఫోక్స్‌వ్యాగన్ 50 వేల మందిని తొలగించాలని ప్రస్తుతం ప్రణాళికగా పెట్టుకుంది. దశాబ్దం పాటు ఏ ఒక్క ప్లాంటూ మూసివేయబోమంటూ 2024 కార్మిక సంఘాలతో ఒప్పందం చేసుకుంది. తాజా ప్రణాళిక అందుకు పూర్తి విరుద్ధంగా ఉండడంతో కార్మిక సంఘాల నుంచి భారీ స్థాయిలో వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. ఫోక్స్‌వ్యాగన్ సంస్థ ఫోక్స్‌వ్యాగన్, ఆడి, పోర్షే, లాంబోర్గిని, బెంట్లీ వంటి పాసింజర్ వాహనాలతో పాటు, స్కానియా, డుకాటీ వంటి కమర్షియల్, టూవీలర్ ఆటోమొబైల్ బ్రాండ్లను నిర్వహిస్తోంది.



# ఆసియా మార్కెట్లలో బ్లడ్‌బాత్

### సూచీలు భారీగా పతనం



ఆసియా స్టాక్ మార్కెట్లు నేడు భారీగా కుప్పకూలాయి. అమెరికా మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో భారీగా పతనమయ్యాయి. దక్షిణ కొరియా బెంచ్ మార్కెట్ ఇండెక్స్ కోస్పీ ఏకంగా 8 శాతం మేర పతనం కాగా.. జపాన్‌కు చెందిన నిక్కీ 5 శాతం మేర క్షీణించింది. టెక్ స్టాక్స్‌లో అమ్మకాలు ఈ పతనానికి కారణమయ్యాయి. నేడు మన మార్కెట్‌లకు సెలవు కావడం గమనార్హం.

**న్యూఢిల్లీ:**ఆసియా స్టాక్ మార్కెట్లు నేడు భారీగా కుప్పకూలాయి. అమెరికా మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో భారీగా పతనమయ్యాయి. దక్షిణ కొరియా బెంచ్ మార్కెట్ ఇండెక్స్ కోస్పీ ఏకంగా 8 శాతం మేర పతనం కాగా.. జపాన్‌కు చెందిన నిక్కీ 5 శాతం మేర క్షీణించింది. టెక్ స్టాక్స్‌లో అమ్మకాలు ఈ పతనానికి కారణమయ్యాయి. నేడు మన మార్కెట్‌లకు సెలవు కావడం గమనార్హం. గిఫ్ట్ నిఫ్టీ మాత్రం శుక్రవారం ఉదయం 100 పాయింట్ల మేర క్షీణించింది.శుక్రవారం నాటి ట్రేడింగ్ సెషనల్‌లో కోస్పీ దాదాపు 8.2 శాతం మేర పతనమైంది. దీంతో ట్రేడింగ్‌ను 20 నిమిషాల పాటు నిలిపివేశారు. అటు జపాన్ నిక్కీ సైతం 5 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2.4 శాతం, చైనా బ్లూచిప్ సీఎస్ఐ300 ఇండెక్స్ 2.9 శాతం, షాంఘై కాంపోజిట్ సైతం 2 శాతం మేర క్షీణించాయి. జూన్ 23న కూడా ఇదే తరహాలో ఆసియా మార్కెట్‌లో అమ్మకాలు కనిపించాయి. నేడు మళ్లీ అదే స్థాయిలో మార్కెట్లు పడిపోయాయి.

**కారణమిదే:**మెమొరీ, స్టోరేజీ చిప్‌ల ధరల కారణంగా యాపిల్ తన ఐప్యాడ్, మ్యాక్‌బుక్ ధరలను భారీగా పెంచిన సంగతి తెలిసిందే. దీంతో ఏఐ మౌలిక వసతుల కల్పనపై చేస్తున్న ఖర్చు, పెరుగుతున్న సెమీ కండక్టర్ల ధరలు బిగ్ టెక్ కంపెనీలనూ వదలడం లేదన్న సంకేతాలను పంపింది. దీంతో యాపిల్ షేరు విలువ నిన్న ఒక్కరోజే 6.1 శాతం మేర క్షీణించింది. 25 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ ఆవిరైంది. ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, అల్ఫాబెట్ షేర్లు కూడా పతనమయ్యాయి. ఈ ఉదంతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాల కోసం భారీగా అప్పులు చేసి పెడుతున్న పెట్టుబడులు దీర్ఘకాలంలో స్థిరంగా కొనసాగుతాయా లేదా అనే అనుమానాలను ఇన్వెస్టర్లలో నెలకొల్పింది. ఏఐ పెట్టుబడులపై ఆలోచనలో పడేసింది. ఈ క్రమంలోనే చైనాకు చెందిన సీఎస్ఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇండెక్స్ 5 శాతం, సీఎస్ఐ 5జీ కమ్యూనికేషన్ ఇండెక్స్ 6.3 శాతం, హాంగ్ సెంగ్ టెక్ ఇండెక్స్ 3.3 శాతం చొప్పున క్షీణించాయి.

### ఏఐ డేటా సెంటర్ ఇంజినీరింగ్ సేవల్లోకి

# స్టాండర్డ్ ఇంజినీరింగ్



హైదరాబాద్: ఏఐ (కృత్రిమ మేధ) డేటా సెంటర్ ఇంజినీరింగ్ మౌలిక వసతుల సేవల్లోకి ప్రవేశిస్తున్నట్లు స్టాండర్డ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్ఈటీఎల్) ప్రకటించింది. ఇందుకోసం జిస్కేల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌లో 51% వాటా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ఈ లావాదేవీ కోసం రూ.125 కోట్లు నగదు, మరో రూ.65 కోట్లను షేర్ స్వాప్ పద్ధతిలో (మొత్తం రూ.190 కోట్లు) తొలి విడతలో చెల్లిస్తారు. నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, స్వతంత్ర డైరెక్టర్ గొల్లపూడి సాంబశివరావు నేతృత్వంలో గురువారం ఇక్కడ జరిగిన ఎస్ఈటీఎల్ బోర్డు సమావేశం ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. 2028 మార్చికల్లా జిస్కేల్‌లో మొత్తం రూ.500 కోట్ల వరకు ఎస్ఈటీఎల్ పెట్టుబడి పెడుతుంది. ఎస్ఈటీఎల్, గత ఆర్థిక సంవత్సరంలో రూ.793 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 40-50% వృద్ధి సాధిస్తుందనే అంచనాను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందుల నాగేశ్వరరావు వ్యక్తం చేశారు. జిస్కేల్‌లో మెజారిటీ వాటా ద్వారా సంక్లిష్టమైన ఏఐ డేటా సెంటర్ ఇంజినీరింగ్ సేవల్లోకి నేరుగా ప్రవేశిస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే డేటా సెంటర్ విభాగం నుంచి రూ.250 కోట్ల ఆదాయం లభించగలదని పేర్కొన్నారు.

**ఇదీ ప్రయోజనం:**డేటా సెంటర్ల రంగంలో 25 ఏళ్ల అనుభవం కలిగి, టైర్ 4 డేటా సెంటర్ల నిర్మాణానికి అనుమతులు పొందిన కాసు బ్రహ్మారెడ్డి నేతృత్వంలోని జిస్కేల్‌కు 3 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో తయారీ ప్లాంట్ ఉండగా, మరో 7 లక్షల చ.అ. మేర నిర్మించనుంది. డేటా సెంటర్లకు అవసరమైన 14 రకాల పరికరాలు తయారు చేయాలన్నది సంస్థ ప్రణాళిక. ఔషధ, రసాయనాల ఉత్పత్తి పరిశ్రమలకు అవసరమైన 170 రకాల ఇంజినీరింగ్ పరికరాలను తయారు చేయడంతో పాటు ప్రెసిషన్, మల్టీడిసిప్లినరీ ఇంజినీరింగ్, టర్న్‌కీ సొల్యూషన్లు అందించే సంస్థగా ఎస్ఈటీఎల్ ఉంది. ఈ సంస్థకు 12 లక్షల చ.అ. విస్తీర్ణంలో తయారీ ప్లాంట్లు ఉన్నాయి. ఈ రెండు సంస్థల నైపుణ్యాలు, సామర్థ్యం కలిస్తే.. గిగా స్కేల్ డేటా సెంటర్ల కాన్సెప్ట్ నుంచి డిజైన్, తయారీ, నిర్మాణం, కమిషనింగ్ వరకు.. విద్యుత్తు, శీతోష్ణస్థితి వసతులు, ప్రెసిషన్ ఫ్యాబ్రికేషన్, ఆటోమేషన్ వంటి పూర్తిస్థాయి సేవలు అందించగలుగుతామని నాగేశ్వరరావు చెప్పారు. బ్రహ్మారెడ్డి నేతృత్వంలోనే జిస్కేల్ కార్యకలాపాలు సాగిస్తుంది.

**గిగా స్కేల్ డేటా సెంటర్‌కు రూ.50,000 కోట్లు**

గిగా స్కేల్ డేటా సెంటర్‌కు రూ.50,000 కోట్లు వరకు అవుతుందని.. ఇందుకు పెట్టుబడులు పెట్టేవారున్నా, అవసరమైన పరికరాలు, వ్యవస్థలను వేర్వేరు దేశాల నుంచి సమీకరించాల్సి వస్తోందని బ్రహ్మారెడ్డి తెలిపారు. వీటి తయారీకి పెట్టుబడులు పెట్టేందుకు పీఈ సంస్థలు ముందుకొచ్చినా, జపాన్ సంస్థ ఏజీఐ జపాన్ సాంకేతిక నైపుణ్యంతో, అత్యంత కచ్చితత్వంతో ఔషధ-రసాయన రంగాలకు పరికరాలు తయారు చేసి, ఇంటిగ్రేషన్ చేస్తున్న ఎస్ఈటీఎల్‌ను ఎంచుకున్నట్లు బ్రహ్మారెడ్డి తెలిపారు. వీటిల్లో కొన్ని వ్యవస్థలు డేటా సెంటర్ల నిర్మాణానికి ఉపయోగపడతాయి కనుక, ఈ ఆర్థిక సంవత్సరంలోనే అధిక ఆదాయం సాధించగలమన్నారు. మనదేశంలో ప్రస్తుతం 1.6 గిగావాట్ల డేటా సెంటర్లు ఉన్నాయని 2030 కల్లా మరో 10 గిగావాట్ డేటాసెంటర్లు నిర్మించనున్నారని.. ఈ రంగంలో తమ తయారీ-నైపుణ్య సామర్థ్యాలకు రూ.3.25 లక్షల కోట్ల విపణి ఉందని వెల్లడించారు. కార్యకలాపాలు విస్తరించే కొద్దీ మరో 500 మంది ఇంజినీరింగ్ నిపుణులను నియమించుకుంటామని నాగేశ్వరరావు, బ్రహ్మారెడ్డి తెలిపారు.

# పెయిడ్ సర్వీస్‌గా వాట్సప్ ప్లస్

**న్యూఢిల్లీ:**వాట్సప్ వినియోగదారుల కోసం మెటా సంస్థ 'వాట్సప్ ప్లస్' పేరిట పెయిడ్ సర్వీసెస్‌ను అందుబాటులోకి తెచ్చింది. నెలకు రూ.79తో ఈ సేవలు పొందొచ్చు. మొదటి నెల రోజులు ఉచితంగా ట్రై చేయొచ్చు కూడా. 'వాట్సప్ ప్లస్' కోసం ఇప్పటికే ఉన్న యాప్ సెటింగ్స్‌లోకి వెళ్లి సబ్‌స్క్రిప్షన్స్ విభాగాన్ని ఎంపిక చేసుకోవాలి. అక్కడ 'వాట్సప్ ప్లస్' కనిపిస్తుంది. అప్‌గ్రేడ్ యువర్ మెసేజింగ్ ఎక్స్‌పీరియన్స్‌పై క్లిక్ చేస్తే తొలుత నెల రోజుల పాటు ఫ్రీ ట్రయల్.. ఆ తర్వాత పెయిడ్ సర్వీసెస్ పొందొచ్చు.



అదన పు ప్రయోజనాలివే..: ప్రస్తుతం వాట్సప్‌లో 3 చాట్‌ల వరకే పిన్ చేసుకునే అవకాశముంది. వాట్సప్ ప్లస్‌లో 20 చాట్‌ల వరకూ పిన్ చేసుకోవచ్చు. వేల మెసేజ్‌లు వచ్చినా సరే.. మనకు కావాల్సిన ముఖ్యమైన 20 చాట్స్ స్క్రీన్‌పై టాప్‌లో కనిపిస్తాయి.హోమ్ స్క్రీన్‌పై ఉండే వాట్సప్ లోగో గ్రీన్ కలర్‌కు బదులుగా నచ్చిన రంగులోకి మార్చుకోవచ్చు.చాట్ లోపల ఉండే టెక్స్ట్ బబుల్స్, మెసేజ్ టిక్స్, బ్యాక్‌గ్రౌండ్ వాల్‌పేపర్స్ అన్నీ మనం ఎంపిక చేసుకునే థీమ్ రంగులోకి మారిపోతాయి. రాయల్ పర్పుల్, వెల్వెట్ రెడ్, సైబర్ పంక్ బ్లూ లాంటి ప్రీమియం కలర్స్ దీనిలో అందుబాటులో ఉంటాయి.చాట్ లిస్ట్‌ను అప్‌గ్రేడ్, కస్టమ్ లిస్ట్ క్రియేట్ చేసుకోవడం, కావాల్సిన థీమ్, రింగ్‌టోన్, నోటిఫికేషన్ టోన్ సెట్ చేసుకోవచ్చు. యానిమేషన్‌తో కూడిన ప్రత్యేక స్టిక్కర్లు పంపించొచ్చు. సేవలు వద్దనుకునే వారు.. ఎప్పుడైనా సబ్‌స్క్రిప్షన్ రద్దు చేసుకోవచ్చు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

## వెనెజువెలా జంట భూకంపాలతో భారత్‌లో పెట్రో ధరలు

# మళ్లీ పెరిగేనా?



**శతాబ్ద కాలంలో కనీవినీ ఎరుగని ప్రకృతి విపత్తుతో వెనెజువెలా దేశం అల్లకల్లోలంగా మారింది. వెనువెంటనే రెండు భారీ భూకంపాలు విరుచుకు పడటంతో ఎటు చూసినా ధ్వంసమైన భవంతులు.. శిథిలాల దిబ్బలే కన్పిస్తున్నాయి. దీంతో అక్కడ జనజీవనం అస్తవ్యస్తమైంది. కాగా.. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఉత్పత్తి దేశాల్లో ఒకటైన వెనెజువెలాలో సంభవించిన ఈ విలయంతో ఇప్పుడు చమురు సరఫరాపై ఆందోళనలు నెలకొన్నాయి. ముఖ్యంగా దిగుమతులపై అత్యధికంగా ఆధారపడే భారత్ లాంటి దేశాలపై ఈ ప్రభావం ఎలా ఉండనుంది..? దీని వల్ల మన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయా? తెలుసుకుందాం..!**

**న్యూఢిల్లీ:**రాజధాని కారకస్ సహా వెనెజువెలా వ్యాప్తంగా పలు నగరాలను ఈ భారీ భూకంపాలు వణికించాయి. అయితే, ఇప్పటివరకు చమురు మౌలిక సదుపాయాల పరిస్థితిపై స్పష్టత లేదు. రిఫైనరీలు, ఎక్స్‌పోర్ట్ టెర్మినళ్లు, పైప్‌లైన్లకు ఎంత మేర నష్టం వాటిల్లిందనే దానిపై అధికారిక సమాచారం ఏదీ రాలేదు. భూకంపం కారణంగా చమురు క్షేత్రాలు దెబ్బతినలేదని కొన్ని అంతర్జాతీయ పత్రికలు పేర్కొన్నాయి. చమురు ఉత్పత్తికి ఇప్పటివరకు అంతరాయం కలగలేదని తెలిపాయి. అయితే, విపత్తు కారణంగా విద్యుత్‌కు అంతరాయం కలగడం, రవాణా వ్యవస్థ దెబ్బతినడం వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

**లోతు తక్కువ.. ముప్పు ఎక్కువ!**

వెనెజువెలాకు ప్రధాన కార్గో గేట్‌వే అయినా 'లా గువేరా' నగరం తీవ్రంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ ప్రాంతాన్ని డిజాస్టర్ జోన్‌గా ప్రకటించారు. దీంతో అక్కడి నుంచి చమురు సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చమురు లోడింగ్ ఆలస్యం, రవాణాకు ప్రత్యామ్నాయ మార్గాలను వెతకడం వంటివి ట్రేడర్లు, రిఫైనర్లు, బీమా సంస్థలపై ప్రభావం చూపించే అవకాశం ఉంది.

**పశ్చిమాసియా యుద్ధంతో..**

ఇటీవల పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు దిగుమతుల కోసం భారత్ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగానే వెనెజువెలా నుంచి చమురు కొనుగోళ్లను భారీగా పెంచింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ దేశం నుంచి సగటు నెలవారీ దిగుమతులు 64వేల మెట్రిక్ టన్నులుగా ఉండగా.. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే మధ్యలో ఈ మొత్తం 10లక్షల మెట్రిక్ టన్నులకు పెరగడం గమనార్హం. ఇక, ఆ దేశ చమురు రంగంలోనూ భారత్ ప్రత్యక్షంగా పెట్టుబడులు పెట్టింది.

**ఇంధన ధరలు పెరుగుతాయా?**

అయితే, వెనెజువెలా పరిణామాలతో భారత్‌లో తక్షణమే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం లేదని మార్కెట్ రంగ నిపుణులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో హర్మూజ్ జలసంధి మీదుగా చమురు రవాణా పెరిగింది. అంతర్జాతీయంగానూ ముడిచమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో పాటు గత కొన్నేళ్లుగా చమురు దిగుమతుల కోసం భారత్ ప్రత్యామ్నాయ వనరులను ఎంచుకోవడంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగానే దాదాపు 35కు పైగా దేశాల నుంచి ఈ దిగుమతులు చేసుకుంటోంది. అందువల్ల, వెనెజువెలా నుంచి తాత్కాలికంగా ఎగుమతులు నెమ్మదించినా.. భారత్‌కు ప్రత్యామ్నాయ సోర్సులు అందుబాటులోనే ఉన్నాయని ఎనర్జీ నిపుణులు పేర్కొంటున్నారు.కాగా.. భూకంపాలు సంభవించిన అనంతరం చమురు క్షేత్రాల పరిస్థితిని క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి ఉంటుంది. భూగర్భ పైప్‌లైన్ వ్యవస్థలు, ఇతర మౌలిక సదుపాయాలు ఎంతమేర దెబ్బతిన్నాయో తెలియాలంటే కొన్ని వారాల సమయం పడుతుంది. అందువల్ల పరిస్థితిని ఇప్పుడే అంచనా వేయలేమని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# వెనెజువెలా కోసం భారత్.. 'ఆపరేషన్ అమిస్టాడ్'!

**న్యూఢిల్లీ:**భూకంపంతో అతలాకుతలమైన వెనెజువెలాకు ఆయా దేశాలు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా లాటిన్ అమెరికా దేశానికి ఆపన్న హస్తం అందించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం 'ఆపరేషన్ అమిస్టాడ్' కొనసాగుతోందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడించారు. ఇందులో భాగంగా సహాయక చర్యలకు అవసరమైన సామగ్రితో భారత సైన్యానికి చెందిన రెండు సీ17 విమానాలు బయలుదేరినట్లు చెప్పారు.భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్, అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించే సామర్థ్యమున్న రెండు మొబైల్ ఆసుపత్రి టెంట్లు సహా 35 టన్నులకు పైగా సహాయక సామగ్రి, ఔషధాలు, వైద్య పరికరాలు పంపించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. క్లిష్ట సమయంలో వెనెజువెలా ప్రభుత్వానికి, అక్కడి పౌరులకు అవసరమైన సాయం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అమిస్టాడ్ అంటే స్పానిష్ భాషలో స్నేహం అని అర్థం.వరుస భూకంపాల ధాటికి వెనెజువెలాలో భారీ భవనాలు నేలమట్టమయ్యాయి. శిథిలాల్లో చిక్కుకున్న వారిని సాధ్యమైనంత త్వరగా బయటకు తీసేందుకు భారీ నిర్మాణ పరికరాలు అవసరమని, వీటిని అందుబాటులో ఉంచాలని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ అక్కడి వ్యాపార సంస్థలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు, అమెరికా, చిలీ, స్విట్జర్లాండ్, తుర్కియే నుంచి సహాయక బృందాలు ఇప్పటికే వెనెజువెలా చేరుకొని రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఖతార్, బ్రెజిల్, స్పెయిన్, పోర్చుగల్, కెనడా దేశాధినేతలు కూడా తమ బృందాలను పంపిస్తామని ప్రకటించారు.



# 3 చైనా ఉత్పత్తులపై యాంటీ డంపింగ్ విచారణ

దిల్లీ: దేశీయ తయారీదార్ల ఫిర్యాదుల నేపథ్యంలో, చైనా నుంచి దిగుమతి అయ్యే మూడు ఉత్పత్తుల (థర్మల్ పేపర్, బైయాక్సియల్లీ ఓరియెంటెడ్ పాలీ అమైడ్ (బీఓపీఏ) ఫిల్మ్, కొన్ని యాంటీ యాక్సిడెంట్ల)పై యాంటీ-డంపింగ్ విచారణ ప్రారంభించినట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ దర్యాప్తులో కొరియా, సింగపూర్, అమెరికా, థాయిలాండ్ దేశాలు కూడా ఉన్నాయి. దేశీయ తయారీ రంగానికి ఇబ్బంది కలిగిస్తున్న ఈ చౌక ఉత్పత్తుల దిగుమతులపై దేశీయ సంస్థలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్' (డీజీటీఆర్)కు 4 దరఖాస్తులు అందించాయి.పాలిమర్ పరిశ్రమలో ఉపయోగించే కొన్ని యాంటీఆక్సిడెంట్లు చైనా, కొరియా, సింగపూర్ నుంచి దిగుమతి అవుతుండటంపై విచారణ జరపాలని వినతి ఆర్గానిక్స్ కోరింది.ప్యాకేజింగ్ పరిశ్రమలో ఉపయోగించే బయాక్సియల్లీ ఓరియెంటెడ్ పాలిమైడ్ (బీఓపీఏ) ఫిల్మ్ దిగుమతులు చైనా, థాయిలాండ్ నుంచి భారీగా వస్తుండటంపై విచారణ జరపాలని జేపీఎఫ్ఎల్ ఫిల్మ్స్ కోరింది. అమెరికా, చైనా, దక్షిణ కొరియా నుంచి వస్తున్న థర్మల్ పేపర్ లేదా థర్మల్ సెన్సిటివ్ పేపర్ దిగుమతులపై ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ థర్మల్ పేపర్ మానుఫ్యాక్చరర్స్ అండ్ అలైడ్ ఇండస్ట్రీస్ ఫిర్యాదు చేసింది.డెకార్ పేపర్‌పై విధించిన యాంటీ-డంపింగ్ సుంకాన్ని సన్‌సెట్ రివ్యూ చేయాలని ఐటీసీ లిమిటెడ్ కోరింది.

## 'సిందూర్'లో అమరులైంది వీరే..

వీరి పేర్లను దేశ రాజధాని దిల్లీలోని ఇండియా గేట్ సర్కిల్‌లో ఉన్న జాతీయ యుద్ధ స్మారకం వద్ద ప్రత్యేక శిలాఫలకంపై శాశ్వతంగా చెక్కనున్నారు. ఆ అమరుల వివరాలు ఇలా..వైమానిక దళంలోకి 'నేత్ర',సుబేదార్ మేజర్ పవన్ కుమార్ - 10 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్,రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ - జమ్మూకశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ రెజిమెంట్‌కు చెందిన 4వ బెటాలియన్,లాన్స్ నాయక్ దినేశ్ కుమార్ - 5 ఫీల్డ్ రెజిమెంట్,హవల్దార్ సునీల్ కుమార్ సింగ్ - 237 ఫీల్డ్ వర్క్‌షాప్,సార్జెంట్ సురేంద్ర కుమార్ - ఎయిర్‌ఫోర్స్ 39వ వింగ్,అగ్నివీర్ మురళీ నాయక్ - 851 లైట్ రెజిమెంట్,వీరిలో రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్‌ను కేంద్రం మరణానంతరం మూడో అత్యున్నత యుద్ధ పురస్కారమైన 'వీర చక్ర'తో సత్కరించింది. ఇక, సార్జెంట్ సురేంద్ర కుమార్‌ను 'వాయు మెడల్'తో గౌరవించింది. ఇక, వీరిలో మురళీ నాయక్ తెలుగు వ్యక్తి అన్న సంగతి తెలిసిందే. శ్రీసత్యసాయి జిల్లా కళ్లితండాకు చెందిన మురళీ.. 2022లో అగ్నివీర్‌గా ఎంపికై తొలుత పంజాబ్, అస్సాంల్లో పనిచేశారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో జమ్మూకశ్మీర్ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ పాక్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో అమరుడయ్యారు. 2025 ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

# మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

జాబితాలో ఇబ్రహీం పెద్ద చెరువు, భగీరథమ్మ చెరువు, కాముని చెరువు, కాప్రా చెరువులు ఉన్నాయి. మొత్తం 311 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ నాలుగు చెరువులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. వీటిని కేవలం జలాశయాలుగానే కాకుండా, స్థానికులకు ఆహ్లాదాన్ని పంచే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా మార్చనున్నారు. ఇందులో భాగంగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలను ఏర్పాటు చేయనున్నారు.ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ సహకారంతో త్వరలోనే బోటింగ్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

### 'సెక్షన్ 301' దర్యాప్తు పూర్తయితే..

# మళ్లీ పాత స్థాయిలో అమెరికా టారిఫ్‌లు

**వాషింగ్టన్:**సుంకాలపై అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం సెక్షన్ 301పై చేస్తున్న దర్యాప్తు పూర్తయితే.. తిరిగి పాత స్థాయిలో ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సెక్షన్ 122 కింద విధించిన 10 శాతం టారిఫ్‌లు జులై 24 వరకు ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉండనున్నాయి. వెట్టిచాకిరి నిర్మూలనలో విఫలమైనందుకు గానూ భారత్ సహా 50కి పైగా దేశాల దిగుమతులపై అదనంగా 12.5 శాతం సుంకం విధించాలని అమెరికా వాణిజ్య కార్యాలయం తన మధ్యంతర నివేదికలో ప్రతిపాదించింది.వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ దేశాలపై పరస్పర సుంకాలు ఉపయోగించారని స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. సెక్షన్ 301 ప్రక్రియ కూడా అదే విధమైన లక్ష్యాన్ని సాధించడానికి చేపట్టినట్లు తెలిపారు. భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరో వైపు లండన్‌లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఇతర దేశాలపై ప్రయోజనాలను పొందినప్పుడే భారత్ ఒప్పందం విషయంలో ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు.



**ఏమిటీ సెక్షన్ 301**

ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉన్న శక్తిమంతమైన ఆయుధమే ఈ సెక్షన్ 301. తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు (ఁతీజీటవ ఖనీశ్రీతిఇతివబ).. అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనేదానిపై ఈ చట్టం కింద అమెరికా దర్యాప్తు చేసేందుకు వీలు లభిస్తుంది. ఒకసారి దర్యాప్తు ప్రారంభించిన తర్వాత.. అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే.. ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది.

# తాండూరు కవికి రాష్ట్రస్థాయి కవితా పోటీలో ప్రథమ బహుమతి



**తాండూరు, జూన్ 26(జనంసాక్షి)** తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్ర భారతిలో నిర్వహించిన "మనశ్శాంతి – జీవనకాంతి" రాష్ట్రస్థాయి కవితా పోటీల్లో వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన కవి, తెలుగు ఉపాధ్యాయులు జె. రామకృష్ణరాజు ప్రథమ బహుమతి సాధించారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలో రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు కవులు పాల్గొన్నారు. మానవీయ విలువలు, హైజీనిక్ ఆలోచనలతో "మనశ్శాంతి – జీవనకాంతి" అనే అంశంపై రామకృష్ణరాజు రచించిన కవిత న్యాయనిర్ణేతల మన్ననలు పొందింది. ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిద్ధారెడ్డి చేతుల మీదుగా విజేతకు నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ విజయంపై యాలాల మండల విద్యాశాఖాధికారి ముజాహిల్ రెడ్డి, తాండూరు కన్వీనర్ కోటం చంద్రశేఖర్, ద్వావరి నరేందర్ రెడ్డి, గాజుల పవన్ కుమార్, కవయిత్రి మొల్ల కళావేదిక కేవిఎం వెంకట్ తదితర సాహిత్యవేత్తలు, ఉపాధ్యాయులు, కవులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ రామకృష్ణరాజు సాహిత్య రంగంలో మరిన్ని విశిష్ట రచనలు అందించాలని ఆకాంక్షిస్తూ ఆయనను అభినందించారు.

# పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి.. లేకుంటే ఉద్యమం : టీఎస్‌యూటీఎఫ్



**కోరుట్ల, జూన్ 26 (జనంసాక్షి):** ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ హెచ్చరించారు. జగిత్యాలలో జిల్లా అధ్యక్షుడు తిరుకోవెల శ్యామ్‌సుందర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే కుదించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రతి గ్రామపంచాయతీలో ఒక ఆదర్శ పాఠశాలను అభివృద్ధి చేయాలని, నర్సరీ, కేజీ తరగతులను ప్రారంభించి ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, నోటుపుస్తకాలు, యూనిఫాంలను వెంటనే సరఫరా చేయాలని, పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేసి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల అసమతుల్యత, ప్రీ-ప్రైమరీ విద్య లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరించాలని, విద్యకు 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలందరికీ అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్, కోశాధికారి ఓజ్జ శ్రీనివాస్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ వేముల శ్రీనివాస్, జిల్లా ఆఫీస్ బేరర్లు పి.వి. ప్రసాద్, ఆగమయ్య, శ్రీధర్, గోపి, ఆడిట్ కమిటీ సభ్యులు సిరిపురం శ్రీనివాస్, కృష్ణ కుమార్, శ్యామకుర శ్రీనివాస్, ప్రభాకర్, చిరంజీవి, నాగన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాముపై మరో కేసు

**ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్నట్లు గుర్తింపు**

**రూ. 87.44 లక్షల అక్రమాస్తులు లభ్యం**

**భారీగా నగదు, ప్లాట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు**



**కరీంనగర్ బ్యూరో, జూన్ 26 (జనంసాక్షి)** : కరీంనగర్ అర్బన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గుండెటి రాము (42) పై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల కింద అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. గతంలో వేములవాడ ఎక్సైజ్ స్టేషన్ ఎస్ హెచ్‌ఓగా విధులు నిర్వహించిన ఆయన అధికార దుర్వినియోగానికి పాల్పడి అక్రమ మార్గాల్లో పెద్ద ఎత్తున ఆస్తులు కూడబెట్టారనే నమ్మదగిన సమాచారంతో ఈ నెల 24న ఏసీబీ అధికారులు ఈ కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాది మార్చి 17న నమోదైన కేసు ఆధారంగా జగిత్యాలలోని భవానీ నగర్‌లో ఉన్న ఆయన అద్దె ఇంట్లో అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిందితుడి ఎస్‌బీఐ ఖాతాలో రూ. 29,88,317 నగదు, ఆయన తండ్రి యూబీఐ ఖాతాలో రూ.16,77,978 బ్యాంక్ నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు ఇంట్లో రూ.20,67,850 చేతి నగదు, రూ. 11,97,000 విలువైన ఇతర సామాగ్రి లభించాయి. అలాగే కరీంనగర్ పట్టణంలో రూ. 6,05,000 విలువైన ఒక ఓపెన్ ప్లాట్, సిరిసిల్లలో రూ. 2,18,484 విలువైన కమర్షియల్ ల్యాండ్‌కు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 87,44,629 గా తేలినప్పటికీ, బహిరంగ మార్కెట్లో వీటి విలువ చాలా రెట్లు ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముందుగా వేములవాడ లో పనిచేసిన సమయంలో బెల్లం వ్యాపారుల నుండి లంచం తీసుకున్నాడని అవినీతి సొమ్మును తన స్నేహితుడైన మరో ప్రభుత్వ ఉద్యోగి అకౌంట్ల ద్వారా మళ్ళించుకున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అప్పటి కేసు విచారణలో భాగంగా దర్యాప్తు చేసిన ఏసీబీ అధికారులకు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గుండెటి రాము విధి నిర్వహణ సమయంలో తన పరిధి నుంచి అక్రమాలకు పాల్పడి ఆస్తులు కూడపెట్టినట్లు గుర్తించారు. బుధవారం నుండి తనిఖీలు చేసిన ఏసీబీ అధికారులు సుమారు కోటి రూపాయల విలువచేసే ఆస్తి పత్రాలతో పాటు నగదు, బ్యాంక్ అకౌంట్ లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

# డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు



**కరీంనగర్ రూరల్, (జనంసాక్షి) :** కరీంనగర్ రూరల్ పోలీసులు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి డాగ్ స్క్వాడ్ సహాయంతో విస్తృత గాలింపు, తనిఖీ చర్యలు చేపట్టారు. హుస్నేనిపుర రైల్వే స్టేషన్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ప్రతిమ మెడికల్ కాలేజీ పరిధిలోని దుకాణాలు, పాన్ షాపులు తదితర ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించినప్పటికీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గానీ, అనుమానాస్పద వస్తువులు గానీ గుర్తించలేదని కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ, పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో నిషేధిత వస్తువులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ప్రజలు కూడా నిషేధిత వస్తువుల విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ గాలింపు చర్యల్లో డాగ్ స్క్వాడ్ సిబ్బందితో పాటు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# మ్యాపింగ్ కానీ ఓటర్లకు మరో అవకాశం ఇవ్వాలి



**నర్సంపేట, జూన్ 26 (జనంసాక్షి) :** జిల్లాలో మ్యాపింగ్ కానీ ఓటర్లకు మరో అవకాశం కలిపించి రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. అలాగే ఆక్రమణకు గురవుతున్న నర్సంపేట గ్రీన్ ల్యాండ్స్ భూములను రక్షించి అభివృద్ధి పరచాలని కోరారు. ఎంసీపీఐ(యు) వరంగల్ జిల్లా ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ సత్య శారద కలిసి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటర్ల సవరణలో భాగంగా మ్యాపింగ్ కానీ సుమారు 20 శాతం ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా మరోసారి అవకాశం కలిపించి ఓటు హక్కును కాపాడుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ క్రమంలో ఎంసిపిఐ(యు) ప్రతినిధులను బూతు లెవెల్ ఏజెంట్లుగా నియమించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కుంటి సాకులతో అర్హులైన ఓటర్లను తొలగించకుండా సర్వే పారదర్శకంగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలోని నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో సుమారు 40 ప్రదేశాలలో ఉన్న గ్రీన్ ల్యాండ్ అంగ అర్థ అధికార బలం కలిగిన వ్యక్తులు ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన స్థానిక మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని దాంతో గ్రీన్ ల్యాండ్స్ అన్యాక్రాంతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని కాకతీయ కళాశాల పక్కనే ఉన్న 30 గుంటల గ్రీన్ ల్యాండ్ కొంతమంది సామాజిక బలం కలిగిన వ్యక్తులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకునే నాధుడే కరువయ్యాడని అలాగే వివిధ ప్రభుత్వం అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న మీడియా గగ్గోలు పెడుతున్న కనీస చర్యలు లేవన్నారు. కానీ పేదలు తలదాచుకోవడానికి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే మాత్రం కేసులు పెట్టి అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే నర్సంపేట గ్రీన్ ల్యాండ్స్ కు హద్దులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రకృతి వనాలు ఆట స్థలాలు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించాలని డిమాండ్ చేశారు లేకపోతే గ్రీన్ ల్యాండ్స్ ఇతర ప్రభుత్వ స్థలాల రక్షణకు పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కన్నం వెంకన్న. మంద రవి. జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్ .నగర కార్యదర్శి మాలోతు సాగర్ .జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుంచు జగదీశ్వర్ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలి

**ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**



**కామారెడ్డి ప్రతినిధిజూన్ 26 (జనంసాక్షి)**

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గారు శుక్రవారం జుమ్మా నమాజ్ అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రజాస్వామ్య పరిరక్షణలో అత్యంత కీలకమైనదని అన్నారు. ప్రతి ఓటరు తన ఓటు హక్కును కాపాడుకోవాలంటే ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని, ఓటరు జాబితాలో తమ వివరాలను నమోదు చేసుకోవడం లేదా ధృవీకరించుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు.

ఓటరు జాబితా పూర్తిగా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కు అని అన్నారు. తమ పేర్లు ఓటరు జాబితాలో సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ వెంటనే పరిశీలించాలని, ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిదిద్దించుకోవాలని, కొత్తగా అర్హత పొందిన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అవసరమైన పత్రాలను సమర్పించి నమోదు, సవరణ, ధృవీకరణ ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించడం రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, కార్యకర్తలందరి బాధ్యత అని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. గ్రామాలు, వార్డులు, కాలనీల స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, ఒక్క అర్హ ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలి. ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలి అని మహమ్మద్ అలీ షబ్బీర్ గారు ప్రజలకు పిలుపునిచ్చారు.



# ఊరంతా ఒక్కటై.. దుక్కి దున్ని.. విత్తనమేసారు

**హక్కుదారులకే భూములు సొంతం అంటున్న గ్రామస్తులు**

**లక్ష్మణ చందా, జూన్ 26 (జనంసాక్షి) :** మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల మధుకృష్ణ భూమిని తనకే చెందాలని గ్రామస్తులు ఒకటయ్యారు. వివరాలను పరిశీలిస్తే చిట్యాల మధు కృష్ణ, తండ్రి క్రి,,శే చిట్యాల అశోక్, రాచాపూర్ గ్రామం, లక్ష్మణ చందా మండలం, నిర్మల్ జిల్లా వాసి. వడ్యాల్ శివారులోని సర్వేనెంబర్ 1433 గల భూమిని రాచాపూర్ గ్రామం లో అతను వాళ్ళ నాన్న చిట్యాల అశోక్ గత 40 సంవత్సరాల కిందట సదా బైనమా కిందట మధ్యవర్తి దగ్గర కొనుగోలు చేసి ప్రస్తుతం ఆ భూమిని పట్టా చేయమని అడగగా వారు ఇది ఈ భూమికి మేమే హక్కుదారులమని వారు తెలిపి గత పది సంవత్సరాల నుండి చిట్యాల మధుకృష్ణని ఇబ్బందులకు గురి చేస్తే ఆ గ్రామస్తులంతా ఒక్కటై ట్రాక్టర్ల సహాయంతో దుక్కి దున్ని విత్తనమేశారు. అయితే వారు ఇలా చేస్తే ప్రతి ఒక్కరికి ఇబ్బందిగా ఉంటుందని చెప్పేసి ప్రతి హక్కుదారుడు హక్కు దారుడే కానీ ఇలా భూ హక్కు దారులను మభ్యపెట్టి ఇబ్బందులకు గురి చేస్తే తప్పదని ఆ గ్రామస్తులు కోరారు. వారు ఇలా చేస్తే వారితో ఇంకొకరు అలా మొదలవుతారు అని చెప్పేసి గ్రామస్తులు మొండిపడ్డారు.

# బీజేపీపై కడుపుమంటతోనే ఎస్ఐఆర్‌పై ఆరోపణలు




**యాదగిరి సునీల్‌రావు**

**కరీంనగర్ బ్యూరో, జూన్ 26 (జనంసాక్షి):** ఓటరు జాబితాను ప్రక్షాళన చేసి అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ (Special Intensive Revision) లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కరీంనగర్‌లోని ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బోగస్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు వంటి అక్రమాలను తొలగించేందుకే ఇంటింటి సర్వే చేపట్టారని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ లబ్ధి కోసం తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, గతంలో 1993, 2002-04లో కూడా ఇలాంటి ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు. కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో ఒక బూత్‌లో 54 ఓట్లలో 17 మంది మరణించిన వారి పేర్లు ఉండటం శుద్ధి అవసరాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ఎస్ఐఆర్‌పై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు బండారి వేణు, కేపిపి చంద్ర, పొన్నం లక్ష్మీ మొండయ్య, తోట అనిల్, కర్రె అనిల్, బీజేపీ నాయకులు పండగ నాగరాజు, రెడ్డివేణి రాజు, చిగురు రవీంధర్, నాగరాజు గురు స్వామి, వాడే వెంకట్ రెడ్డి, అనిల్, రమేష్ గౌడ్, రాజ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ.. సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం

**మాజీ ఐపీఎస్ ఆఫీసర్ వివి లక్ష్మీనారాయణ**

**సూర్యాపేటలో రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' ప్రారంభం**




**సూర్యాపేట(జనంసాక్షి):** క్రమశిక్షణ సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలమని మాజీ ఐపీఎస్ ఆఫీసర్ వివి లక్ష్మీనారాయణ అన్నారు. దేశంలో ఐఐటీ జేఈఈ, నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు వారు సూర్యాపేటలో రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్ ను శుక్రవారం ప్రారంభించారు. హోటల్ శ్రీ గ్రాండ్ లో రెసోనెన్స్ ఫౌండేషన్ గ్రాండ్ లాంచ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సూర్యాపేటలో ఫౌండేషన్ కోచింగ్ ను అందుబాటులోకి తీసుకు వస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ శిక్షణ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన అభ్యాసం, స్పష్టమైన అవగాహన, సరైన మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తు విజయాలకు కీలకమని తెలిపారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే క్రమబద్ధమైన విద్యా శిక్షణ ద్వారా భవిష్యత్తు పోటీ పరీక్షలకు బలమైన పునాదిని ఏర్పరచుకోవచ్చని తెలిపారు. ఈ ఫౌండేషన్ కోర్సు ద్వారా విద్యార్థులకు వివిధ అంశాలలో సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభ దశలోనే బలమైన పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు భావనాత్మక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోగలరని చెప్పారు. దీంతో ఇంటర్ అనంతరం ఐఐటీ జేఈఈ, నీట్ వంటి పోటీ ప్రవేశ పరీక్షలలో సులభంగా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందన్నారు. ఈ ఫౌండేషన్ సెంటర్ విద్యార్థులకు ప్రాథమికాంశాలను బలోపేతం చేసుకోవడానికి, ఐఐటీ జేఈఈ, నీట్, ఒలింపియాడ్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవడానికి సహాయపడుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడిన అభ్యాసం, కెరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు.

# సుపారీ గ్యాంగ్ అరెస్ట్

- హత్య ప్రయత్నంలో ఐదుగురు నిందితుల పాత్ర
- అనతి కాలంలోనే నిందితులను ఆధీనంలోకి తీసుకున్న కాటారం పోలీసులు
- ప్రశంసిస్తున్న కాటారం మండల ప్రజలు



**కాటారం, జూన్ 27 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఇటీవల జరిగిన ఓ హత్య ప్రయత్నం కేసులో ప్రధాన పాత్రధారులైన సుఫారి గ్యాంగును కాటారం పోలీసులు అరెస్టు చేశారు ఐదుగురు నిందితులను ఆధీనంలోకి తీసుకొని కోర్టు ఎదుట హాజరు పరచగా రిమాండ్ తరలించారని పోలీసులు వెల్లడించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను శుక్రవారం కాటారం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఈ ఊరి నాగార్జున రావు, ఎస్సై సిహెచ్ శ్రీనివాస్, రెండవ ఎస్ ఐ, జి మహేష్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు వారు వెల్లడించిన వివరాల ప్రకారంగా ఈ నెల 22న కాటారం మండలంలోని ఒడిపిల వంచ గ్రామానికి చెందిన చిగురు గణేష్ అనే వ్యక్తిపై ధన్వాడ గుమ్మల్లపల్లి గ్రామం మధ్య కత్తిపోట్లతో హత్య ప్రయత్నానికి పాల్పడిన సంఘటన వివరాలను వెల్లడించారు. గణేష్ తన భార్యను గత ఏడాది కొట్టి చంపాడని కారణంతో గణేష్ ను మట్టుబెట్టాలని ఆయన అత్త చింత రాజేశ్వరి సుఫారి గ్యాంగ్ ద్వారా హతమార్చాలని కుట్ర పన్నినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు కరీంనగర్ చింతకుంటలో నివాసముంటున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గూడపల్లి గ్రామానికి చెందిన ధర్మసోద్ రవీందర్ నాయక్ 40, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం తిరుమలపూర్ కు చెందిన కార్ డ్రైవర్ తడిగొండ దామోదర్ 38, కరీంనగర్ పట్టణం కార్ఖానా గడ్డ కు చెందిన చికెన్ సెంటర్ నిర్వాహకులు కొలపాక నాగార్జున 37, కరీంనగర్ పట్టణం బొమ్మకల్ ఆటో డ్రైవర్ పోలు ప్రశాంత్ 28 , లతో కలిసి సుపారి గ్యాంగ్ కు ప్రయత్నించగా చాకచక్యంగా పట్టుకున్నామని పోలీసులు వెల్లడించారు. గణేష్ సంతానమైన ఇద్దరు మనుమలను సైతం వదిలిపెట్టి ఉండగా తానే సాగుతున్నట్లు నిందితురాలు చింత రాజేశ్వరి పోలీసుల ఎదుట అంగీకరించినట్లు పేర్కొన్నారు. ధర్మసూద్ రవీందర్ నాయక్‌తో, సుపారీ ఒప్పందాన్ని పది లక్షలకు కుదుర్చుకొని గణేష్ ను హత్య చేయించేందుకు కుట్ర పన్నినట్లు పేర్కొన్నారు .కాగా ఈనెల 22న గణేష్ పై హత్య ప్రయత్నం జరగా కత్తిపోట్లతో తప్పించుకున్న గణేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టినట్టు తెలిపారు. ఈనెల 26న స సుపారి గ్యాంగ్ కుదుర్చుకున్న ఒప్పందం మేరకు డబ్బులు తీసుకునేందుకు చింత రాజేశ్వరి వద్దకు రాగా తమకు అందిన విశ్వాసనీయ సమాచారం మేరకు సుపారి గ్యాంగ్ ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసు విచారణ అనంతరం మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా నిందితులను రిమాండ్ కు తరలించారని పోలీసులు పేర్కొన్నారు. నాలుగు రోజుల విచారణ అనంతరం గ్యాంగును పట్టుకున్న పోలీసు బృందాన్ని కాటారం డిఎస్పి సూర్యనారాయణ అభినందించారు.



# ఎన్డీపీఎస్ చట్టంపై ప్రత్యేక తనిఖీలు

**నెరడిగొండ, జూన్26 (జనంసాక్షి) :** మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా జిల్లా పోలీసుల ఆదేశాల మేరకు ఇచ్చోడ సీఐ రమేష్,నెరడిగొండ ఎస్ఐ ఇమ్రాన్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున ఈగల్ టీమ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. మండలంలోని ధాబా హోటళ్లు, తుఫాన్ వాహనాలు,ట్రావెల్స్ బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమానాస్పద వ్యక్తులు,వస్తువులపై నిఘా ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం మాదకద్రవ్యాల విక్రయం, రవాణా,వినియోగం వంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు,మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకుతెలియజేయాలని కోరారు. సమాజంలో శాంతి భద్రతలు,యువత భవిష్యత్తు పరిరక్షణ కోసం ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరంకొనసాగుతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఈగల్ టీమ్ సిబ్బంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై డిప్యూటీ కమిషనర్ శైలజ తనిఖీ

**అర్హులందరి పేర్లు నమోదు చేయాలని అధికారులకు ఆదేశం**

**బోడుప్పల్-జనంసాక్షి :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం లో భాగంగా బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎ. శైలజ చెంగిచెర్ల వార్డు పరిధిలోని పలు ప్రాంతాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఇన్‌చార్జ్ మోహన్‌రావుతో కలిసి బూత్‌లను పరిశీలించి, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎన్నికల సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మియాపూర్ సీఐ శివప్రసాద్‌పై బదిలీ వేటు

మియాపూర్ సీఐ శివప్రసాద్‌పై బదిలీ వేటు పడింది. సివిల్ వివాదంలో జోక్యం చేసుకున్నారనే ఆరోపణలతో శివప్రసాద్‌ను బదిలీ చేసి, సైబరాబాద్ సీపీ కార్యాలయానికి సీపీ రమేష్ రెడ్డి అటాచ్ చేశారు. ఒక ప్రైవేట్ హాస్పిటల్ భూ వివాదంలో నిబంధనలకు విరుద్ధంగా జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్య తీసుకున్నారు. పోలీసులు సివిల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు

# నిమ్స్‌లో తొలిసారిగా అంజియో జెట్ చికిత్సతో ఎక్యూట్ డివిటికి వైద్యం

- ఆరోగ్యశ్రీ కింద రూ.5 లక్షల అత్యాధునిక చికిత్స ఉచితంగా అందించిన నిమ్స్
- కాళ్ల సిరల్లో రక్తగడ్డ సమస్యకు ఆంజియో జెట్ టెక్నాలజీతో చికిత్స
- ప్రాణాపాయ డీవీటీకి నిమ్స్‌లో అత్యాధునిక ఫార్మాకో-మెకానికల్ త్రోంబెక్టమీ
- సిద్దిపేట మహిళకు నిమ్స్‌లో విజయవంతమైన ఆంజియో జెట్ చికిత్స
- తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగంలో మరో ముందడుగు
- డీప్ వేయిన్ త్రోంబోసిస్ చికిత్సలో నిమ్స్‌కు కొత్త మైలురాయి
- నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ వెల్లడి



**ఖైరతాబాద్, జూన్ 26 (జనం సాక్షి) :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో తొలిసారిగా అత్యాధునిక అంజియో జెట్ ఫార్మా కో-మెకానికల్ త్రోంబెక్టమీ విధానాన్ని ఉపయోగించి అక్యూట్ డీప్ వేయిన్ త్రోంబోసిస్(డివిటి)తో బాధ పడుతున్న ఓ మహిళకు విజయవంతంగా చికిత్స అందించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బయ్యారం గ్రామానికి చెందిన 39 ఏళ్ల కొలిచేల్మి రజినీకి ఈ చికిత్స నిర్వహించినట్లు నిమ్స్ అధికారులు తెలిపారు. డీవీటీ అనేది కాళ్లలోని లోతైన సిరల్లో రక్తం గడ్డకట్టే తీవ్రమైన వ్యాధి. సకాలంలో చికిత్స అందించకపోతే ఆ గడ్డ ఊపిరితిత్తులకు చేరి పల్మనరీ ఎంబోలిజంకు దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొన్నారు. ఈ చికిత్సలో ముందుగా రక్తగడ్డను కరిగించే ప్రత్యేక ఔషధాలను నేరుగా ప్రభావిత ప్రాంతంలో ప్రవేశపెట్టి, అనంత రం అంజియో జెట్ పరికరం సహాయంతో గడ్డను వేగంగా తొలగిస్తారు. దీనివల్ల రక్తప్రసరణ తక్షణమే పునరుద్ధరించబడటంతో పాటు రోగి త్వరగా కోలు కునే అవకాశం పెరుగుతుందని వైద్యులు వివరిం చారు. అలాగే భవిష్యత్తులో కాళ్ల వాపు, నొప్పి వంటి దీర్ఘకాలిక సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ ఈ చికిత్సకు సాధారణంగా సుమారు రూ.5 లక్షల వరకు వ్యయం అవుతుందని, అయితే ఆరోగ్యశ్రీ పథకం కింద రోగికి పూర్తిగా ఉచితంగా అందించిన ట్లు వెల్లడించారు.ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించడం నిమ్స్‌కు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ చికిత్సను వాస్కులర్ సర్జరీ విభాగం హెచ్‌వోడీ డా.సందీప్ మహాపాత్ర నేతృత్వంలో డా.అనూష, డా.అరుణశ్రీ, డా.ఊహ, డా.శ్రీనిధి, డా.సుదర్శన్, డా.అమర్‌నాథ్, డా.త్రివిక్ర మ్, డా.కీర్తన, డా.నలిన్ కృష్ణ, డా.నరేన్‌తో పాటు అనస్థీషియాలజీ విభాగం, క్యాథ్ ల్యాబ్ బృందం, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర వైద్య సిబ్బంది సమిష్టిగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంబం ధిత బృందాన్ని నిమ్స్ డైరెక్టర్ అభినందించారు.

**పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేలా నిమ్స్‌ను తీర్చిదిద్దుతాం : డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్**

నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆసుపత్రిని అంతర్జాతీయ ప్రమాణాలతో, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేలా తీర్చిదిద్దుతున్నామని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. శుక్రవారం నిమ్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక 'మీడియా ఇంటరాక్షన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కొత్త ప్రాజెక్టుల వివరాలను ఈ సందర్భంగా పత్రికా ముఖంగా వెల్లడించారు. నిమ్స్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్త హాస్పిటల్ బ్లాక్ దశాబ్ది బ్లాక్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కొత్త భవనాలు అందుబాటులోకి వస్తే అదనం గా వేలాది పడకలు సమకూరుతాయని ముఖ్యం గా అత్యవసర వైద్యం కోసం ఐసీయూ వసతులను భారీగా పెంచుతున్నామని వివరించారు.రాబోయే రోజుల్లో రోగులకు బెడ్ల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

**అందుబాటులోకి అత్యాధునిక రోబోటిక్ సర్జరీలు**

క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, న్యూరాల జీ విభాగాలలో సరికొత్త వైద్య సాంకేతికతను ప్రవే శపెడుతున్నట్లు డైరెక్టర్ ప్రకటించారు. అత్యాధు నిక రోబోటిక్ సర్జరీ పరికరాలను, అప్‌గ్రేడెడ్ డయా గ్నోస్టిక్ ల్యాబ్‌లను త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. అలాగే, ఆసుపత్రిలో ఓపీ రిజిస్ట్రేషన్ మొదలుకొని నివేదికల సేకరణ వరకు డిజిటల్ సేవలను మరింత సరళతరం చేస్తున్నట్లు వెల్లడించారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా నిరుపేదలకు అందు తున్న ఉచిత వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు ఆసుపత్రిలోనే ఉచితంగా లభించేలా గట్టి చర్యలు తీసుకుంటున్నామని, మందుల కొరత రాకుండా నిరంతరం పర్యవేక్షిస్తు న్నామని చెప్పారు.వైద్య విద్యారంగంలో నిమ్స్ ప్రతిష్టను మరింత పెంచేందుకు పీజీ సూపర్ స్పెషా లిటీ సీట్ల సంఖ్యను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతర్జాతీ య స్థాయి వైద్య పరిశోధనల కోసం ప్రత్యేక నిధుల ను కేటాయించామని, పరిశోధనల ద్వారా సరికొత్త చికిత్సా విధానాలను కనుగొనేందుకు వైద్యులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.పెరుగుతున్న రోగు ల రద్దీకి అనుగుణంగా అదనపు వైద్యులు, నర్సింగ్ , పారామెడికల్ సిబ్బంది నియమకాలకు సంబం ధించి ప్రభుత్వం నుంచి త్వరలోనే సానుకూల నిర్ణ యం రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేమ్స్ ఆస్పత్రి డీన్ డాక్టర్ పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు



# తప్పుడు పత్రాలతో భూమి కాజేసే యత్నం

**కోర్టును తప్పుదారి పట్టించిన ఇద్దరికి రిమాండ్**

**చేవెళ్ల, జూన్ 26 (జనంసాక్షి)** చేవెళ్ల మండలం ముడిమ్యాల్ గ్రామంలోని సర్వే నంబర్లు 111, 116లో ఉన్న 13 ఎకరాల 12 గుంటల భూమికి సంబంధించిన వివాదంలో తప్పుడు పత్రాలు, తప్పుడు సాక్ష్యాలతో న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించి భూమిని తమ పేరుపై చేసుకునేందుకు యత్నించిన ఇద్దరిని చేవెళ్ల పోలీసులు అరెస్ట్ చేసి కంది జైలుకు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముడిమ్యాల్ గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 111, 116లోని భూమిని 2006లో గోపీలాల్ చౌహాన్, ఏ.జంగయ్య కలిసి జూకంటి బుచ్చయ్యతో పాటు మరో ఎనిమిది మంది నుంచి కొనుగోలు చేశారు. అనంతరం అదే భూమిని 2016లో సుప్రీత్ సింగ్‌కు రిజిస్ట్రేషన్ ద్వారా విక్రయించారు. అయితే, లంగర్‌హౌస్‌కు చెందిన ఠాకూర్ జై సింగ్ 2010 ఆగస్టు 12న తనకు ఇదే భూమిపై అగ్రిమెంట్ ఆఫ్ సేల్ జరిగిందని పేర్కొంటూ చేవెళ్ల సివిల్ కోర్టులో ఒరిజినల్ సూట్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో ఏ.జంగయ్య మరణ ధ్రువీకరణ పత్రం స్థానంలో నీలి జంగయ్య మరణ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించి, దానిని ఏ.జంగయ్యదిగా చూపిస్తూ కోర్టును తప్పుదారి పట్టించినట్లు పోలీసులు ఆరోపించారు. అలాగే ముడిమ్యాల గ్రామానికి చెందిన గోనె హరికిషన్ రెడ్డి, 2010లోనే గోపీలాల్ చౌహాన్, ఏ.జంగయ్య కలిసి ఠాకూర్ జై సింగ్‌కు భూమిని విక్రయించేందుకు అగ్రిమెంట్ చేసుకుని, భూమి స్వాధీనాన్ని కూడా అప్పగించినట్లు కోర్టులో సాక్ష్యం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఆధారాలపై 2023 ఏప్రిల్ 11న ఎక్స్‌పార్టీ తీర్పు పొందగా, ఆ తీర్పు మేరకు 2016లో జరిగిన సేల్ డీడ్‌ను రద్దు చేయించారు. తదానంతరం ఠాకూర్ జై సింగ్ తన పేరుపై భూమిని నమోదు చేయాలని చేవెళ్ల తహసీల్దార్‌ను ఆశ్రయించారు. ఇదే సమయంలో సుప్రీత్ సింగ్ ఆ భూమిని పలువురికి విక్రయించాడు. వారిలో మహమ్మద్ మోషిన్ కొనుగోలు చేసిన కొంత భూమిని అనంతరం సాగిలి చంద్రశేఖర్ రెడ్డితో పాటు మరికొందరు కొనుగోలు చేశారు. ఈ భూములను కొనుగోలు చేసి స్వాధీనంలో ఉన్న వారికి చేవెళ్ల తహసీల్దార్ ఈ ఏడాది మే 15న నోటీసులు జారీ చేశారు. దీంతో సాగిలి చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీసులు జూన్ 15న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు నిందితులు ఠాకూర్ జై సింగ్, గోనె హరికిషన్ రెడ్డిలను జూన్ 24న అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, రిమాండ్ విధించడంతో కంది జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# 36 సెకన్లలో 26 ఆపిల్స్ బ్రేక్ చేసి ప్రపంచ రికార్డు

**మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జీవీఆర్ కరాటే అకాడమీ వినూత్న విన్యాసం**



**ఘట్కేసర్, జూన్ 26 (జనంసాక్షి) :** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ రికార్డు ప్రయత్నం విజయవంతమైంది. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి కేవలం 36 సెకన్లలో ఆరుగురు విద్యార్థుల తలలపై ఉంచిన 26 ఆపిల్స్‌ను హ్యాండ్ చాప్స్‌తో బ్రేక్ చేసి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ విన్యాసంలో భార్గవ సాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియ అనే ఆరుగురు విద్యార్థులు ధైర్యంగా పాల్గొని రికార్డు విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజానికి చైతన్యాన్ని కలిగించే సందేశంతో ఈ ప్రపంచ రికార్డును నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రమశిక్షణ, ఏకాగ్రత, భద్రతా ప్రమాణాలను పాటిస్తూ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి ఈ విన్యాసాన్ని పూర్తి చేయడం విశేషమని కొనియాడారు. ప్రపంచ రికార్డులు ప్రతిభను చాటడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించేలా ఉండాలని, ఆ దిశగా డాక్టర్ గోపాల్ రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ రికార్డులో పాల్గొన్న విద్యార్థుల ధైర్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రమణ్ గౌడ్, కాచిగూడ మాజీ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, రమేష్ యాదవ్, వివేక్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ. కృష్ణారెడ్డి, నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ కోట్ల నిరంజన్ రెడ్డి, జీవీఆర్ కరాటే అకాడమీ బ్లాక్ బెల్ట్స్ కరీమ్, అమృతరెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైత్‌తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, పలువురు ప్రముఖులు పాల్గొని డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, విద్యార్థులను అభినందించారు.

# వైభవంగా 'అమ్మ నాన్న ఓ ఇడియట్' వెబ్ సిరీస్ పోస్టర్




**ఖైరతాబాద్, (జనంసాక్షి):** సునీల్ రావినూతల, మహేశ్వరి తారాగణంలో బానోత్ శ్రీ నాయక్ దర్శకత్వంలో తెరకెక్కిన "అమ్మ నాన్న ఓ ఇడియట్" వెబ్ సిరీస్ శనివారం మధురానగర్ లోని చిత్ర యూనిట్ కార్యాలయంలో అత్యంత వైభవంగా విడుదలయింది.వినూత్న కథాంశంతో, కుటుంబ విలువల నేపథ్యంలో తెర కెక్కుతున్న ఈ సిరీస్ పోస్టర్‌ను చిత్ర బృందం ఆవి ష్కరించారు.ఈ సంద ర్భంగా కథానాయకుడు సునీల్ రావినూతల మాట్లా డుతూ.. నేటి తరం యువత ఆలోచనలకు, తల్లిదండ్రుల భావోద్వేగా లకు అద్దం పట్టేలా ఈ సిరీస్‌ను రూపొందించాం అని అన్నారు.పేద మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటు పడి తదనంతరం మంచి వ్యక్తిగా మారిపోయి కుటుంబానికి ఎలా ఉపయోగ పడ్డాడు అనే నేప థ్యంలో ఈ సిరీస్ కొనసాగు తుందని తెలిపారు. ప్రతి కుటుంబం మెచ్చేలా, సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ అమ్మ నాన్న ఓ ఇడియట్ కచ్చితంగా వీక్షకులను ఆకట్టుకుంటుంది అని ధీమా వ్యక్తం చేశారు.నేడు విడుదలైన పోస్టర్ చాలా వైవిధ్యంగా ఉంటూ, సిరీస్‌పై అంచనాలను పెంచేలా ఉంది. టైటిల్ క్యాచీగా ఉండటంతో పాటు పోస్టర్ డిజైన్ అందరినీ ఆకర్షిస్తోంది. షూటింగ్ ముగించుకుని, ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో బిజీగా ఉన్న ఈ వెబ్ సిరీస్ త్వరలోనే యూట్యూబ్లో అలరించడా నికి సిద్ధమవుతోంది. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మా తలు కిషోర్ కుమార్, సాయి మోహన్ రెడ్డి , నటీనటులు సాంకేతిక నిపుణులుపాల్గొన్నారు.



# నో అడ్మిషన్స్ బోర్డుతో దర్శనమివ్వనున్న డిగ్రీ కళాశాల

**మల్కాజిగిరి జూన్ 26(జనంసాక్షి) :** మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి గానూ 100 శాతం డిగ్రీ ప్రవేశాలు పూర్తయ్యాయని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బండి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. దోస్త్ మూడో దశ అలాట్‌మెంట్‌తో కళాశాలలోని అన్ని సీట్లు భర్తీ అయ్యాయని, దీంతో త్వరలోనే కళాశాల ప్రాంగణంలో నో అడ్మిషన్స్ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.కళాశాలలో అందుతున్న నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉద్యోగావకాశాల వల్లే విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ స్థాయి విశ్వాసాన్ని చూపించారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. వంద శాతం సీట్లు భర్తీ కావడం కళాశాల చరిత్రలో ఒక మైలురాయని, ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక, బోధనేతర సిబ్బందికి మరియు విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

# కాంగ్రెస్ హయాంలో కూడా రెవిన్యూ వ్యవస్థ మారదా?

**ప్రజామిత్ర రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్**



**కరీంనగర్ బ్యూరో, జూన్ 26 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో కూడా రెవెన్యూ వ్యవస్థ మారదా? అని ప్రజా మిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం ప్రజామిత్ర జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మే నెలలో ఏసీబీ ట్రాప్ లో అరెస్టు అయిన శామీర్ పేట తాసిల్దార్ తన బంధువుల నివాసాల పై ఏసీబీ అధికారులు తనిఖీలు చేయగా బయటపడ్డ భూములు, బంగారం విలువ దాదాపు 50 కోట్లు అని నిర్ధారించడం జరిగిందన్నారు. గత కొంత కాలం నుండి రెవిన్యూ అధికారుల పై ఏసీబీ అధికారులు చేసిన తనిఖీలలో కొందరి అధికారుల అక్రమ ఆదాయానికి మించిన ఆస్తులు 100 కోట్ల కు పైగా బహిర్గతం అయిందన్నారు. రెవెన్యూ డిపార్ట్మెంట్ లో ఈ అవినీతి పెరగడానికి కారణాలు మాన్యువల్ నుండి డిజిటల్ కు మారడం, 2020 లో వచ్చిన ఆర్ ఓ ఆర్ యాక్ట్ ధరణి వలన లక్షల ఎకరాల వ్యవసాయ, నివాస భూమిలో కొత్త సమస్యలు ఉత్పన్నం అయినాయన్నారు. వాటిని సరి చేయించుకునే రెవెన్యూ ప్రొసీజర్ లో ఒక కాంప్లికేటెడ్ ఆన్ లైన్ సిస్టం మూలంగా అవినీతి పెరిగిపోయిందన్నారు. ఒక తాసిల్దార్ ఇచ్చే రిపోర్టును ఆర్డిఓ, అడిషనల్ కలెక్టర్, తర్వాత జిల్లా కలెక్టర్ పరిశీలన చేసిన తర్వాతనే ఆ సమస్యకు పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి సమస్య పరిష్కారానికి కనీసం రెండు మూడు సంవత్సరాలు కాలం గడిసిపోతుందన్నారు. రైతుల భూముల విలువను బట్టి అవినీతి స్థాయి పెరిగిపోయిందని, ఈ రెవెన్యూ డిపార్ట్మెంట్ లో జరుగుతున్న పరిమాణాలను జిల్లా కలెక్టర్లు గమనించి నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలో 4గురు, 5గురు తాసిల్దారులు నియమకమై ఉంటారు. అక్కడ జరుగుతున్న వ్యవస్థను ఎమ్మెల్యే పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రెవిన్యూ డిపార్ట్ మెంట్ లో జరుగుతున్న అవినీతి, అలసత్వం పై రెవిన్యూ మంత్రి తగు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ విషయం పై ఆలోచించి పరిష్కారం చూపించాల్సిన అవసరం ఉందని, లేనియెడల ప్రజలు అసహనానికి గురవుతారని తెలిపారు. ఈ విషయం ప్రభుత్వంలో ఉన్న పెద్దలతో చర్చించడం జరిగిందని, వారు కూడా రెవెన్యూ వ్యవస్థ పై అసహనం వ్యక్తం చేయడం జరిగిందన్నారు. కనుక ప్రభుత్వం వెంటనే రెవెన్యూ భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. మీడియా సమావేశంలో కొంపెల్లి రవీందర్, గోనె రవి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం టూ షాద్‌నగర్

**గంజాయి వినియోగిస్తున్న ఇద్దరు నిందితుల అరెస్ట్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం నుండి రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి గంజాయి తీసుకొచ్చిన ఇద్దరు నిందితులను షాద్ నగర్ పోలీసులు మరియు ఎస్ఓటి టీం ఆధ్వర్యంలో నిఘా పెట్టి 650 గ్రాముల గంజాయితో పాటు ఇద్దరు నిందితులు గంగ మాడి, రమేష్ కుమార్ అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేసి ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సీతారాం తెలిపారు మాదకద్రవ్యాల రవాణా విక్రయాలు మరియు వినియోగంపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు ఇలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

19

# పారిశ్రామికవాడల పేరుతో దళితుల భూములు గుంజుకుంటుండ్రు

**సర్కార్‌పై తిరుగుబాటుకు లగచర్ల రైతుల పోరాటం స్ఫూర్తిదాయకం**
**భూముల అక్రమాలపై న్యాయపోరాటం : కేటీఆర్**



**వికారాబాద్ జిల్లా బ్యూరో జూన్ 26 (జనం సాక్షి):** పారిశ్రామిక వాడల పేరుతో దళితుల గిరిజనుల భూములను సర్కార్ బలవంతంగా లాక్కుంటుందని భూముల అక్రమాలపై న్యాయపోరాటం చేస్తామని బి ఆర్ ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం వేదికగా బీఆరెస్స్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని కోటి 67 లక్షల మహిళలకు నెలకు 2500 చొప్పున ఒక్కొక్కరికి లక్షాయాభై వేల రూపాయలు వారి ఖాతాలో వేస్తే తను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఆయన సవాల్ చేశారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. చెప్పింది రూపాయి, చేసింది చారానా అంటూ ఎద్దేవా చేశారు. అసైన్డ్ భూములకు పట్టాలిస్తామని చెప్పి, ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో పేదల సాగు భూములను గుంజుకుంటున్నారని మండిపడ్డారు. రాకంచర్లలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇండస్ట్రీలు పెట్టుకోవాలని, కాడ్లాపూర్ లాంటి గ్రామాల్లో పేదల భూములు లాక్కుంటే బీఆర్ఎస్ ఊరుకోదని, బాధితుల పక్షాన నిలిచి పోరాడుతామని హెచ్చరించారు. ఉద్దండాపూర్ నుండి గ్రావిటి ద్వారా ఈ ప్రాంతానికి నీళ్ళొచ్చేలా కేసీఆర్ అన్ని సంసిద్ధం చేస్తే సిఎం రేవంత్ డబ్బుల కోసం, కుటుంబ సంపాదన కోసం, కమీషన్ల కోసం లిఫ్ట్ ఇరిగేషన్ పెడతానంటున్నాడని కేటీఆర్ విమర్శించారు. రాబోయే రోజుల్లో మళ్లీ కేసీఆర్‌ని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. పరిగి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేసిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు చేశారు.అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక, అదే భూములను లాక్కుంటున్నది కాంగ్రెస్ సర్కార్ ఆయన విమర్శించారు. పారిశ్రామికవాడల పేరుతో దళిత, గిరిజన పేదల భూములను గుంజుకుంటు న్నారు. పరిగిలో స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా భూములు స్వాధీనం చేసుకుంటుందని అన్నారు. పరిగి నియోజకవర్గంలో పేదల అసైన్ భూములను లాక్కోవడాన్ని బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదు.. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పట్టాలు ఇచ్చి, తగిన నష్టపరిహారం చెల్లించి, రైతుల అంగీకారంతోనే భూములు సేకరించాలని ఆయన డిమాండ్ చేశారు. భూముల అక్రమాలపై అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని హామీ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్ రెడ్డి మెతుకు ఆనంద్ , కొప్పుల అనిల్ రెడ్డి , శ్రీనివాస రావు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
27 జూన్ 2026

# తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామంటూ మోసం

- గోల్డ్‌మ్యాన్ సూర్యభాయ్‌పై కేసు

**హైదరాబాద్, జూన్26 (జనంసాక్షి) :** గోల్డ్ మ్యాన్ సూర్య భాయ్‌పై కేసు నమోదు అయ్యింది. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని లక్షల రూపాయలు తీసుకుని మోసం చేశారంటూ ఆరోపణలు రావడంతో సూర్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌లకు సన్నిహితుడి నంటూ నమ్మించాడని, తక్కువ ధరకే విదేశీ బంగారం ఇస్తామంటూ లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించాడంటూ బాధితులు వాపోయారు. అటు బంగారం ఇవ్వక, డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు సూర్య భాయ్ ఇంటికి వెళ్లారు. దీంతో తన దగ్గర ఉన్న మూడు ఐఫోన్లను ఇచ్చి వీటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని చెప్పడంతో పాటు రూ.20 లక్షల చెక్ ఇచ్చి పంపించాడు. అయితే, బాధితులు వెళ్లిపోయాక వారిపైనే అత్తాపూర్ పోలీసులకు సూర్య ఫిర్యాదు చేశాడు. తనను బెదిరించి తన ఫోన్లు లాక్కెళ్లారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు అసలు విషయాన్ని రాబట్టారు. బంగారం కోసం హిమాయత్‌నగర్, నీలోఫర్‌లో సూర్య భాయ్‌కు బాధితులు రూ.30 లక్షలు ఇచ్చినట్లు విచారణలో బయటపడింది. దీంతో అత్తాపూర్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. కేసును నారాయణగూడకు బదిలీ చేశారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన

**అమరావతి, జూన్26 (జనంసాక్షి) :** వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారుల్ని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి భద్రత, దోమల నియంత్రణ చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రజారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయగలుగుతామన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, రోజు వారీ చెత్త సేకరణ శాస్త్రీయపద్ధతిలో నిర్వహించాలని, ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. "ఫ్రైడే -- డ్రైడే" కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శు క్రవారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి మురుగునీటి నిల్వలను తొలగించే ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపులు, మైక్ అనౌన్స్?మెంట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇచ్చే తాగునీటి నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ ఉండాలని పైపు లైన్లలో లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.జారోగ్య పరిరక్షణను ప్రతి గ్రామ పంచాయతీ అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలి. క్రమం తప్పకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి, అన్ని పంచాయతీల్లోనూ బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో అందుబాటులో ఉంచాలి. ముఖ్యంగా వర్షపు నీరు, మురుగునీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవటం ద్వారా దోమల వ్యాప్తిని కట్టడి చేయాలని సూచించారు.

# కొత్త హంగులతో భోగాపురం విమానాశ్రయం

- జూలై 5న ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం!
- 8నుంచి విమానాల రాకపోకలు ప్రారంభం!!
- ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ



**భోగాపురం, జూన్26 (జనంసాక్షి) :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, నవ్యాంధ్రప్రదేశ్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. జూలై 5న భారత ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని అత్యంత వైభవంగా ప్రారంభించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుని, రికార్డు సమయంలో పనులను పూర్తి చేయించారు. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తుది అధికారిక షెడ్యూల్ ఆమోదం కోసం రాష్ట్ర అధికార యంత్రాంగం ప్రస్తుతం వేచి చూస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్న విమానాశ్రయం ఐఎన్ఎస్ డేగా నేవీ రక్షణ పరిధిలో ఉండటం వల్ల అంతర్జాతీయ సర్వీసులకు, రాత్రి వేళల్లో విమానాల రాకపోకలకు అనేక సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా జీఎమ్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించారు. అత్యాధునిక రన్‌వే, అంతర్జాతీయ కార్గో టెర్మినల్, ఏకకాలంలో పదుల సంఖ్యలో విమానాలు పార్క్ చేసే ఏప్రాన్ సౌకర్యాలతో ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ రూపుదిద్దుకుంది. ఇది అందుబాటులోకి వస్తే ప్రపంచ దేశాల నుండి నేరుగా విశాఖకు విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి.భోగాపురం విమానాశ్రయం కేవలం ప్రయాణికుల రాకపోకలకే పరిమితం కాకుండా, ఉత్తరాంధ్ర ఆర్థిక వృద్ధికి ఒక ప్రధాన చోదక శక్తిగా మారబోతోంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న ఫార్మా హబ్‌లు, ఐటీ కారిడార్లు, అక్వా రంగానికి ఈ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ కార్గో సేవలు విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయి. ఇక్కడి ఉత్పత్తులను నేరుగా విదేశాలకు ఎగుమతి చేసేందుకు వీలవుతుంది. దీనివల్ల వందలాది గ్లోబల్ కంపెనీలు ఉత్తరాంధ్ర వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని, తద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.విశాఖపట్నం నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్ వరకు ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన సిక్స్ లేన్ బీచ్ కారిడార్ రోడ్డు పనులను కూడా వేగవంతం చేసింది. ఈ కనెక్టివిటీ వల్ల భోగాపురం పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి రెక్కలు వచ్చాయి. అలాగే రుషికొండ, భీమిలి, తొట్లకొండ తీరప్రాంతాలు గ్లోబల్ టూరిజం స్పాట్స్‌గా మారబోతున్నాయి. అంతర్జాతీయ పర్యాటకులు నేరుగా ఇక్కడికి చేరుకునే వీలుండటంతో హోటల్, హాస్పిటాలిటీ రంగాలు ఊపందుకోనున్నాయి.గతంలోనే ఈ ప్రాజెక్టుకు బీజం వేసిన చంద్రబాబు నాయుడు, మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భోగాపురం పనులపై ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహించారు. నిధుల కొరత లేకుండా చూస్తూ, నిర్మాణ సంస్థ జీఎమ్ఆర్‌పై ఒత్తిడి తెచ్చి పనులను పరుగులు పెట్టించారు. పౌర విమానయాన శాఖ నుంచి అవసరమైన అన్ని రకాల అనుమతులు, ట్రయల్ రన్స్‌ను ఇప్పటికే విజయవంతంగా పూర్తి చేశారు. జూలై 5న ఈ మెగా ప్రాజెక్ట్‌ను ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించి, తమ ప్రభుత్వ డెవలప్‌మెంట్ విజన్‌ను దేశవ్యాప్తంగా చాటాలని కూటమి భావిస్తోంది. ఎయిర్‌పోర్ట్ రన్‌వే, టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ పనులు వంద శాతం పూర్తవడంతో పీఎమ్ఓ నుంచి క్లియరెన్స్ రాగానే అధికారికంగా ప్రారంభోత్సవ తేదీని ప్రకటించనున్నారు. ప్రధాని మోదీ పర్యటన ఖరారైతే.. అదే రోజు ఉత్తరాంధ్రలో మరికొన్ని కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ సిద్ధం చేస్తోంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం అనేది నవ్యాంధ్రప్రదేశ్ జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి ఒక మైలురాయి కాబోతోంది.

# చిన్నారుల భవిష్యత్తే తెలంగాణ ప్రగతి

- డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం
- టాలీవుడ్ ప్రముఖులు 'సే నో టు డ్రగ్స్' సందేశాలివ్వాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 'చిన్నారుల భవిష్యత్తే ఈ రాష్ట్ర భవిష్యత్తు. వాళ్ళు ఎంతగా వృద్ధిలోకి వస్తే, తెలంగాణ రాష్ట్రం అంతగా అభివృద్ధి చెందుతుంది' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, అక్రమ మానవ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. తెలంగాణలో ఏ ఒక్కరూ మాదక ద్రవ్యాలకు బానిస కాకూడదన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర క్యాబినెట్ యావత్తు సంకల్పమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ అమ్మకాలకు గానీ, సరఫరా అనే మాటకే గానీ తావుండకూడదని తేల్చిచెప్పారు. ఆరోగ్యవంతమైన యువతను తయారుచేసే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ నార్కోటిక్స్‌కు వ్యతిరేకంగా ప్రత్యేకంగా 'ఈగిల్ ఫోర్స్' అనే డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. ఈ విభాగం సంపూర్ణంగా పనిచేయడానికి అవసరమైన ఆర్థిక వనరులు, రవాణా వాహనాలు సమకూర్చామన్నారు. ప్రాణాలకు ప్రమాదం ఉన్నప్పటికీ సమాజాన్ని కాపాడేందుకు పనిచేస్తున్న ఈ పోలీస్ ఉద్యోగ వ్యవస్థకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ ఇచ్చే ప్రపోజల్‌ను ప్రభుత్వం తక్షణమే ఆమోదించి, వారిని ప్రోత్సహిస్తోందని అన్నారు. జీవితం చాలా విలువైనదని, ఉన్నత స్థానాలు సాధించి సమాజానికి మేలు చేయడానికే మనం జన్మించామని భట్టి విక్రమార్క అన్నారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలతో పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారని, వారి ఆశలను, ప్రభుత్వ ఆకాంక్షలను నిజం చేయడం కోసం ప్రతి ఒక్కరు 'సే నో టు డ్రగ్స్' అని గళమెత్తాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమాజ శ్రేయస్సే బాధ్యతగా పటిష్టమైన పోలీస్ యంత్రాంగం అకుంఠిత దీక్షతో ముందుకు సాగుతోందని అన్నారు. పిల్లల భవిష్యత్తుకు ఆటంకం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హెచ్చరించారు.

కేవలం చట్టాలు చేసినంత మాత్రాన అన్నీ అమలు కావని, సమాజంలో మార్పు రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో వచ్చిన వరకట్న నిషేధ చట్టాన్ని ఉదాహరణగా చెప్తూ, కుటుంబాలు సామాజికంగా దాన్ని అర్థం చేసుకున్నప్పుడే విజయవంతం అవుతుందన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో కౌన్సెలింగ్ ఇస్తూనే, సమాజాన్ని ప్రభావితం చేయగల నాయకులు, సెలబ్రిటీలు దీనిపై వీడియో, ట్వీట్ చేసి అవగాహన కల్పించాలని కోరారు. సినిమా రంగానికి సంబంధించిన హీరోలు, హీరోయిన్లు, నటులు, ప్రముఖ దర్శకులు, క్యారెక్టర్ ఆర్టిస్టులు ఇచ్చే చిన్న సందేశం అనేకమంది యువతీ యువకుల భవిష్యత్తును మారుస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మాకూ బాధ్యత ఉందని భావించి, సినీ ప్రముఖులంతా 'సే నో టు డ్రగ్స్' పై వీడియో రికార్డెడ్ సందేశాలు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. అవసరమైతే ఇన్ఫర్మేషన్ డిపార్ట్‌మెంట్, సినిమాటోగ్రఫీ శాఖ అధికారులను మీ వద్దకు పంపి ఆ సందేశాలను రికార్డ్ చేయించి, రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయడానికి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. పోలీస్ యంత్రాంగం, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌తో పాటు ముఖ్యంగా 'ఈగిల్ ఫోర్స్'కు ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. డ్రగ్ రహిత తెలంగాణ కోసం అందరం చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకుందామని, చిన్నారుల మేధస్సు ప్రపంచానికి ఉపయోగపడాలని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# వ్యాపారవేత్త వైశాఖ్ అనుమానాస్పద మృతి



**బెంగళూరు, జూన్ 26 (జనంసాక్షి) :** ప్రముఖ కన్నడ నటి, బిగ్‌బాస్ ఫేమ్ కృషి తాపండా నివాసంలో ఒక వ్యాపారవేత్త చనిపోయి కనిపించడం బెంగళూరులో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. స్థానిక పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. నటి స్నేహితుడైన 33 ఏళ్ల వైశాఖ్ అనే వ్యాపారవేత్త ఆమె ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం రాత్రి ఈ విషాద ఘటన జరగగా, సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన శాండల్‌వుడ్ వర్గాల్లో సైతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న బెంగళూరు పోలీసు అధికారుల వివరాల ప్రకారం.. ఘటనా స్థలంలో వైశాఖ్ మృతదేహం ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. గది మొత్తం క్షుణ్ణంగా పరిశీలించినప్పటికీ ఎలాంటి సూసైడ్ నోట్ లేదా మరే ఇతర ఆధారాలు పోలీసులకు లభించలేదు. దీంతో ఇది ప్రాథమికంగా ఆత్మహత్యే అని దర్యాప్తు అధికారులు నిర్ధారణకు వచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగానే మృతికి గల కచ్చితమైన కారణాలు వెల్లడవుతాయని పోలీసు బృందం స్పష్టం చేసింది.ఈ వ్యవహారంలో ప్రధానంగా అందరి మదిలో మెదులుతున్న ప్రశ్న.. "ఆమె ఇంట్లో అతను ఎందుకు ఉంటున్నాడు? ఆమెకూ, అతనికీ ఉన్న సంబంధమేంటి?". ఈ అంశంపైపోలీసు వర్గాలు, దర్యాప్తు నివేదికల ఆధారంగా అందుతున్న సమాచారం మేరకు.. వైశాఖ్, నటి కృషి తాపండా ఇద్దరూ సన్నిహిత స్నేహితులు. వైశాఖ్ తన వ్యక్తిగత జీవితంలో నెలకొన్న తీవ్ర వివాదాల కారణంగా గత నెల రోజుల కిందట తన భార్యతో విడిపోయాడు. ఆ సమయంలో అతనికి ఆశ్రయం కల్పించే ఉద్దేశ్యంతోనే నటి తన ఇంట్లో ఉండటానికి అనుమతించినట్లు విచారణలో వెల్లడైంది.వీరి స్నేహం వెనుక మరేదైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. అయితే, ఈ ఘటన జరిగిన సమయంలో నటి కృషి తాపండా ఇంట్లో లేరని పోలీసుల అధికారిక ప్రకటన ద్వారా స్పష్టమైంది. ఆమె ఇంట్లో లేని సమయం చూసి వైశాఖ్ ఈ అఘాయిత్యానికి పాల్పడటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆమె తిరిగి వచ్చే సమయానికి లేదా ఇతరులు గమనించేలోపే ఈ ఘటన జరిగిందని పోలీసుల రికార్డులు సూచిస్తున్నాయి. విచారణలో భాగంగా నటి వాంగ్మూలాన్ని కూడా పోలీసులు రికార్డ్ చేసే అవకాశం ఉంది. మృతుడు వైశాఖ్ గత కొంతకాలంగా తీవ్రమైన మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు, వైద్య వర్గాల ద్వారా తెలుస్తోంది. భార్యతో విభేదాలు, కుటుంబ సమస్యల కారణంగా తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లిన అతను.. బెంగళూరులోని ఒక స్థానిక ఆసుపత్రిలో మానసిక వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నాడు. ఈ డిప్రెషన్ తీవ్రత వల్లే అతను ఆత్మహత్య లాంటి కఠిన నిర్ణయం తీసుకుని ఉండవచ్చని పోలీసులు ఒక అంచనాకు వచ్చారు. డాక్టర్ల దగ్గర ఉన్న అతడి హెల్త్ రికార్డులను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. వైశాఖ్ బ్యాక్‌గ్రౌండ్ పరిశీలిస్తే.. అతనిపై గతంలో క్రిమినల్ కేసులు కూడా ఉన్నట్లు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి. వార్తా సంస్థల కథనాల ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ప్రముఖ పారిశ్రామికవేత్త అరవింద రెడ్డిని బెదిరించి రూ.7 కోట్లు డిమాండ్ చేసిన భారీ దోపిడీ కేసులో వైశాఖ్ ప్రధాన నిందితుడు. ఆ బెదిరింపు లేఖ వ్యవహారంలో పారిశ్రామికవేత్త ఇచ్చిన ఫిర్యాదుతో అప్పట్లో పోలీసులు వైశాఖ్‌ను అరెస్ట్ చేశారు. కొంతకాలం జైలు జీవితం గడిపిన తర్వాత అతను బెయిల్‌పై బయటకు వచ్చాడు.

# ఆటోలోనే గర్భిణీ ప్రసవం

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్26 (జనంసాక్షి) :** ప్రభుత్వాలు మారుతున్నా ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతులు, వైద్య సౌకర్యాలు మాత్రం మెరుగుపడటం లేదు. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలో అర్ధరాత్రి వేళ ఒక గర్భిణీకి ఎదురైన అనుభవం ఇక్కడి వైద్య లీలలను కళ్ళకు కడుతోంది.పినపాక మండలం అమరారం గ్రామానికి చెందిన కలివేటి సంధ్య అనే గర్భిణీకి అర్ధరాత్రి అకస్మాత్తుగా పురిటి నొప్పులు వచ్చాయి. అత్యవసర సహాయం కోసం కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ప్రయత్నించగా అది అందుబాటులో లేదు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన 108 వాహనాన్ని వేరే ప్రాంతానికి తరలించడమే దీనికి కారణం. విధిలేని పరిస్థితుల్లో వారు ఒక ఆటోను మాట్లాడుకుని సంధ్యను జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తీరా అక్కడికి వెళ్లేసరికి పీహెచ్‌సీ తాళం వేసి ఉండటంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. అక్కడి నుండి పినపాక పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే సంధ్య ఆటోలోనే ఒక బిడ్డకు జన్మనిచ్చింది. తొలి కాన్పు కావడంతో ఆమె పురిటి నొప్పులతో అల్లాడిపోయింది. తీవ్ర రక్తస్రావం కావడంతో నరకయాతన అనుభవించింది. ప్రస్తుతం మణుగూరులోని 100 పడకల ఆసుపత్రిలో తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. రాత్రి వేళల్లో పీహెచ్‌సీలు మూసి ఉంచడం, అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఏజెన్సీ ప్రాంతాల్లో నిరంతర అంబులెన్స్ సౌకర్యంతో పాటు, రాత్రి వేళల్లో కూడా పీహెచ్‌సీలలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తిరుపతికి 2 బుల్లెట్ ట్రైన్స్!

- హైదరాబాద్-చెన్నైమార్గం గుండా తిరుపతి
- ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదన
- ప్రతిపాదనకు లభించిన ప్రాథమిక అంగీకారం
- త్వరలోనే కార్యరూపం దాల్చనున్న ప్రాజెక్టు



**తిరుపతి, జూన్26 (జనంసాక్షి) :** దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన హైస్పీడ్ బుల్లెట్ రైలు ప్రాజెక్టుల మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీలక కేంద్రంగా మారనుంది. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ కారిడార్‌ను రాజధాని అమరావతి మీదుగా నిర్మించాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్) సానుకూలంగా స్పందించింది. అదే సమయంలో చెన్నై-బెంగళూరు కారిడార్‌లోని చిత్తూరును, హైదరాబాద్-చెన్నై మార్గంలోని తిరుపతితో అనుసంధానించే ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదనకు సైతం ప్రాథమిక అంగీకారం లభించింది. ఈ కీలక నిర్ణయంతో దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలన్నీ ఒకే నెట్‌వర్క్‌తో అనుసంధానమయ్యే అద్భుత అవకాశం ఏర్పడింది. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ కారిడార్ మొత్తం 760.09 కిలోమీటర్ల మేర మూడు రాష్ట్రాల మీదుగా విస్తరించనుంది. ఇందులో తెలంగాణలో 180.32 కిలోమీటర్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 518.54 కిలోమీటర్ల మేర మార్గం ఉండనుంది. తమిళనాడులో 61.23 కిలోమీటర్ల మేర ఈ మార్గం సాగుతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 18 స్టేషన్లను ప్రతిపాదించారు. తెలంగాణలో హైదరాబాద్, శంషాబాద్ సహా ఆరు స్టేషన్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో కలిపి తొమ్మిది స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు చిత్తూరు-తిరుపతి మధ్య సుమారు 65 కిలోమీటర్ల పొడవున ప్రత్యేక హైస్పీడ్ లింక్ కారిడార్ ఏర్పాటును ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. దీనికోసం తుది స్థల నిర్ధారణ సర్వే, వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి సంస్థ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నివేదిక సిద్ధమైన వెంటనే కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకు పంపి తుది ఆమోదం తీసుకోనున్నారు. ఈ లింక్ కారిడార్ అందుబాటులోకి వస్తే, బెంగళూరు నుంచి చిత్తూరు, తిరుపతి మీదుగా అమరావతి వరకు నేరుగా బుల్లెట్ రైలులో ప్రయాణించే వెసులుబాటు కలుగుతుంది.మరోవైపు 306 కిలోమీటర్ల పొడవైన చెన్నై-బెంగళూరు హైస్పీడ్ కారిడార్‌లో చిత్తూరు ప్రధాన స్టేషన్‌గా నిలవనుంది. ఇందులో తమిళనాడులో 133 కిలోమీటర్లు, కర్ణాటకలో 101 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 72 కిలోమీటర్ల మార్గం ఉండనుంది. మూడు రాష్ట్రాల్లో కలిపి మొత్తం ఏడు స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ నెట్‌వర్క్ పూర్తయితే పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు ఊహించని రీతిలో భారీ ఊతం లభిస్తుంది. ముఖ్యంగా తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే లక్షలాది భక్తులకు అత్యంత వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారత హైస్పీడ్ రైలు వ్యవస్థకు కేంద్ర బిందువుగా మారుతోంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అమరావతి నగరాలను ఒకే నెట్‌వర్క్‌లో అనుసంధానం చేయడం ద్వారా భారీగా పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉంది. పరిశ్రమలు విస్తరించడం, ఉపాధి అవకాశాలు పెరగడం వంటి సానుకూల ఫలితాలు రాష్ట్రానికి దక్కనున్నాయి. ప్రస్తుతం సర్వేలు, డీపీఆర్ తయారీ ప్రక్రియలను వేగవంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారులను ఆదేశించడంతో ఈ కలల ప్రాజెక్టు త్వరలోనే కార్యరూపం దాల్చనుంది. ఈ ప్రాజెక్టు అమలుతో రవాణా సమయం భారీగా తగ్గడమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ హైస్పీడ్ మార్గాలు దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. పర్యాటక రంగానికి కూడా ఈ బుల్లెట్ రైళ్లు కొత్త ఊపిరిని పోయనున్నాయి. ఏపీ కేంద్రంగా సాగే ఈ అభివృద్ధి ప్రయాణం రాబోయే కాలంలో అనేక మైలురాళ్లను అధిగమించనుంది. ప్రస్తుతం అధికారులు సర్వే పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. భూసేకరణ, సాంకేతిక అనుమతుల విషయంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం నిధులను కూడా దశలవారీగా విడుదల చేసేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. బుల్లెట్ రైలు రాకతో ఏపీ మౌలిక వసతులు ప్రపంచ స్థాయికి చేరుకోవడమే కాకుండా, దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు మార్గం సుగమం కానుంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370